fb/prajasakti, www.prajasakti.com

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 83 | విజయవాడ, సోమవారం 26 మార్చి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

ఆర్థికసంస్కరణలకు ఐక్య ప్రతిఘటన

- సిఐటియు జనరల్ కౌన్సిల్‌లో వక్తలు

8

భారత దేశపు తొలి పాసింజర్ ప్లేన్ 'సరస్'

- 19 సీట్ల టర్బో ప్లాప్ విమానం
- నిర్మాణ సమయం 18 ఏళ్ళు

8



వైభవంగా ధ్వజారోహణం

- ఒంటిమిట్టలో నవమి వేడుకలు ప్రారంభం
- పట్టువస్త్రాలు సమర్పించిన మేడా మల్లికార్జునరెడ్డి

12

90 శాతం మంది 'పెద్దలు' కోటీశ్వరులే..!

తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: పెద్దల(రాజ్య) సభకు ఎంపికైన వారిలో 90 శాతం మంది కోటీశ్వరులేనన్న విషయం తాజా అధ్యయనంలో వెల్లడయింది. వీరి సగటు ఆస్తి విలువ రు.55 కోట్లకు పైమాటే... నేషనల్ ఎలక్షన్ వాచ్, అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ అనే సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఈ అధ్యయనంలో రాజ్యసభకు ఎంపికైన సభ్యులు ఎన్నికల సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్లను విశ్లేషించారు.




మొత్తం 229 మంది రాజ్యసభ సభ్యుల్లో 201 మంది కోటీశ్వరులేనని ఈ విశ్లేషణలో వెల్లడయింది. దాదాపు 201 మంది సభ్యులు రు.కోటికి పైగా విలువైన ఆస్తులున్నట్లు ప్రకటించగా వారిలో 84 మంది తమకు రు.పదికోట్లకు పైగా విలువైన ఆస్తులున్నాయని వెల్లడించారు. బీహార్ నుండి జెడి(యు) తరపున రాజ్యసభకు ఎన్నికైన ప్రముఖ పారిశ్రామిక వేత్త మహేంద్ర ప్రసాద్ వీరందరిలో ధనికుడట. ఈయన మొత్తం ఆస్తుల విలువ రు.4,000 కోట్ల పైమాటే.. ఇక వీరిలో రెండో స్థానంలో వున్నది మాజీ హీరోయిన్, సమాజ్‌వాది పార్టీ సభ్యురాలు జయాబచన్. ఈమె ఆస్తుల విలువ రు.వెయ్యి కోట్లపై మాటే.. వీరి తరువాత బిజెపి ఎంపి రవీంద్రకిషోర్ సిన్హా రు.857 కోట్ల విలువైన ఆస్తులతో మూడో స్థానంలో నిలిచారు. పార్టీల వారీగా విశ్లేషించినపుడు 64 మంది బిజెపి ఎంపిల ఆస్తుల సగటు విలువ రు.27 కోట్లు కాగా, 50 మంది కాంగ్రెస్ ఎంపిల ఆస్తుల సగటు విలువ రు.40 కోట్ల పైమాటే..తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 13 మంది ఎంపిల సగటు ఆస్తుల విలువ రు.12 కోట్లు కాగా, సమాజ్‌వాది పార్టీకి చెందిన 14 మంది సభ్యుల ఆస్తుల సగటు విలువ దాదాపు రు.92 కోట్లు. ఈ సంస్థలు ఎంపిల ఆస్తులను మిగతా 9లో

మీ కుమారుడి సంగతేంటి?

అమిత్‌షాకు చంద్రబాబు ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'ప్రజల ఆకాంక్షను చెప్పి, ఎన్‌డిఎ నుండి బయటకు వస్తే నాపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. అమిత్ షా కుమారుడు జైషా సంగతేంటి? ఆయనపై పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. వీటిపై అమిత్ షా మాట్లాడరా?' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. తన కుమారునిపై వస్తున్న ఆరోపణలకు అమిత్‌షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై టిడిపి నేతలతో ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మనపై ఆరోపణలు చేస్తున్న వారు రాజ్యసభ ఎన్నికల్లో ఎంతగా దిగజారారో ప్రత్యక్షంగా చూశాం' అని అన్నారు. యుపి, గుజరాత్‌లో బలం లేకున్నా అదనపు రాజ్యసభ సీటు కోసం కుయుక్తులు పన్నడాన్ని దేశమంతా చూసిందన్నారు. టిడిపికి ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే తక్కువున్నా తాము మూడో స్థానానికి పోటీ పడలేదని గుర్తు చేశారు. ప్రజల మనోభావాలకనుగుణంగా కేంద్రాన్ని హోదా అడగడం బిజెపికి నచ్చడంలేదన్నారు. హోదాకు సమానంగా ఆర్థిక సాయం చేస్తామంటేనే అంగీకరించామన్నారు. ఈఎపిలకు నిధులిస్తామని చెప్పి కనీసం మెమో కూడా ఇవ్వలేదన్నారు. నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు స్పెషల్ పర్పస్ వెహికల్ అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిఎస్‌టిలో కూడా ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక లబ్ధి చేకూర్చుతున్నారని, ఆయా రాష్ట్రాలకు ఇచ్చేవన్నీ ఎపికి కూడా ఇవ్వడం బిజెపికి ఇష్టం లేదన్నారు. కేంద్రం తొలి బడ్జెట్‌లోనే గొడవ పడితే రాజకీయం అంటారనే ఇన్నాళ్లు అగామన్నారు. విధి లేని



పరిస్థితిలోనే ఎన్‌డిఎ నుంచి బయటకొచ్చి పోరాటమార్గం పట్టామన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులన్నింటకీ యూసీలు ఇచ్చామన్నారు. యూసీలివ్వనందునే నిధులు నిలుపుదల చేశామని కేంద్రం చెప్పడం అబద్ధమన్నారు. అమరావతికిచ్చిన రూ. 1000 కోట్లకు యూసీలిచ్చామని, గుంటూరు, విజయవాడకు ఇచ్చిన నిధుల్లో రూ. 350 కోట్లకు కూడా యూసీలిచ్చామన్నారు.

విజయసాయిరెడ్డి ఆర్థిక నేరస్తుడే

విజయ్‌సాయిరెడ్డికి ఒక న్యాయం, విజయమాల్యాకు మరో న్యాయమా అని ఈ సందర్భంగా చంద్రబాబు కేంద్రాన్ని ప్రశ్నించారు. ఇద్దరూ ఆర్థిక నేరస్తులేనని, వారి మధ్య వ్యత్యాసం ఏమిటని మిగతా 9లో

అంబేద్కర్ స్ఫూర్తి ప్రదాత

మన్‌కి బాత్‌లో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : పపంచ ఆర్థిక రంగంలో భారత్ ముందుకు పోతున్నదని, అభివృద్ధి, ఆవిష్కరణల కేంద్రంగా మారడంతో ప్రపంచం యావత్ భారత్ వైపే చూస్తున్నదని ప్రధాని మోడీ అన్నారు ఉన్నతమైన మౌలిక సౌకర్యాలతో శక్తివంతమైన నగరాలు ఏర్పడాలని అంబేద్కర్ కలలు గన్నారన్నారు. స్వయం సమృద్ధి విషయంలో డాక్టర్ అంబేద్కరే మనందరికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారన్నారు. రైతులు తాము పండించిన ఉత్పత్తికి తగిన ధర తీసుకునేలా సహాయ పడాలని ఈ ఏడాది బడ్జెట్ రూపకల్పనలో నిర్ణయం తీసుకున్నామని అన్నారు. ప్రతి నెలా చివరి ఆదివారం మన్‌కి బాత్ కార్యక్రమం ద్వారా పలు అంశాలపై ఆయన ప్రసంగిస్తారన్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఈ వారం రైతు సమస్యలపై జాతినుద్దేశించి మాట్లాడారు. ప్రధానంగా ఈశాన్య రాష్ట్రాలలో వ్యవసాయం గురించి మాట్లాడుతూ రికార్డు స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తిని సాధించిన ఆ ప్రాంత రైతులను మిగతా 9లో

మోడీ యాప్ డేటా చోరీ చేస్తోంది : రాహుల్



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడి యాప్ డేటాను చోరీ చేసి అమెరికా కంపెనీలకు ఇచ్చిందని రాహుల్ గాంధీ ఆదివారం విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని లక్ష్యంగా చేసుకుని రాహుల్ ట్వీట్ల దాడిని కొనసాగిస్తూనే ఉన్నారు. కేంబ్రిడ్జి ఎనాలిటికా వివాదం నేపథ్యంలో మోడీపై రాహుల్ దాడి తీవ్రతను పెంచారు. నరేంద్ర మోడి యాప్ కోరుతూ అప్లికేషన్ కోసం సైన్ అప్ చేసిన వారి డేటాను తీసుకు వెళ్ళేందుకు అమెరికన్ కంపెనీలను ఆయన అనుమతించారన్నారు. "హాయ్! నా పేరు నరేంద్ర మోడి. నేను భారత దేశపు ప్రధాన మంత్రిని. మీరు నా అధికారిక యాప్ కోసం సైన్‌అప్ చేస్తే, అమెరికా కంపెనీలలో ఉన్న మా మిత్రులకు మీ డేటాను అందిస్తాను." అని మోడి అన్నట్లు వ్యంగ్యంగా రాహుల్ ట్వీట్ చేశారు. కేంబ్రిడ్జ్ ఎనాలిటికా డేటా లీక్ చేయడం వివాదమైన నేపథ్యంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఫేస్‌బుక్ వినియోగదారుల మిగతా 9లో

మిర్చి కన్నీరు.. అపరాలు దిగాలు

ప్రతి ఏటా జరుగుతున్నదే పునరావృత్తమవుతోంది. రైతు సంక్షేమమే ధ్యేయమని చెప్పుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ రైతుకు సరైన గిట్టుబాటు ధర ఇప్పించడంలో నిర్లక్ష్యం వహించడమేగాక దళారులను ప్రోత్సహిస్తున్నాయి. కర్నూలులో వ్యాపారులు కుమ్మక్కై మిర్చి రైతులను మోసం చేస్తున్నారు. ఫిబ్రవరిలో క్వింటా రూ.10 వేలు ఉండగా, ఆకస్మాత్తుగా రూ.2 వేల నుండి 5400లకు పడిపోవడంతో రైతులు ఆందోళన చేశారు. ఫలితంగా రూ.8 వేల నుండి రూ.10 వేలకు పెంచారు. అయితే వ్యాపారులు మళ్లీ రింగ్‌గా ఏర్పడి రూ.5 వేల నుండి రూ.6500లకు తగ్గించారు. గుంటూరు జిల్లాలో రెండేళ్లుగా ధరలు బాగా రావడం, ప్రభుత్వం నుండి వరికి ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని సూచించడంతో రైతులు కంది, మినుము, పెసర సాగు చేశారు. అయితే ఈ ఏడాది రైతులకు గిట్టుబాటు ధర రాలేదు. ప్రస్తుతం మార్కెట్‌లో మినుముల ధర రూ.3,800 పడిపోయింది. పెసలు రూ.4000, వేరుశనగ రూ.4 వేలకు తగ్గింది.



కర్నూలు మార్కెట్‌కు తెచ్చిన మిరప


ప్రజాశక్తి - కర్నూలు /గుంటూరు జిల్లా ప్రతినిధులు

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు కుమ్మక్కై మిరప రైతులను మోసం చేస్తున్నారు. గత నెలలో క్వింటా ధర గరిష్టంగా రూ. 10 వేలు ఉండగా వ్యాపారులు సగానికి సగం తగ్గించారు. రూ. 2 వేల నుంచి రూ.5400కు వేలం పాడారు. దీంతో రైతులు ఆగ్రహించి ఆందోళన చేయడంతో మిగతా 9లో

లెక్కలేనితనం

రైతుల ఆత్మహత్యలపై సర్కారు కర్కశం

- నాలుగేళ్లల్లో 248 అంటూ ప్రకటన
- ఎన్‌సిఆర్‌బి నివేదికల్లో మూడేళ్లకే 915
- వ్యవసాయ కార్మికులు మరో 1,497
- ఎక్స్‌గ్రేషియా ఎగవేతకే ఏపి కోతలు



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

జాతికి అన్నం పెట్టే అన్నదాతల ఆత్మహత్యలు పెను విషాదం కాగా వాటి లెక్కింపులో చంద్రబాబు సర్కారు చూపుతున్న పిసినారితనం కసాయితనాన్ని మించిపోయింది. వ్యవసాయం గిట్టుబాటుకాక అప్పుల్లో నిండా మునిగిన రైతులు వేరే దారి లేక మరణమే శరణ్యంగా భావించి బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు గత ప్రభుత్వం రూ.లక్షన్నర ఎక్స్‌గ్రేషియా ఇవ్వగా టిడిపి సర్కారు రూ.ఐదు లక్షలకు పెంచినట్లే పెంచి, వీలైన మేరకు ఎక్స్‌గ్రేషియా చెల్లింపులను తగ్గించుకునేందుకు ఆత్మహత్యలను అధికారికంగా గుర్తించ నిరాకరిస్తోంది. ప్రతి రోజూ ప్రతిక, ప్రసార మాద్యమాల్లో రైతుల ఆత్మహత్యల కథనాలు వెల్లువెత్తుతున్నప్పటికీ సర్కారు వాటిని మిగతా 9లో

గణాంకాల్లో తేడా

ఏడాది	ఎన్‌సిఆర్‌బి	ఎపి
2014	160	18
2015	516	160
2016	239	51
2017	250*	19

* ఇంకా అధికారికంగా వెల్లడించలేదు



తెలంగాణలో ఘోర ప్రమాదం

- బావిలో పడిపోయిన ఆటో
- 11 మంది మృతి
- 8మందికి గాయాలు
- కెసిఆర్ దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


సకాలంలో ఆర్టీసీ బస్సుల్ని నడపకపోవడం, గంటల తరబడి నిలబడలేక ఆటోల్లో కిక్కిరిసిన ప్రయాణం, ఆటో డ్రైవర్ అలసత్వం వెరసి 11 మంది జలసమాధి అయ్యారు. మరో ఎనిమిది మంది గాయాలపాలయ్యారు. మృతుల్లో నలుగురు చిన్నారులు, ఆరుగురు మిగతా 9లో

గ్రామాలకు రోడ్లు వేసేదెప్పుడు?

అనుసంధానం లేని ప్రాంతాలు 11,907

సిఎం సొంత జిల్లాలోనే అధికం

గిరిజన ప్రాంతాల్లో మరీ దారుణం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజధానిని సింగపూర్ తరహాలో నిర్మిస్తామని చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాతంత్ర్యం వచ్చి ఆరు దశాబ్దాలు దాటినా నేటికీ రోడ్డు సౌకర్యం లేని గ్రామాల గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. ఒకవైపు రాజధానిలో లెక్కకు మించి ఎక్స్‌ప్రెస్ హైవేలను వేల కోట్లతో నిర్మిస్తామంటున్న సర్కారు కనీసం రబ్బీసు రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు రోడ్డు సౌకర్యాన్ని కల్పించలేకపోతోందన్న విమర్శలొస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ లెక్కల ప్రకారం 11,907 ప్రాంతాలకు సమీపంలోని ప్రధాన రహదారులకు నేటికీ అనుసంధానం కాకపోవడం గమనార్హం. 47,745 ప్రాంతాల్లో రహదారి అనుసంధానం చేసినవి కేవలం 35,838 మాత్రమే. రహదారి అనుసంధానం లేని గ్రామాలకు రాకపోకలు సాగించడానికి స్థానికులు నిత్యం సమస్యల్ని ఎదుర్కోవాల్సి వస్తోంది. గిరిజన ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. సిఎం సొంత జిల్లా చిత్తూరులోనే రహదారి సౌకర్యంలేని ఆవాసాలు అత్యధికంగా 2,800 వరకు ఉండటం విశేషం. కేంద్ర ప్రభుత్వం పిఎంజిఎస్‌వై, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కొన్నేళ్ల కిందట నిర్మించిన రహదారులు నేడు గోతుల మయంగా మారి, రాకపోకలు సాగించలేదని పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల ప్రధాన గ్రామాలకు రహదారులున్నా శివారు ప్రాంతాలకు మాత్రం ఈ సౌకర్యం లేదు. రాష్ట్రంలో 3,194 గిరిజన తండాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో కొండగట్ల మధ్య రాళ్ల రప్పల్లో గిరిజనులు రాకపోకలు సాగిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య చికిత్స అందక మరణానికి గురవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అనంతపురం, గుంటూరు, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో ఆయా ప్రాంతాల్లో రహదారుల్లే గ్రామీణులు పడుతున్న ఇబ్బందుల్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. గిరిజన ప్రాంతాలైన పాడేరు, యర్రగొండపాలెం, అరకు, పాతపట్నం, సకినేటిపల్లి నియోజవర్గాలలో గిరిజన గ్రామాలు, తండాలకు మిగతా 9లో

శ్రీరామనవమి సందర్భంగా ముఖ్యమంత్రి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అమరావతిబ్యూరో

శ్రీరామనవమి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అష్టకష్టాలు ఎదురైనా ధర్మాన్ని విడిచిపెట్టని శ్రీరామచంద్రుడు ఆదర్శ నీయుడని పేర్కొన్నారు. సమస్యల నుంచి పారిపోకుండా సంక్షోభాల్ని ఎదుర్కొని ఎలా విజయం సాధించవచ్చో ఆయన నిరూపించారని తెలిపారు. ధర్మానికి నష్టం వాటిల్లితే ఎంతటి వారినైనా శిక్షించడానికి వెనుకాడేవాడు కాదని చంద్రబాబు పేర్కొన్నారు. కడప జిల్లా ఒంటిమిట్టలో రాష్ట్ర ప్రభుత్వం శ్రీరామనవమి వేడుకల్ని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 30న సీతారాముల కళ్యాణాన్ని నిర్వహిస్తామన్నారు. తాము అధికారంలోకొచ్చాక ఒంటిమిట్ట ఆలయాన్ని అభివృద్ధి చేశామన్నారు.

దారి పొడువునా వినతులు

జగన్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎస్ ఉద్యోగులు



జగన్‌కు వినతిపత్రాల వెల్లువ

ప్రజాశక్తి-నరసరావుపేట/సత్తెనపల్లి రూరల్

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ చేపట్టిన పాదయాత్ర ఆదివారం 120వ రోజుకు చేరుకుంది. గుంటూరు జిల్లా నరసరావుపేటలో లో ఉదయం ప్రారంభమైన పాదయాత్ర సత్తెనపల్లి నియోజవకర్గం ముప్పాళ్ల వరకూ కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఎస్ రద్దు చేయించాలని ఉద్యోగులు, తెలుగు విశ్వవిద్యాలయాన్ని నర్సరావుపేటలో ఏర్పాటు చేయాలని, తెలుగు అకాడమీ స్దాపించాలని శ్రీనాథ సాహితీ పరిషత్ నాయకులు స్వర్ణ రామిరెడ్డి వినతిపత్రాలు అందజేశారు. పంటలకు ధరల్లేకపోవడంపై రైతులు జగన్‌కు విన్నవించారు. బీటెక్ విద్యార్థులు జగన్ కలసి ప్రత్యేక హోదా పోరాటం మరింత ఉధృతం చేయాలని, తామూ భాగస్వామ్యం అవుతామని చెప్పారు. 108 మంది సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రాలిచ్చారు. వైసిపి జెండాను ఆవిష్కరించిన జగన్ కేక్‌ను కట్ చేయడంతోపాటు వైఎస్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం ముప్పాళ్ల మండలం గోళ్లపాడు మీదుగా సాయంత్రానికి చాగంటివారిపాలేనికి యాత్ర చేరింది. రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో సత్తెనపల్లి నియోజకవర్గ వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. చాగంటివారిపాలెం వద్ద ఆదివారం రాత్రి బసచేసి సోమవారం ఇక్కడే నిర్వహించే శ్రీరామనవమి వేడుకల్లో జగన్ పాల్గొంటారని నాయకులు తెలిపారు. ఈ క్రమంలో పాదయాత్రకు సోమవారం విరమం ప్రకటించారు.



విశాఖ ఏజెన్సీలో వర్షాలు

రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ ఏజెన్సీలో ఆదివారం కొన్ని ప్రదేశాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడ్డాయి. పాడేరు, జికెవీధి, జి.మాడుగుల, చింతపల్లి, పెదబయలు, కొయ్యూరు మండలాల పరిసర ప్రాంతాల్లో చల్లని మేఘాలు ఏర్పడి వర్షాలు కురిశాయి. వేసవి తొలినాళ్లలో స్థానికంగా ఉండే చల్లని మేఘాల కారణంగా ఈ వర్షాలు పడినట్లు విశాఖపట్నం వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. విశాఖ ఏజెన్సీలో పిడుగులు పడే అవకాశం కూడా ఉందని, సాధ్యమైనంతవరకూ సురక్షితమైన ప్రాంతాల్లోకి ప్రజలను ఉంచాలన్న ఆదేశాలు కూడా రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ నుంచి వెలువడ్డాయి. మరోవైపు రాష్ట్రమంతటా సాధారణ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయన్నారు. కొద్దిరోజుల పాటు ఇదే వాతావరణం కొనసాగుతుందన్నారు.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని భారత్ ఎప్పుడు విజయవంతంగా పరీక్షించింది?
2. ఈశాన్య రాష్ట్రాలకు ఇస్తున్న పారిశ్రామిక పన్ను ప్రోత్సాహకాలను కేంద్రం ఎప్పటి వరకూ పొడిగించింది?
3. గనులు, ఖనిజాలపై 3వ జాతీయ సమావేశాలు ఎక్కడ నిర్వహించారు?
4. బీహార్ గవర్నర్ సత్య పాల్ మాలిక్‌ను ఏ రాష్ట్రానికి అదనపు గవర్నర్‌గా నియమించారు?
5. ప్రపంచంలోనే పొడవైన ఇసుకరాతి గుహాలు 'క్రెమ్ పూరి'ను ఎక్కడ కనుగొన్నారు?

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ప్రత్యామ్నాయ విధానాలతోనే వ్యవసాయం వృద్ధి

- సాగుతో పాటు సామాజిక సమస్యలపైనా పోరాటం
- ఆగస్టు 9న దేశవ్యాప్త జైల్‌భరో
- సెప్టెంబరు 5న ఢిల్లీలో కిసాన్ మజ్దూర్ ర్యాలీ
- ఎఐకెఎస్ జాతీయ సహాయ కార్యదర్శి విజూ కృష్ణన్



సెమినార్‌లో ప్రసంగిస్తున్న విజూ కృష్ణన్. వేదికపై కంచ ఐలయ్య, కాకి మాధవరావు, తమ్మినేని వీరభద్రం, ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

ప్రత్యామ్నాయ విధానాలతోనే సంక్షోభంలో చిక్కుకున్న వ్యవసాయరంగం వృద్ధిలోకి వస్తుందని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ సహాయ కార్యదర్శి విజూ కృష్ణన్ అన్నారు. వామపక్షాలు అధికారంలో ఉన్న కేరళలో ప్రత్యామ్నాయ విధానాలనే అమలు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే కేరళ ప్రభుత్వం రూ.800 అదనంగా ఇస్తోందన్నారు. ఏప్రిల్ 18 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరుగనున్న సిపిఎం 22వ అఖిల భారత మహాసభలు పురస్కరించుకుని సిపిఎం తెలంగాణ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అధ్యక్షతన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం 'తెలంగాణ రాష్ట్ర ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా' అంశంపై సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌లో వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, ప్రభుత్వాల విధానాలు, ప్రత్యామ్నాయ పాలసీలు తదితరాంశాలపై విజూ కృష్ణన్ మాట్లాడారు. నూతన సరళీకృత ఆర్థిక విధానాలు అమల్లోకొచ్చాకే వ్యవసాయరంగం సంక్షోభంలోకి కూరు కుపోయిందన్నారు. సాగు సమస్యలతో పాటు దేశవ్యాప్తంగా సామాజిక అణిచివేత, ఆర్థిక అసమానతలపై కూడా పోరాటాలు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ పోరాటాల ద్వారా కేంద్రంలోని మోడీ సర్కారు అవలంభిస్తున్న ప్రజా, రైతు, దేశ వ్యతిరేక విధానాల్ని ప్రజలకు వివరిస్తూ ఎక్కడికక్కడ ఎండగడతామన్నారు. జాతీయ స్థాయిలో ఉద్యమించటం ద్వారా రైతులు, వ్యవసాయ కార్మికులకు అండగా నిలవాలని ఎఐకెఎస్, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా నిర్ణయించాయన్నారు. వ్యవసాయ సంక్షోభం వల్ల కూలీలుగా జీవిస్తున్న దళితులు, ఆదివాసీలు నష్టపోతున్నారన్నారు. కర్నాటకలో దేవదాసీ వ్యవస్థ వల్ల అక్కడి మహిళలు 'లైంగిక బానిసలు'గా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారందరినీ సమీకరించి దేవదాసీ విమోచన్ సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. రైతులకు ఎంతో చేస్తున్నామని చెబుతున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు సైతం స్వామినాథన్ కమిటీ, జయతీఘోష్ కమిటీ సిఫారసులను అమలు చేయటం లేదన్నారు. ఈ సిఫారసులను ఆమలు చేయకుండా పంట పెట్టుబడి పేరుతో ఎకరానికి రూ.4 వేలు ఇవ్వడం వల్ల ఎలాంటి ఉపయోగమూ ఉండదన్నారు. పెట్టుబడి పథకం కౌలు రైతులకు వర్తించకపోవడం సరికాదన్నారు. విత్తన భాండాగారాలుగా విలసిల్లిన తెలుగు రాష్ట్రాలు ఇప్పుడు విత్తన కొరతను ఎదుర్కొంటున్నాయన్నారు. పంటలకు గిట్టుబాటు ధరల్లేకపోవటం, మార్కెటింగ్ సౌకర్యాల లేమి, ధాన్యం, ఇతర పంటలను ప్రభుత్వాలు సేకరించకపోవటం, అప్పులు, వడ్డీల కారణంగా రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

మహారాష్ట్ర రైతు ర్యాలీ స్ఫూర్తితో...

మహారాష్ట్రలో నిర్వహించిన రైతు ర్యాలీ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమాల్ని బలోపేతం చేయాలని నిర్ణయించినట్టు కృష్ణన్ తెలిపారు. ఇందులో భాగంగా ఆగస్టు 9న అన్ని రాష్ట్రాల్లో జైల్‌భరో నిర్వహిస్తామని చెప్పారు. 10 కోట్ల మంది సంతకాల్ని సేకరిస్తామన్నారు. సెప్టెంబరు 5న ఢిల్లీలో 'కిసాన్ మజ్దూర్ ర్యాలీ' నిర్వహిస్తామన్నారు. ఈ సెమినార్‌లో కె నాగేశ్వర్, కంచ ఐలయ్య, ఎస్ వీరయ్య, కాకి మాధవరావు, సూరేపల్లి సుజాత తదితరులు మాట్లాడారు.



సభలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి రాంబాబు

చట్టాలపై అవగాహనతోనే హక్కుల పరిరక్షణ

హైకోర్టు న్యాయమూర్తి రాంబాబు

ప్రజాశక్తి - వెంకటాచలం

చట్టాలపై అవగాహన ఉంటే హక్కులను కాపాడు కోవడానికి వీలవుతుందని హైకోర్టు న్యాయమూర్తి రాంబాబు అన్నారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఆదివారం ఆసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రత్యేక న్యాయ సేవా శిభిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఉపయోగపడే చట్టాల గురించి చాలా మందికి తెలియదన్నారు. అది తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనీ, కొందరు భయం కారణంగా, మరికొందరు ఖర్చుకు వెనకాడి కోర్టులకు వెళ్లడం లేదనీ వివరించారు. దాంతో వారి హక్కులను వారే కాలసుకుంటున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నా... అవి లబ్ధిదారులకు చేరడం లేదన్నారు. మొదటి తరగతి అదనపు న్యాయమూర్తి శ్యామల మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు ఉన్న చట్టాలను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, సంక్షేమ శాఖ అధికారులు ఆయా శాఖల వారీగా పథకాల అమలు గురించి లబ్ధిదారులకు వివరించి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి సుధా, అదనపు కలెక్టర్లు ప్రశాంతి, వెంకటసుబ్బారెడ్డి, అదనపు ఎస్పి శరత్‌బాబు, విశ్వవిద్యాలయ ఉపకులపతి వీరయ్య, రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

హోదా రాకుండా కుట్ర : రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు హోదా రాకుండా బిజెపి, టిడిపి కుట్ర చేస్తున్నాయని పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నాలుగేళ్లు కలిసి ఉండి, ప్రస్తుతం అధికార, ప్రతిపక్షాలుగా మారి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో అమిత్‌షా రూ.1.40 లక్షల కోట్లకు లెక్కలు చెప్పినప్పుడే చంద్రబాబు స్పందిచాల్సిం దన్నారు. ఇప్పుడు చంద్రబాబు స్పందనకు విశ్వసనీయత లేదన్నారు. మోడీ, అమిత్‌షాలు ఇద్దరూ అబ ద్ధాలకోరులేనని పేర్కొన్నారు. ఎపి విభజన సంద ర్భంగా కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా నష్టపోయిందని, కానీ అన్ని విధాలుగా తెలుగు ప్రజలకు న్యాయం చేయడానికి ప్రయత్నించిందన్నారు. నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఇచ్చిన హామీలు అమలైతే ఎపికి రూ. 5 లక్షల కోట్ల విలువైన ప్రయోజనాలు నెరవేరతాయని తెలిపారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని మోడీ దెబ్బతీస్తే, చంద్రబాబు 5 కోట్ల ప్రజల హోదా హక్కును, ఆత్మగౌరవాన్ని మోడీ కాళ్ల దగ్గర పెట్టారన్నారు.

రాజీనామాలపై తుది నిర్ణయం?

నేడు ముప్పాళ్లలో వైసిపి ఎంపిల సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రత్యేక హోదా ఇవ్వకుంటే ఏప్రిల్ 6న తమ పార్టీ ఎంపీలు రాజీనామా చేస్తారని ప్రకటించిన వైసిపి అధినేత వైఎస్ జగన్ సోమవారం ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఏప్రిల్ 6న కాకుండా అంతకంటే ముందుగానే రాజీనామాలు చేయాలనే ఆలోచనా పార్టీ నేతల్లో వచ్చిన నేపథ్యంలో గుంటూరు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం మండల కేంద్రమైన ముప్పాళ్లలో వైసిపి ఎంపీల సమావేశం నిర్వహించనున్నారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా ఆదివారం ముపాళ్లకు చేరుకున్న జగన్ సోమవారం శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం ఎంపీలతో సమావేశమవుతారు. లోకసభలో మంగళవారం అవిశ్వాస తీర్మానం చర్చకు అనుమతిస్తే అనుసరించాల్సిన వ్యూహం, చర్చకు అనుమతించకుంటే ఎలా వ్యవహరించాలన్న అంశంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. తాము తొలుత అవిశ్వాసం ప్రతిపాదిస్తే ఎగతాళి చేసిన టిడిపి అధినేత చంద్రబాబు తర్వాత ఆయనే వైసిపి అవిశ్వాసం మద్దతిస్తామని ప్రకటించడం, ఆ తర్వాత టిడిపి నేరుగా అవిశ్వాసం నోటీసిచ్చిన నేపథ్యంలో రాజకీయంగా టిడిపి వ్యవహారశైలిని ఎండగట్టడంపైనా చర్చిస్తారని తెలుస్తోంది.

చంద్రబాబు తప్పుడు ప్రచారం

వైసిపి అధికార ప్రతినిధి సుధాకర్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ముమ్మరంగా జరుగుతున్న ప్రత్యేక హోదా ఉద్యమం నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి టిజెఆర్ సుధాకర్‌బాబు విమర్శించారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. బ్యాంకుల్ని మోసం చేసిన సుజనా చౌదరి, భూకబ్జాలకు పాల్పడిన దీపక్‌రెడ్డి వంటి నేరస్తుల్ని పక్కన పెట్టుకుని హోదా కోసం పోరాడుతున్న ఎంపి విజయసాయిరెడ్డిపై ఎలా ఆరోపణలు చేస్తారని ప్రశ్నించారు. వంగవీటి మోహనరంగాను చంపిన నేరస్థుడు వెలగపూడి రామకృష్ణ ప్రస్తుత టిడిపి ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్నాడన్నారు. పేకాట క్లబ్‌లు నడిపిన ఎంపి మాగంటి బాబు, మహిళా తహశిల్దారును నడిరోడ్డుపైనే కొట్టిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను ఏమనాలన్నారు. 22 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన చంద్రబాబు విలువల గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీకి నారా లోకేష్ ఏ విధంగా వారసుడవుతాడన్నారు. ఆశ్రయం ఇచ్చిన నందమూరి కుటుంబాన్నే నాశనం చేయడమే కాకుండా ఎన్టీఆర్ కుమార్తె పురందేశ్వరి, కుమారుడు హరికృష్ణల ఊసే లేకుండా చేశారన్నారు. ప్రత్యేక హోదా ఉద్యమాన్ని పక్కదారి పట్టించడానికి అనుకూల మీడియాతో ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు గమనిస్తూనే ఉన్నారని సుధాకర్‌బాబు పేర్కొన్నారు. చంద్రబాబుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

సిబ్బందికి అడ్డగోలు శిక్షలపై రేపు రాష్ట్ర వ్యాప్త ధర్నాలు

- 3న నిరాహార దీక్షలు
- ఆర్టీసి ఎస్‌డబ్ల్యూఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసిలో పనిచేసే సిబ్బందికి శిక్షలు విధించే నిబంధనల్లో మార్పు చేయాలని కోరుతూ ఈనెల 27న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపట్టనున్నట్లు ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూ ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య, ప్రచార కార్యదర్శి ఎం అయపరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏప్రెల్ 3న నిరాహార దీక్షలు చేపడతామని పేర్కొన్నారు. తప్పు లేకుండా కండక్టర్లకు శిక్షలు విధించకూడదని కోరారు. తప్పు లేకుండా శిక్ష వేస్తున్నట్లు గతంలో ఆర్టీసీ ఎండి పరిశీలనలో కూడా తేలిందని, మొదటి సారి తప్పుకే సస్పెన్షన్, రిమూవల్ వంటి పెద్ద శిక్షలు వేయకూడదని గైడ్‌లైన్స్‌లో పేర్కొన్నారని తెలిపారు. నేటికీ ఆర్టీసిలో ఉద్యోగ భద్రత లేదని, మార్చి 13న ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం ఇకపై కూడా ఉద్యోగ భద్రత ఉండదనే విషయం స్పష్టమవుతోందని పేర్కొన్నారు. సర్క్యులర్ 1/2018లో ఆర్టీసిలో సమస్యలు ఉండవని, కార్మికులు ప్రేరణతో చక్కగా పని చేస్తారని వెల్లడించారని, అయితే తాజా సర్క్యులర్‌లోని శిక్షలు, జరిమానాలు ఆర్టీసి కార్మికుడిని శిక్షల ఉచ్చులో బిగించాయని తెలిపారు. ప్రయాణికులు టికెట్టు తీసుకోనందుకు కండక్టర్‌కు శిక్ష వేస్తామనడం శోచనీయమని పేర్కొన్నారు. కండక్టర్‌కు ఆరు నెలల నుంచి రెండేళ్ల ఇంక్రిమెంట్లు నిలపడం దేశంలోని ఏ ఆర్టీసిలోనైనా ఉందా అని వారు ప్రశ్నించారు. 1, 2 అనుబంధాల్లో పేర్కొన్న జరిమానాలు, శిక్షల్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రత్యేకం

బిసి సంక్షేమం గాలికి!

- 68 మంది వెల్ఫేర్ ఆఫీసర్లు బదిలీ
- హాస్టళ్లను రద్దు చేసేందుకు సర్కారు కుట్ర
- టెన్త్ ఉత్తీర్ణతా శాతంపై నీలినీడలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని గాలికొదిలేసింది. 13 జిల్లాలకు చెందిన 68 మంది బిసి వెల్ఫేర్ సహాయ ఆఫీసర్లను సిబ్బంది కొరత పేరుతో బిసి కార్పొరేషన్‌కు బదిలీ చేసింది. బిసి కార్పొరేషన్ రుణాలు సద్వినియోగం కావడం లేదనే సాకుతో రికవరీ చేస్తోంది. వసతి కేంద్రాల్లో పర్యవేక్షణను పట్టించుకోవడం లేదు. ఫలితంగా పదో తరగతి ఉత్తీర్ణతపై తీవ్ర ప్రభావం పడే అవకాశముంది. ఉత్తీర్ణత శాతం ఆధారంగా పలు హాస్టళ్లను ఎత్తివేయడంలో భాగంగా సర్కారు ఇలాంటి కుట్రలు పన్నుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రాష్ట్రంలోని బిసి హాస్టళ్లలో వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇటువంటి ఆవరోధాల మధ్య ఎదురీదుతున్న నిరుపేద విద్యార్థుల భవిష్యత్‌పై దెబ్బకొట్టడంపైనా ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రంలోని 1,253 హాస్టళ్లలో 1,30,413 మంది టెన్త్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నారు. కడప జిల్లాలోని 78 హాస్టళ్లకు



చెందిన 1,111 మంది పరీక్షలు రాస్తున్నారు. 2015-16లో 99.64 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. తాజా బదిలీల నేపథ్యంలో పర్యవేక్షణ కొరవడింది. టెన్త్ ఉత్తీర్ణతపై తీవ్ర ప్రభావం పడనుంది. దీని ఆధారంగా పలు హాస్టళ్లను మూసివేసే ఎత్తుగడ ఉందనే ఆందోళన నెలకొంది. కడప జిల్లాలో నలుగురు సంక్షేమాధికారులు ఉండాలి. ఇప్పటివరకూ ఇద్దరే ఉండడంతో పర్యవేక్షణ గాలిలో కలిసింది. మెనూ ప్రకారం భోజనం, కాస్మొటిక్ ఖర్చుల పంపిణీ, ట్యూటర్ల ద్వారా బోధన, రికార్డుల నమోదు, పల్లెనిద్ర, టెన్త్‌క్లాస్ ప్రిపరేషన్, మానిటరింగ్, మెడిటేషన్ వంటి వ్యవహారాలను వీరు మానిటరింగ్ చేయాల్సి ఉంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో అనంతపురం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలోని బిసి కార్పొరేషన్ విభాగంలో ఇద్దరు చొప్పున సిబ్బంది కొరత పేరుతో మిగిలిన 11 జిల్లాల పరిధిలోని జిల్లాలకు ఇద్దరు చొప్పున 68 మంది డిసిడబ్ల్యూఒలని కార్పొరేషన్‌కు బదిలీ చేసింది. కడపలో ఇద్దరు, కర్నూలులో ముగ్గురు, అనంతపురంలో ఇద్దరు, చిత్తూరులో నలుగురు, నెల్లూరులో ఇద్దరు, గుంటూరులో నలుగురు, ప్రకాశంలో ఇద్దరు, శ్రీకాకుళంలో నలుగురిని, విజయనగరంలో ఇద్దరు, తూర్పుగోదావరిలో ముగ్గురు, విశాఖలో నలుగురు, పశ్చిమగోదావరిలో ముగ్గురు, కృష్ణాలో నలుగురు వెల్ఫేర్ అధికారులను కార్పొరేషన్‌కు బదిలీ చేసింది.

జిల్లాలోని బ్యాంకులకు యుసిలు, జ్ఞాన్ పోర్టల్‌లో స్కాలర్‌షిప్‌ల నమోదు నిమిత్తం జిల్లాకు ఇద్దరి నుంచి నలుగురు చొప్పున బదిలీ చేయడం విమర్శలకు ఆస్కారం కలిగిస్తోంది. రెండు పనులనూ నిర్వహిస్తామన్న విజ్ఞప్తిని పెడచెవిన పెట్టి బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. అధికారులను కార్పొరేషన్ పరిధిలోని జూనియర్ అధికారుల కింద ఆపాయింట్ చేయడంతో మనస్పర్థలకు ఆస్కారం కలిగిస్తోంది. ఇప్పటికే కడప జిల్లాలో 24 మందికి చెందిన బిసి రుణాలను గ్రహీతల నుంచి రికవరీ చేసినట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది స్వయం ఉపాధి కల్పన కృషిని ప్రభుత్వం నీరుగార్చుతోంది. బదిలీ చేసిన (డిసిడబ్ల్యూఒ) సంక్షేమ అధికారుల జీతభత్యాల మంజూరును సైతం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల తరహాలో సహచర ఉద్యోగుల ఖాతాల్లో వేయడంతో హైకోర్టును ఆశ్రయించే యోచనలో అధికారులు ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

సంక్షిప్తం

కెఇ కృష్ణమూర్తికి దేవాదాయ శాఖ

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

దేవాదాయ, ధర్మాదాయ శాఖ బాధ్యతల్ని రెవెన్యూ శాఖ మంత్రి కెఇ కృష్ణమూర్తికి అప్పగించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఈ శాఖ మంత్రిగా పనిచేసిన పైడికొండల మాణిక్యాలరావు రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

బిజెపి నష్టం చేస్తోంది : మంత్రి కొల్లు రవీంద్ర

ఆంధ్రప్రదేశ్‌కు బిజెపి ఉద్దేశపూర్వకంగానే నష్టం చేయాలని చూస్తోందని క్రీడలు, న్యాయ, యువజన సర్వీసుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. విజయవాడలోని సిఎం క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, బిజెపి జాతీయ అధ్యక్షులు అమిత్‌షా రాసిన 9 పేజీల లేఖలో ఒక్క వాస్తవం కూడా లేదన్నారు. రాజధాని నిర్మాణానికి రూ. 1500 కోట్లు మాత్రమే ఇచ్చి రూ.2500 కోట్లు ఇచ్చామనడం దారుణమన్నారు. కేటాయించిన నిధుల్ని వెనక్కి తీసుకున్న ఘనత కూడా వారికే దక్కుతుందన్నారు. రకరకాల సాకులతో హోదా అంశాన్ని అణగదొక్కాలని చూస్తున్నారన్నారు.

నేడు సురేంద్రబాబు బాధ్యతల స్వీకరణ

ఎపిఎస్ ఆర్టీసి మేనేజింగ్ డైరెక్టర్ (ఎండి)గా నియమితులైన ఎన్‌వి సురేంద్ర బాబు సోమవారం బాధ్యతల్ని స్వీకరించనున్నారు. ఆర్టీసి హౌస్‌లో ఉదయం 11 గంటలకు ఆయన బాధ్యతల్ని చేపట్టనున్నారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ అడిషనల్ డిజిగా పని చేసిన ఆయన 2001 నుంచి 2004 మధ్య విజయవాడ సిటీ కమిషనర్‌గా పనిచేశారు. 2006-2007 మధ్యలో హైదరాబాద్ సిటీ పోలీస్ అడిషనల్ కమిషనరేట్‌లో కో ఆర్డినేషన్ విభాగంలో సేవలందించారు. అంతకుముందు హైదరాబాద్ సిటీ పోలీస్ విభాగంలో ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్‌గా పని చేశారు. 2007లో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదోన్నతి పొందారు. 2008లో మక్కా మసీదు బాంబింగ్ కేసులో ఎపి పోలీస్ దళం సభ్యులుగా ఉన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గానూ, ఎక్సైజ్ శాఖలోనూ పని చేశారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారిపై కాల్పులు

- ఆర్థిక లావాదేవీలే కారణం
- పోలీసుల అదుపులో నిందితుడు

ప్రజాశక్తి-విజయనగరం కంటోన్మెంట్



తుపాకీ కాల్పుల్లో గాయపడిన రియల్ ఎస్టేట్ యజమాని అప్పలరాజు

విజయనగరంలో తుపాకీ కాల్పులు కలకలం రేపాయి. పోలీసుల కథనం మేరకు..ట్యాంక్‌బండ్ రోడ్డులోగల మయన్‌హోమ్స్ రియల్ ఎస్టేట్ కార్యాలయంలో తగరపువలసకు చెందిన యజమాని నమ్మి అప్పలరాజుపై విజయనగరం పట్టణంలోని తోటపాలేనికి చెందిన పాత నేరస్తుడు బొత్స రామ్మోహన్ శనివారం రాత్రి తుపాకీతో ఐదురౌండుల కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన అతనిని విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తర లించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారైన నమ్మి అప్పలరాజు మామయ్యకు, నిందితుడు రామ్మోహన్‌కు మధ్య ఓ భూమి విషయమై 2016 నుంచి వివాదం నడుస్తోంది. దీన్ని సెటిల్ చేసే బాధ్యతను తన అల్లుడు అప్పలరాజుకు అప్పగించినట్లు తెలిసింది. సెటిల్‌మెంట్ కోసం రామ్మోహన్‌తో మాట్లాడేందుకు రాత్రి 9 గంటల సమయంలో తన కార్యాలయానికి అప్పలరాజు పిలిచినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వీరి మధ్య సుమారు గంటసేపు ఘర్షణ జరిగినట్లు సమాచారం. మాటా మాటా పెరిగి అప్ప లరాజుపై ఐదు రౌండ్లు కాల్పులు జరిపి, అక్కడి నుంచి రామ్మోహన్ పరారైనట్లు తెలిసింది. ఆ సమయంలో కార్యాల యంలో పనిచేస్తున్న బంగారప్పడును యజమాని అప్పలరాజు ఏదో పనిమీద బయటకు పంపాడు. పని చూసుకొని వచ్చిన బంగారప్పడుకు కాల్పులు శబ్దం వినిపించగా, ఆఫీసులోకి పరుగెత్తుకొని వెళ్లాడు. దీంతో బంగారప్పడుపై కూడా కాల్పులు జరిపేందుకు నిందితుడు ప్రయత్నించగా, అతడు పరుగెత్తుకొని మరో ఐదుగురిని ఘటనా స్థలానికి తీసుకొచ్చాడు. అప్పటికే నిందితుడు పరారయ్యాడు. రక్తపు మడుగులో ఉన్న అప్పలరాజును పక్కనే ఉన్న తిరుమల నర్సింగ్‌హోమ్‌కు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖలోని కేర్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌పి ఎ.వెంకటరమణ, సిసిఎస్ డిఎస్‌పి చక్రవర్తి ఆసుపత్రికి, తరువాత ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పరారీలో ఉన్న నిందితుడు రామ్మోహన్‌ను ఆదివారం ఉదయం పోలీసులు పట్టుకొని విచారిస్తున్నారు. నిందితుడు పాత నేరస్తుడుగా గుర్తించారు.

31 వరకు గీతం ప్రవేశపరీక్ష దరఖాస్తులు

ప్రజాశక్తి- విశాఖపట్నం

గీతం విశ్వవిద్యాలయం విశాఖపట్నం, హైదరాబాద్‌లతో పాటు బెంగళూరు క్యాంపస్‌లో నిర్వహిస్తున్న ఇంజనీరింగ్‌లో 10 కోర్సులకు, 17 ఎంటెక్ కోర్సులకు, బి-ఫార్మసీ, ఎమ్-ఫార్మసీ కోర్సులకు, ఐదేళ్ల బి.ఆర్క్ కోర్సుకు రెండేళ్ల ఎమ్.ఆర్క్ కోర్సులకు నిర్వహిస్తున్న గ్యాట్-2018 ప్రవేశపరీక్ష దరఖాస్తు తేదీని మార్చి 31 వరకు పొడిగించినట్లు అడ్మిషన్ల డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నరేంద్ర తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తిమేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. గీతం ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో www.gitam.edu ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. గ్యాట్-2018 ప్రవేశ పరీక్షకు సంబంధించిన ధరఖాస్తులు దేశవ్యాప్తంగా అన్ని యూనియన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్ శాఖలలో లభిస్తాయని పేర్కొన్నారు. ఏప్రిల్ 11 నుంచి 26 వరకు ఈ ప్రవేశపరీక్ష జరుగుతుందన్నారు.



సైకిల్ ర్యాలీ

అనంతపురం జిల్లాలో లేపాక్షి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న బాలకృష్ణ, ఎంపి నిమ్మల కిష్టప్ప, తదితరులు

లేపాక్షి గొప్పదనం తెలిపేలా ఉత్సవాలు

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం టౌన్

శిల్ప కళా నిలయమైన లేపాక్షి గొప్పదనాన్ని ప్రపంచానికి తెలియజేసేలా ప్రభుత్వ ఆధ్వర్యంలో లేపాక్షి ఉత్సవాలను నిర్వహిస్తామని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. ఈ నెల 31, ఏప్రిల్ 1న జరిగే లేపాక్షి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు వద్ద బెలూన్‌ను ఆవిష్కరించారు. అక్కడి నుంచి నంది విగ్రహం వరకు సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. బాలకృష్ణ సైకిల్ తొక్కుతూ ప్రజలను ఉత్సాహ పరిచారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ.. లేపాక్షి ఉత్సవాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. అందుకు తగ్గట్టుగానే రెండు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి ఉత్సవాలు విజయవంతం అయ్యేలా కృషి చేయాలని కోరారు. అనంతరం హిందూపురంలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో బాలకృష్ణ పాల్గొన్నారు. అనంతపురం జిల్లా కలెక్టర్ వీరపాండియన్, హిందూపురం ఎంపి నిమ్మల కిష్టప్పతో పాటు టిడిపి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విచారణ కమిటీతోనైనా న్యాయం జరిగేనా?

- 'పోలవరం' ఎల్‌టిఆర్ కుంభకోణం
- ఆదివాసీలకిచ్చే భూ పరిహార దోపిడీ
- 'పశ్చిమ'లో రూ.600 కోట్లు గిరిజనేతరుల ఖాతాల్లోకి
- నేతల నుంచి అధికారుల వరకూ అంతా పాత్రధారులే

ప్రజాశక్తి-ఏలూరు ప్రతినిధి

పోలవరం ప్రాజెక్టుకు భూసేకరణ అధికార పార్టీ నాయకుల, అధికారుల దోపిడీకి అడ్డాగా మారింది. ఆదివాసీలకు చెందాల్సిన ఎల్‌టిఆర్ భూముల నష్ట పరిహారాన్ని అడ్డగోలుగా గిరిజనేతర భూస్వాములకు కట్టబెట్టి సుమారు రూ.600 కోట్లు దారి మళ్లించారు. దీనిపై గిరిజనులు అనేక పోరాటాలు చేసినా పట్టించుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై డిఆర్‌డిఎ పీడీని విచారణాధికారిగా హైకోర్టు ప్రత్యేక విచారణ కమిటీని నియమించింది.

'పోలవరం' ముసుగులో సాగిన ఎల్‌టిఆర్ భూముల సేకరణ అతిపెద్ద కుంభకోణంగా గిరిజనులు పేర్కొంటున్నారు. మన్యంలో 1/70, పీసా చట్టాలకు ప్రభుత్వం తూట్లు పొడిచింది. 1970కు ముందు ఇతరులకు ఏవైనా పట్టాలు ఉంటేనే వారికి హక్కులు వర్తిస్తాయి. మన్యంలో భూ సేకరణ చేపట్టాలంటే గ్రామసభలు నిర్వహించి, భూముల వివరాలను తెలియపరిచి అందరి ఆమోదంతో తీర్మానం చేయాలి. పోలవరం ముసుగులో జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో ప్రభుత్వం చట్టాలను తుంగలో తొక్కింది. గిరిజనులకు చెందాల్సిన భూముల పరిహారం గిరిజనేతర భూస్వాములకు ఇచ్చేశారు. 2005లో అప్పటి రాష్ట్ర గిరిజన శాఖా మంత్రి రెడ్యానాయక్ అసెంబ్లీలో మాట్లాడుతూ 'పశ్చిమ' మన్యంలో 55 వేల ఎకరాల ఎల్‌టిఆర్ భూములు ఉన్నట్లు ప్రకటించారు. ఎన్నో పోరాటాలతో 15 వేల ఎకరాలను గిరిజనులు దక్కించుకున్నారు. మిగిలిన 40 వేల ఎకరాలు గిరిజనేతర భూస్వాముల చేతుల్లోనే ఉన్నాయి. దీనిపై గిరిజనులు రెండు దశాబ్దాలుగా పోరాడుతున్నారు. టిడిపి అధికారం చేపట్టిన తర్వాత భూస్వాములకు మేలు చేసేందుకు కుట్రలకు తెరలేపింది.



పశ్చిమ గోదావరి జిల్లా జీలుగుమిల్లిలో ఎల్‌టిఆర్ భూమి

పోలవరం భూసేకరణ ముసుగులో రూ.600 కోట్లు గోల్‌మాల్

పోలవరం ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోతున్న గిరిజనులకు ప్రభుత్వం భూమి కొనుగోలు చేసి భూమికి భూమి కింద ఇవ్వాల్సి ఉంది. జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో ఇప్పటివరకూ పోలవరం ప్రాజెక్టు నిమిత్తం ఏడువేల ఎకరాలను సేకరించినట్లు లెక్కలు చెబుతున్నాయి. భూసేకరణలో అత్యధికం ఎల్‌టిఆర్ భూములే ఉన్నట్లు గిరిజనులు చెబుతున్నారు. ఎకరాకు రూ.10.50 లక్షల చొప్పున పరిహారం కింద దాదాపు రూ.600 కోట్ల ప్రభుత్వ సొమ్మును అడ్డదారుల్లో భూస్వాముల ఖాతాల్లోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. గిరిజనేతర భూస్వాముల చేతుల్లో ఉన్న భూములకు సంబంధించిన పరిహారంతోపాటు, గిరిజనులు సాగు చేసుకుంటున్న భూముల పరిహారం సైతం భూస్వాముల ఖాతాల్లో ప్రభుత్వం జమచేసింది. ఇందుకోసం ఎంపీ, ఎంఎల్‌ఎ, ఐఎఎస్, స్థానిక అధికారులంతా కుమ్మక్కై రికార్డులను సైతం మార్చేసినట్లు గిరిజనులు చెబుతున్నారు. కోర్టులో ఉన్న భూములకు సైతం పరిహారం ఇచ్చేశారు. బుట్టాయగూడెం రెవెన్యూ పరిధిలోని కోటనాగారానికి చెందిన జమ్ముల అర్జునుడు, కొయ్యల శ్రీనివాసరావు మరికొందరు గిరిజనులు ఎడబ్ల్యూ భూములుగా పేర్కొన్న ఆర్‌ఎస్ నెంబరు 765లో 4.42 ఎకరాలు, 782లో 12.55 ఎకరాల ల్యాండ్ సీలింగ్ భూమి, సర్వేనెంబర్ 772-2, 158, 791-4లో ఉన్న 6.26 ఎకరాల ల్యాండ్ సీలింగ్ భూములను ఆరేళ్లుగా సాగు చేసుకుంటున్నారు. ఎస్‌డిసి (భూసేకరణ డిప్యూటీ కలెక్టర్) కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. ఈ భూములకు సంబంధించి ఎకరాకు రూ.10.50 లక్షల పరిహారాన్ని గిరిజనేతర భూస్వాముల ఖాతాల్లోకి జమ చేశారు. ఇదే మండలం మెట్టగూడెంలో పూనం నాగమణి, ఆకుల వెంకటలక్ష్మి, ఆకుల భారతి, మరికొందరు గిరిజనులు ఆర్‌ఎస్ నెంబర్లు 150-1, 195-1, 195-4, 730, 733-2, 731, 733-1లో మొత్తం 18.51 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నారు. ఎస్‌డిసి కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. ఈ భూములపై కేసు తేలకుండానే పరిహారం భూస్వాముల ఖాతాల్లోకి జమ చేశారు. గతంలో గిరిజనులకే చెందుతాయని అధికారులు స్పష్టం చేసిన, కోర్టులు తీర్పులిచ్చిన భూములకు సైతం భూస్వాములకే పరిహారం ఇచ్చేయడం కొసమెరుపు. 12 మంది గిరిజనులు న్యాయంకోసం కోర్టును ఆశ్రయించారు. గిరిజనులకు అన్యాయం జరిగిందంటూ కోర్టులో ప్రజాప్రయోజన వాజ్యం దాఖలైంది. దీంతో, కోర్టుకు వెళ్లిన గిరిజనుల భూములకు సంబంధించిన సొమ్ము కోర్టు ఆదేశాలతో నిలుపు చేశారు. హైకోర్టు విచారణ కమిటీని నియమించింది.

సమగ్ర విచారణ చేసి ఆదివాసీలకు న్యాయం చేయాలి



ఎల్‌టిఆర్ భూముల విషయంలో ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరిస్తోందని పార్టీలు, ప్రజా సంఘాలు మొదటి నుంచి చెబుతూనే ఉన్నాయి. దీనిపై కోర్టు విచారణ కమిటీని నియమించడం మంచి పరిణామం. పోలవరం ప్రాజెక్టు ముసుగులో ఆదివాసీలకు జరిగిన అన్యాయంపై సమగ్ర విచారణ చేసి, న్యాయం చేయాలని కోరుతున్నాం.

- ఎ.రవి,
సిపిఎం పోలవరం డివిజన్ కార్యదర్శి

కరెన్సీ కష్టాలకు 500 రోజులు

- 50 రోజుల్లో అద్భుతమన్నారు..
- సామాన్యులను చితగ్గొట్టేశారు..
- బ్యాంకుల్లో నగదు డిపాజిట్లకు ఖాతాదారుల నిరాసక్తత
- 70 శాతం ఎటిఎంల మూత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశంలో పెద్ద నోట్ల రద్దు వల్ల ఏర్పడిన కరెన్సీ కష్టాలు 500 రోజులైనా తొలగిపోలేదు. కేవలం 50 రోజులు ఓపిక పట్టండి.. దేశంలోని నల్లధనాన్ని వెలికి తీస్తాం.. మీరు 50 రోజులు సహకరిస్తే ఎన్నో అద్భుతాలు జరుగుతాయి.. అని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేసిన ప్రధాని మోడీ 500 రోజులుగా కష్టాలు కొనసాగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. కేవలం వందల సంఖ్యలో ఉన్న కుబేరులు, నల్లధనం అధికంగా ఉన్న బడా పారిశ్రామిక వేత్తలు, అధికారులు, రాజకీయ పెద్దలను నియంత్రించలేక కోట్లాది మంది ప్రజలను ఏడాదిన్నరగా ముప్పతిప్పలు పెడుతున్నారన్న విమర్శలు విన్పిస్తున్నాయి. కేవలం రూ.2 లక్షలకు మించి డిపాజిట్ ఉంటే వెంటనే ఆదాయపు పన్ను శాఖ నోటీసులు వస్తుండటంతో ప్రజలు డిపాజిట్లు చేసేందుకు భయపడుతున్నారు. 2016 నవంబరు ఎనిమిది రాత్రి పెద్ద నోట్ల రద్దు నిర్ణయం ప్రకటించారు. శనివారం నాటికి 500 రోజులు అయింది. అప్పటికీ ఇప్పటికీ బ్యాకింగ్ రంగంలో ఎన్నో మార్పులు రావడం, బ్యాంకు లావాదేవీలపై నియంత్రణలతో ప్రజలు బ్యాంకులకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ఖాతాదారులు తమ ఖాతాల్లోని సొమ్ము తీసుకునేందుకు ఇప్పటికీ ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర సమయాల్లో ఎటిఎంలకు వెళితే నగదు అందుబాటులో ఉండటం లేదు. 70 శాతం ఎటిఎంలు పనిచేయడం లేదు. పనిచేస్తున్న ఎటిఎంల్లో ఎప్పుడు నగదు ఉంటుంటో.. ఎప్పుడు ఉండదో తెలియడం లేదు. నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు కొన్ని రోజులపాటు నియంత్రణ భరించాలని చెప్పిన సిఎం చంద్రబాబు సైతం ఇటీవల పార్టీ శ్రేణులు, రైతులు, సామాన్యుల నుంచి కరెన్సీ కష్టాలపై వ్యతిరేకత వస్తుందని గ్రహించడం వల్లే ముందుగా మేల్కొని నిధులివ్వడం లేదని సాకుగా చూపి బిజెపికి దూరమయ్యారని టిడిపి వర్గాల్లో ప్రచారమవుతోంది. బ్యాంకుల్లోని డిపాజిట్లనూ ప్రజలు క్రమంగా ఉపసంహరించుకుంటున్నారు. కొత్తగా బ్యాంకుల్లో డిపాజిట్లు చేసేందుకు ప్రజలు గతంలో మాదిరిగా ఉత్సాహంగా ముందుకు రావడం లేదు. అంతేగాకుండా కేంద్ర ప్రభుత్వం ఎఫ్ఆర్‌డిఐ బిల్లును ఆమోదిస్తే బ్యాంకుల్లోని తమ డిపాజిట్లకు రక్షణ ఉండదన్న ప్రచారం జోరుగా సాగడంతో అనేక మంది డిపాజిటర్లు తమ బ్యాంకుల నుంచి తమ డిపాజిట్లను ఉపసంహరించుకుంటున్నారు. కనీస నిల్వల మొత్తాలను పెంచడం, కనీస నిల్వ లేని వారికి జరిమానాలు పెంచడం, ఎటిఎంల వినియోగం, బ్యాంకుల సేవలపై యూజర్ ఛార్జీలు అమలు చేయడం తదితర కారణాలతో ప్రజలు బ్యాకింగ్ వ్యవస్థపై ఏడాదిన్నర కిందటి వరకు ఉన్న నమ్మకాన్ని ఇప్పుడు క్రమంగా కోల్పోయే పరిస్థితి ఏర్పడింది.



సింహపురి సంస్కృతి సమాఖ్య ఆధ్వర్యంలో

ఘనంగా ఉగాది పురస్కారాలు

సినీనటుడు సుమన్‌కు సత్కారం

ప్రజాశక్తి -నెల్లూరు

సింహపురి సంస్కృతి సమైక్య ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు పురమందిరంలో ఉగాది సంబరాల పురస్కారాలను ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషాభివృద్ధికి ప్రముఖ రచయితలకు, కళారంగం, సేవారంగాలలో విశిష్ట సేవలందించిన పదిమందికి ఈ సందర్భంగా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటుడు సుమన్‌తోపాటు, నుడా వైస్ చైర్మన్ ఢిల్లీరావు, విక్రమ సింహపురి యూనివర్శిటీ ప్రొఫెసర్ ఎస్.వీరయ్య, నగర డిఎస్‌పి మురళీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభ ప్రారంభంలో విద్యార్థులు చేపట్టిన జానపద శాస్త్రీయ, నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం సింహపురి సంస్కృతిక సమాఖ్య నేతలు, నగర ప్రముఖులు సినీ నటుడు సుమన్‌ను ఘనంగా సత్కరించారు. ఉగాది పురస్కారాల సందర్భంగా జరిగిన సభలో సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ.. నెల్లూరు అంటే తనకు ఎంతో అభిమానమని పేర్కొన్నారు. తన తొలి సినిమా ఆకలికి జోహార్లు చిత్రం షూటింగ్ నెల్లూరులో జరిగిందన్నారు. జిల్లాలో తనకు అనేక మంది అభిమానులు ఉండటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. క్యారెక్టర్ ఆర్టిస్టు స్థాయి నుంచి నటుడి స్థాయికి తీసుకొచ్చింది తెలుగు ప్రేక్షకులేనన్నారు. వారి ఆదరణతోనే 99 సినిమాలను చేశానని పేర్కొన్నారు. అన్నమయ్య, శ్రీరామదాసు, శివాజీ వంటి చిత్రాలు తనకు మంచి గుర్తింపునిచ్చాయన్నారు. ఛండీరాణి చిత్రంలో డూప్‌లేకుండా నిజంగా పులితో ఫైటింగ్ చేయడం ఇప్పటికీ మరిచిపోలేనన్నారు. ఇప్పట్లోలా నాడు గ్రాఫిక్స్ ఉండేవి కావన్నారు.ఆ చిత్రాన్ని నెల్లూరుకు చెందిన పిసిరెడ్డి నిర్మించారని తెలిపారు.



సుమన్‌ను సత్కరిస్తున్న సింహపురి సంస్కృతి సమైక్య నేతలు

విద్యలో మతతత్వ ధోరణులు ప్రమాదకరం

యుటిఎఫ్ భవన ప్రారంభ సభలో ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీనివాస్

ప్రజాశక్తి - అమలాపురం (తూర్పుగోదావరి)

విద్యలో మతతత్వ ధోరణులు దేశానికి ప్రమాదకరమని ఆంధ్రజ్యోతి ఎడిటర్ డాక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో అనేక ఉద్యమాలకు కేంద్రంగా నిలిచిన ఎంప్లాయిస్ హోం స్థానంలో నిర్మించిన నూతన భవనాన్ని వత్సవాయి సూర్యనారాయణరాజు సతీమణి రాధామణి ఆదివారం ప్రారంభించారు. మినీ హాలును హైకోర్టు సీనియర్ న్యాయవాది అప్పారి సత్యప్రసాద్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన అమరజీవులు అప్పారి వెంకటస్వామి, వత్సవాయి సూర్యనారాయణరాజు స్మారకోపన్యాస సభకు యుటిఎఫ్ తూర్పుగోదావరి జిల్లా శాఖ అధ్యక్షులు డివి.రాఘవులు అధ్యక్షత వహించారు. సభలో శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రభుత్వ విద్యను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ విద్య ద్వారానే సామాజికన్యాయం అందుతుందన్నారు. పిల్లలకు శాస్త్రీయ దృక్పథం కలిగించే విద్యను బోధించాలన్నారు. పిల్లల్లో ప్రశ్నించే ఆలోచనను పెంపొందించే విధంగా బోధించాలన్నారు. దేశంలో మేధో చిత్రపటాన్ని నాశనం చేస్తున్నారన్నారు. ప్రశ్నించే ప్రజాశక్తులను నిలువరించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్న వారు దేశభక్తికి కొత్త అర్థాలు చెబుతున్నారని తెలిపారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది సత్యప్రసాద్ మాట్లాడుతూ యుటిఎఫ్ ఉద్యమానికి అండగా ఉంటామన్నారు. మహనీయుల త్యాగాలతో నిర్మితమైన సంఘం యుటిఎఫ్ అన్నారు. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి రాము సూర్యారావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులు సమస్యలపై పోరాడాలన్నారు. అనంతరం యుటిఎఫ్ ప్రచురించిన అరుణాంజలి పుస్తకాన్ని ఆవిష్కరించారు. వివిధ జానపద కళాకారులు జానపదగీతాలు ఆలపించారు. అనంతరం యుటిఎఫ్ హోం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ సాబ్జి, ప్రధాన కార్యదర్శి టి.బాబురెడ్డి, సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ న్యూఢిల్లీ జడ్జి వత్సావాయి అజయ్ కుమార్ తదితరలు పాల్గొన్నారు.



అరుణాంజలి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీనివాస్, నాయకులు

రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - గూడూరు రూరల్

వరుసగా రెండేళ్ల పంటల సాగులో నష్టాలు రావడంతో అప్పుల బాధ తాళలేక రైతు సురేష్ (23) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లా గూడూరు తూర్పు బిసి కాలనీలో నివాసం ఉంటున్న నడిపి హనుమంతు, పెద్ద కేశమ్మ నాల్గో కుమారుడు సురేష్ సొంత పొలం ఆరెకరాలతో పాటు మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశాడు. రెండేళ్లలో ఉల్లి, పత్తి పంటలు సాగు చేయగా వర్షాభావం వలన గిట్టుబాటు ధరల్లేక రూ.4 లక్షల వరకు అప్పు మిగిలింది. ఈ ఏడాది మూడెకరాల్లో పప్పు శనగ సాగు చేశాడు. వర్షాభావంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. దీంతో రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లింది. మూడేళ్లపాటు వరుసగా పంటల సాగు కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో వాటిని ఎలా తీర్చాలోనని తీవ్ర మనోవేధనకు గురయ్యాడు. ఆదివారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సురేష్ మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. సురేష్‌కు డోన్ మండలం వెంకటరాయునిపల్లె గ్రామానికి చెందిన ఈశ్వరమ్మతో 2015లో వివాహమైంది. తొమ్మిది నెలల కుమారుడు ఉన్నాడు.

ఆర్‌టిసి బస్సు బోల్తా, ఇద్దరు మృతి

పలువురికి గాయాలు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తమిళనాడు ఆర్‌టిసి బస్సు బోల్తాపడి ఇద్దరు మృతిచెందిన సంఘటన ఆదివారం తిరుపతి రూరల్ మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తమిళనాడు సేలం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు శనివారం రాత్రి 9 గంటల సమయంలో సేలం నుంచి తిరుపతికి బయలుదేరింది. ఉదయం 4.50 గంటలకు చిత్తూరు-పూతలపట్టు మార్గంలో డ్రైవరు నిద్రమత్తుగా ఉండడంతో ఓ హోటల్ వద్ద టీ తాగాడు. బైపాస్‌రోడ్డులోని పాతకాల్వ సమీపంలో ఉన్న వకుళామాత ఆలయం వద్దకు వచ్చేసరికి డ్రైవరును నిద్రలోకి జారుకున్నాడు. దీంతో ఒక్కసారిగా బస్సు రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొడుతూ 50 అడుగుల దూరం వెళ్లి సమీప కల్వర్టు వద్ద తలకిందులుగా పడిపోయింది. ఈ ప్రమాదంలో వెంగంపట్టికి చెందిన డ్రైవరు వెంకటాచలం(37) అక్కడికక్కడే మృతి చెందారు. బస్సులో ప్రయాణిస్తున్న మరో ప్రయాణికుడు తమిళనాడు పరంబాళంకు చెందిన సుందరం(26) మృతి చెందాడు. 15 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎంఆర్ పల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన తమిళనాడు ఆర్‌టిసి బస్సు

ప్రత్యేకం

జన్మభూమి కమిటీలదే పెత్తనం!

- కార్పొరేషన్ రుణాల్లో అవినీతి కంపు
- లక్ష రుణానికి రూ.12 వేలు మామూళ్లు!
- దళారులు, బ్యాంకర్లు కుమ్మక్కు
- అన్నీపోను చేతికందేది రూ.31 వేలే

ప్రజాశక్తి-ఏలూరు ప్రతినిధి

బిసి, కాపు కార్పొరేషన్ రుణాల మంజూరులో పశ్చిమగోదావరి జిల్లాలో అవినీతి విలయతాండవం చేస్తోంది. రుణం మంజూరైనా యూనిట్ ఏర్పాటు చేయలేని దుస్థితి లబ్ధిదారులకు ఏర్పడింది. టిడిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత జిల్లాలో బిసిలు 6,129 మందికి, కాపులు 9,259 మందికి ఆయా కార్పొరేషన్ల రుణాలను ప్రభుత్వం మంజూరు చేసింది. దాదాపు రూ.110 కోట్లు సబ్సిడీని విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ రుణాలతో లబ్ధిదారులు ఏమైనా యూనిట్లు స్థాపించుకున్నారా.. లబ్ధి పొందారా అంటే లేదనే చెప్పాలి. రుణాలు మంజూరైన వారిలో 90 శాతం మంది యూనిట్ స్థాపించలేని పరిస్థితి నెలకొంది. అందుకు ప్రధాన కారణం జన్మభూమి కమిటీలు, బ్యాంకర్లేనని చెప్పొచ్చు. లబ్ధిదారులు యూనిట్ ప్రాతిపదికగా రూ.2 లక్షలు, రూ.లక్ష రుణాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఎక్కువమందికి రుణాలిచ్చినట్లు లెక్కలు చూపించుకునేందుకు యూనిట్‌తో సంబంధం లేకుండా ప్రతి లబ్ధిదారునికీ రూ.లక్ష చొప్పున రుణం మంజూరు చేశారు. రుణాల మంజూరులో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే అధికారులు ఇచ్చినట్లు తెలుస్తోంది. అత్యధికంగా టిడిపి అనుయాయులకే రుణాలు అందాయని సమాచారం. రూ.లక్ష రుణమైనా లబ్ధిదారులకు అందించారా అంటే అదీ లేదు. రూ.లక్ష రుణానికి ప్రభుత్వం రూ.50 వేలు సబ్సిడీ విడుదల చేసింది. బ్యాంకులు మరో రూ.50 వేలు కలిపి లబ్ధిదారుడికి రూ.లక్ష రుణం మంజూరు చేయాలి. ఆ రుణంతో యూనిట్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. ఎక్కడా అలా జరగలేదు. ప్రతి లబ్ధిదారుడి నుంచి రూ.50 వేలు డిపాజిట్‌గా బ్యాంకులు కట్టించుకున్నాయి. కట్టని వారికి రుణాల మంజూరు నిలుపు చేశాయి. దీనిపై ఏ ఒక్కరూ పట్టించుకున్న దాఖలాల్లేవు.

అవినీతిపర్వం సాగిందిలా..


రూ.లక్ష రుణానికి రూ.50 వేలు డిపాజిట్ చేస్తే, ప్రభుత్వం విడుదల చేసిన సబ్సిడీ లబ్ధిదారులకు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటివరకు నేరుగా లబ్ధిదారుడు వెళ్తే రుణం ఇచ్చిన దాఖలాలు జిల్లాలో లేవు. బ్యాంకర్లు, దళారులు కుమ్మక్కై యధేచ్ఛగా అవినీతికి పాల్పడుతున్నారు. మిగిలిన రూ.50 వేలలో జిఎస్‌టి, ఖర్చుల పేరుతో రూ.12 వేలు తీసేసుకుంటున్నారు. కొటేషన్ ఇచ్చే వ్యాపారి దగ్గర నుంచి అన్నిచోట్లా బ్యాంకర్లు, దళారులు కలిసి ఒప్పందాలు కుదుర్చుకున్నారు. రూ.50 వేలలో రూ.12 వేలు పోతే ఇక లబ్ధిదారుని చేతికందేది రూ.38 వేలే. మరోవైపు డిపాజిట్ కట్టేందుకు రూ.50 వేలు అత్యధిక వడ్డీకి తీసుకురాక తప్పడం లేదు. డిపాజిట్ సొమ్ము సైతం దళారులే వడ్డీకి ఇస్తున్నారు. డిపాజిట్ కట్టిన తర్వాత నెలరోజులకుగాని రుణం ఇవ్వడం లేదు. మరో రూ.రెండు వేలు వడ్డీకి పోతోంది. ఇదికాక రుణ జాబితాలో పేరు చేర్చినందుకు జన్మభూమి కమిటీ సభ్యులకు రూ.ఐదు వేలు వరకూ సమర్పించుకోవాలని పలువురు వాపోతున్నారు. ఈ సొమ్ముతో లబ్ధిదారులు యూనిట్ ఏ విధంగా పెడతారో అధికారులు, ప్రభుత్వమే చెప్పాల్సి ఉంది. 'పశ్చిమ'లో కార్పొరేషన్ రుణాల వ్యవహారం ఓ వ్యాపారంగా సాగిపోతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మంజూరైన రుణాల్లో 20 శాతం యూనిట్ల స్థాపన సైతం జరగడం లేదని జిల్లా కలెక్టరే స్వయంగా అన్నారంటే క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏవిధంగా ఉందో వేరే చెప్పనక్కర్లేదు. కార్పొరేషన్ రుణాల పేరుతో జన్మభూమి కమిటీలు, బ్యాంకు అధికారులు, దళారులు భారీగా లబ్ధి పొందుతున్న పరిస్థితి జిల్లాలో నెలకొంది. దీనిపై విచారణ నిర్వహిస్తే అసలు నిజాలు బట్టబయలు కానున్నాయి.

28 నుంచి యాటింగ్ ఫెస్టివల్

థాయిలాండ్, చెన్నై, గోవా నుంచి 9 పడవల రాక

మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి



దేశంలోనే మొట్టమొదటిసారిగా మార్చి 28 నుంచి 31 వరకూ నాలుగు రోజులపాటు విశాఖపట్నం సాగరతీరంలో' వైజాగ్ యాటింగ్ ఫెస్టివల్'ను నిర్వహిస్తున్నామని మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. తన నివాసంలో ఆయన పర్యాటక శాఖ ఇడి శ్రీనివాసరావుతో కలిసి ఆదివారం ఫెస్టివల్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పర్యాటక శాఖ గతంలో సౌండ్ ఆన్ సాండ్, దసరావళి, బెలూన్ ఫెస్టివల్, గాలిపటాల ఫెస్టివల్ వంటి కార్యక్రమాలను నిర్వహించి విశాఖ అందాలను అంతర్జాతీయంగా పర్యాటకులు ఆకర్షించే విధంగా చేశామని చెప్పారు. ఈ వైజాగ్ యాటింగ్ ఫెస్టివల్ కూడా అంతర్జాతీయంగా పర్యాటకులను ఆకర్షించే అవకాశముందని తెలిపారు. ఈ యాటింగ్ ఫెస్టివల్ కోసం రూ.3 కోట్లు నిధులను కేటాయించామన్నారు. ముఖ్యంగా గోవా నుంచి 5, చెన్నై, థాయిలాండ్ ప్రాంతాల నుంచి చెరో రెండేసీ షిప్‌ల(పడవలు)ను తీసుకువస్తున్నామన్నారు. ఈ తొమ్మిది షిప్‌లలో 120 సీట్లు ఉంటాయన్నారు. ముఖ్యంగా ఈ పడవల్లో పర్యాటకులను ఎక్కించుకుని సముద్రంలో తిప్పడమే కాకుండా వారికి అన్ని సౌకర్యాలూ అందులోనే కల్పిస్తామన్నారు. 28న రుషికొండ, 29న యారాడ, 30న ఆర్కేబీచ్, 31న భీమిలి ప్రాంతాల్లో ఈ ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా ప్రతి రోజూ మ్యూజిక్ ప్రోగ్రామ్ ఉంటుందన్నారు. 29న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా జాగ్రత్తలు పాటించాలని ఈ సందర్భంగా మంత్రి పర్యాటక శాఖ అధికారులకు సూచించారు.

అక్షరం

ప్రజాశక్తి

www.prajasakti.com

facebook/prajasakti, twitter/prajasakti



మనకు రెండు రకాల భాషలు ఉన్నాయి.
ఒకటి బడి పలుకుల భాష.
రెండోది పలుకుబడుల భాష.
మనకు పలుకుబడుల భాష కావాలి.
- కాళోజీ



కేదార కవిత్వం

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత హిందీ కవి కేదార్‌నాథ్ సింగ్ మార్చి 19న కన్ను మూశారు. భారతీయ భాషల్లోనే అగ్రేసర కవిగా గుర్తింపు పొందిన కేదార్‌నాథ్ తెలుగు ప్రాంతానికి చాలాసార్లు వచ్చారు. ఆయన జాషువా అవార్డు కూడా అందుకున్నారు. విభిన్నమైన వస్తువులను వినూత్నమైన రీతిలో కవిత్వం చేయడం కేదార్‌నాథ్ ప్రత్యేకత. భారతీయ కవిత్వంలో ఆయన ముద్ర అనన్య సామాన్యమైనదని విమర్శకులు భావిస్తారు. ఈ కాలపు కవులందరికీ ఆయన ఆరాధ్యుడే. మనిషి వైపు, మానవ సమాజం వైపు, మంచి వైపు, మార్క్సిజం వైపు నిలిచిన మహాకవి కేదార్‌నాథ్. ఆయన కవితలు చాలా తెలుగులో అనువాదమయ్యాయి. ఆయన ప్రసిద్ధ కవితల్లో మూడింటిని ప్రముఖ కవి ప్రసాదమూర్తి చేసిన అనువాదంతో ఇక్కడ ఇస్తున్నాం.

1

విరిగిన ట్రక్కు

గత వర్షాకాలం నుంచి చూస్తున్నాను
అది అలాగే పడి ఉందక్కడ
పగిలి వుంది దిగులుగా వుంది
ఇప్పుడు దాన్నుంచి చిగురులు మొలుస్తున్నాయి

నేను చూస్తున్నాను
ఒక చిట్టి లత స్టీరింగ్ వైపు పాకుతూ పోతోంది
ఒక చిన్ని ఆకు హారన్ వైపు వాలి వుంది
బహుశా దాన్ని మోగించాలని ఆరాటపడుతోంది కాబోలు
ఆ పాడుబడ్డ ట్రక్కులోంచి
సనసన్నని నిశ్శబ్ద శబ్దాలు వినిపిస్తున్నాయి
ఏదో నట్టు విప్పుతున్నట్టు..
ఏదో వైరు చుడుతున్నట్టు..

ఆ శిథిలమైన ట్రక్కు
గడ్డి చేతులకు అప్పగించబడినట్టుంది
దాని చక్రాలు మార్చడానికి
గడ్డి చాలా తంటాలు పడుతోంది
నాకు ఇలా ఆలోచించుకుంటేనే ఎంతో ఆనందంగా ఉంది
రేపు పొద్దుటికల్లా ఈ ట్రక్కు బాగుపడిపోతుంది
నేను నిద్ర లేస్తూనే దీని హారన్ వింటాను
ట్రక్కు డుర్ డుర్‌మంటూ వెళ్ళిపోతుంది
తిన్ సుకియా.. లేదా బోకాజాన్

పొద్దుగూకింది
విరిగిన ట్రక్కు అలాగే అక్కడే కుదేలై వుంది
నా వైపు తీక్షణంగా చూస్తోంది
నాకేమనిపిస్తోందంటే
ఈ సమయంలో ఆ ట్రక్కు ఇక్కడ లేకపోతే
నాకెంత కష్టమయ్యేది..?
నా నగరాన్ని గుర్తించడం..
నా మనుషుల్ని గుర్తించడం..
నా ఇంటిని గుర్తించడం..

కేదార్‌నాథ్ సింగ్
జననం : 7 జులై 1934
మరణం : 19 మార్చి 2018

2

పెట్టుబడి

నగరమంతా మూలమూలలు గాలించి
చివరాఖరికి ఒక నిర్ణయానికొచ్చాను
ఇంత పెద్ద నగరంలో
నాలో కదలాడే ఊపిరే పెట్టుబడి
అది నా ఛాతీలో భద్రపరచిన పెట్టుబడి
రోజూ కొంచెం కొంచెం ఖర్చు చేసుకుంటాను

ఇలా ఎందుకు కాకూడదు?
ఒక రోజు నేను నిద్ర లేచి
ఈ నగరం చివరి మలుపు దగ్గరున్న
జనతా బ్యాంకులో జమ చేసి వస్తాను
అక్కడ నాకు వచ్చే వడ్డీతో
రొమ్ము విరుచుకుని జీవిస్తా
ఒకటి కాదు.. అనేక జీవితాలు.

3

ఊరికి వస్తే ...

రావడమైతే వచ్చాను
నేనిప్పుడేం చేయాలి?
ఒక ముసలి పక్షిలా గింగిరాలు కొడుతూ
మాటిమాటికీ ఇక్కడికెందుకు వస్తాను?
పచ్చికలాగా
ఈ భూమ్మీద వేసటకు అంతే పురాతనమా..?

ఈ గాలి నన్నెందుకు చుట్టుముడుతోంది?
ఇక్కడ నడుస్తుంటే
నా ఊపిరి లోపలి లోతైన మైదానంలో
నడుస్తున్నట్టు ఎందుకనిపిస్తోంది?

నా వాళ్ళే.. కాని ఎవరు వీళ్ళంతా?
వీళ్ళ ముఖాలు చూసి
నా గడియారంలో ముల్లు పదే పదే
సరి చేసుకోవల్సి వస్తోంది ఎందుకు?

కొందరు పరాయివాళ్లే కావొచ్చు
అయితేనేం వాళ్ళూ నా వాళ్ళే
ఉండేది ఎక్కడో..
ఇదే ఇదే ఇదే నా ఇల్లని
ఎందుకనిపిస్తోంది?

దుమ్ము కొట్టుకుపోయి
అలసిపోయి ఎలాగూ వచ్చాను
వారి కళ్ళలో నేనొక తువ్వాలో సూట్ కేసో కాదు..
నేను నేనే అని ఎలా నిరూపించుకోవాలి?

నేనేం చెయ్యను? ఏం చెయ్యను?
నేను వీరిలో వాడినే అని
వీళ్ళవాడినే అని
వీళ్ళకి తెలిసేలా ఏం చెయ్యను?
నా కవిత్వానికి ప్రాణవాయువు వీళ్ళే
వీళ్ళు మాత్రం నన్నెప్పుడూ చదవరు
ఎవరినైనా తాకనా..?
ఎవరినైనా చుట్టుకుపోనా..?
కలవాలి
కాని ఆ కలిసేదెలా..?
నేనే కలవాలి మధ్యలో అడ్డు రాకూడదు ఢిల్లీ
ఉపాయం ఏముంది?
మనిషి వీధిలోకి వచ్చినప్పుడు మధ్యలో అడ్డు పడొద్దు పిల్లి

హిందీ : కేదార్ నాథ్ సింగ్
తెలుగు : ప్రసాదమూర్తి


కారుణ్య మరణంపై సాహిత్య లోచన

యుతనేసియా, కారుణ్య మరణాలపై సంచలనాత్మకమైన సుప్రీం కోర్టు తీర్పు, తెలుగులో ఈ విషయంపై సాహిత్య చిత్రణకు అనుకూలంగా వెలువడింది. ఏడేళ్ళ కిందటే కథా నవలా రచయిత సలీం తన నవల 'మరణ కాంక్ష'లో ఈ అంశాన్ని భావోద్వేగాల సంఘర్షణగా చిత్రించారు. ప్రపంచ దేశాల నైతిక అభిప్రాయమే రెండుగా చీలిపోయిన ఇటువంటి విషయాలపై నవలా రచన రచయితల నిగ్గుతేల్చే విషయం. నెదర్లాండ్స్, మెక్సికో, స్విట్జర్లాండ్, బెల్జియం, అమెరికా, జర్మనీ, ఐర్లాండ్ తదితర దేశాల చట్టాలు కారుణ్య మరణాలకు 'పాసివ్' పద్ధతిలో అంగీకరిస్తున్నాయి. అంటే- భయంకరమైన వ్యాధితో, మృత్యు ముఖంలో ఉంటూ బయట నుంచి అందజేసే ప్రత్యేక వైద్య సదుపాయాల వల్ల ఇంకా జీవితులై ఉండే వ్యక్తుల అంగీకారంతో, ఈ వైద్య సదుపాయాలను తొలగించటం. మన సుప్రీం కోర్టు తాజా తీర్పు దీనిని బలపరుస్తోంది.

ఈ విధానానికే ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫిలిప్పైన్స్ తదితర దేశాల్లో చట్టబద్ధత లేదు. మన దేశాన్ని కుదిపేసిన 1977 లైంగిక అత్యాచార బాధితురాలు అరుణా షాన్బాగ్ ఆ ఏడాది నవంబర్ నుంచి మే 2015 దాకా ఈ కారుణ్య మరణాల విషయంపై స్పష్టత, చట్టబద్ధత లేక పోవడం వల్ల నలభై రెండేళ్ల పాటు కోమా వంటి 'వెజిటేటివ్ స్టేట్'లో కేవలం పేరుకి మాత్రం జీవితురాలిగా ఉంది. 2009లో ఆమె విషయమై పత్రికా రచయిత్రి పింకీ విరానీ ఒక రచన చేయడమేకాక, ఆమె కారుణ్య మరణాన్ని అనుమతించమని, లైఫ్ సపోర్టు పరికరాలను తొలగించే వీలును పరిగణించమని సుప్రీంకోర్టుకి పిటీషన్ సమర్పించింది. చాలాచోట్ల సమాజంలో కేరళలో పలుసార్లు, సమాజంలో మనిషి జీవించే పరిస్థితులు మృగ్యం అవుతున్న కారణంగా, తమ ఆత్మహత్యకు అనుమతి ఇవ్వాల్సిందిగా, కోర్టుకు వ్యక్తులు దరఖాస్తు చేస్తుకున్న పూర్వ ఉదంతాలు, అప్పుడు కోర్టులు ఈ విషయం తమ పరిధిలోది కాదు అని తటస్థ వైఖరి అవలంబించిన సందర్భాలు ఉన్నాయి. ప్రముఖ రచయిత ఆర్థర్ కొజ్లర్, ఆయన భార్య, ఇలాగే జీవితం అంటే విసుగు కలిగి, మేము ఆత్మహత్య చేసుకుంటున్నాం అని లండన్‌లో కొన్ని దశాబ్దాల కిందట, తమ ప్రాణాలు తీసుకున్నారు.

2011లో సైతం, పూర్తిగా నిస్సహాయ దశలో ఉన్న వ్యక్తులకు కారుణ్య మరణాల వీలును అనుమతిస్తూనే షాన్ బాగ్ విషయంలో ఈ వెసులుబాటుకు తిరస్కరించింది సుప్రీంకోర్టు. దేశంలో ఏ మేరకు, ఏ స్థాయిలో ఈ మెర్సీకిల్లింగ్ అనుమతించవచ్చు అని వైద్య వర్గాలు, న్యాయ కోవిదులు, ధార్మిక సంస్థలూ, సామాజిక మేధావులు చర్చిస్తూ ఉన్న కాలంలోనే 2013లో నిమోనియాకి గురై 2015లో మే 18న గుండెపోటుతో అరుణా షాన్ బాగ్ కన్నుమూసింది. ఈ దేశవ్యాప్త ఉదంతం, ఏళ్ల తరబడి అమానవీయమైన ఈ పొడిగింపు, మన తెలుగు రచయిత సలీంకు ఈ విషయంపై నవల రాసే ప్రేరణ కలిగించి ఉండవచ్చు. సమాజ పరిస్థితులపై ఎందుకు ఒక రచయిత నవల రాయాలో ఇది ఒక మంచి ఉదాహరణ.







తెలుగు సాహిత్యంలో తొలిగా ఈ విషయాంశాన్ని చర్చించిన నవల కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత సలీం 'మరణకాంక్ష'. ఈ నవలను ఆయన 2011లో రాశారు. ఓ వారపత్రికలో సీరియల్‌గా వచ్చిన ఈ నవల తర్వాత పుస్తకంగా వెలువడింది. తన కొడుకు మస్క్యులర్ డిస్ట్రోఫీతో పడుతున్న మరణ యాతన చూడలేక సరోజ అనే తల్లి తన కొడుక్కి కారుణ్య మరణం ప్రసాదించమని కోర్టుకు అప్పీల్ చేసుకుంటుంది. కానీ అక్షర అనే లాయర్, కారుణ్య మరణాలకు వ్యతిరేకంగా వాదించి కేసు గెలుస్తుంది. అయితే ప్రసాద్ మరణయాతన కళ్లారా చూసిన ఆమె తాను పొరపాటు చేశానని గ్రహిస్తుంది. రచయిత, ప్రసాద్ మరణాన్ని వర్ణించిన తీరు, ప్రత్యక్షంగా చూసిన అక్షరలో ఎంత మార్పును తీసుకొస్తాయో అలాగే చదివిన పాఠకుల్లోనూ కారుణ్య మరణాల పట్ల ఒక సహానుభూతిని, వాస్తవిక స్పృహను కలిగిస్తాయి. రచయిత తన రచన ద్వారా సాధించిన ఈ మానవ స్వభావ చిత్రణ నేడు సుప్రీంకోర్టు నోట ఆమోదయోగ్యమైన తీర్పుగా వెలువడటం ముదావహం. మన తెలుగు రచయితలు ఇంత మెలకువతో, క్రాంతదర్శిత్వంతో రచనలు వాస్తవ దృక్పథంతో చేస్తున్నారని చెప్పడానికి ఇదొక సత్య నిదర్శనం. మొజాయిక్ సాహిత్య సంస్థ పదిహేనో వార్షికోత్సవ సభల్లో విశాఖలో మార్చి 24, 25 తేదీల్లో 15వ వార్షికోత్సవ సందర్భంగా 'మొజాయిక్ సాహిత్య పురస్కారం' తొలిసారిగా సలీంకి ప్రదానం చేశారు. సమకాలీనత తన బలమైన దృష్టిగా గల రచయిత సలీం అన్నది, మరణకాంక్ష వర్తమాన జటిల సమస్యగా ఉండగానే, నవలగా చిత్రించిన ప్రతిభకు, మొజాయిక్ గుర్తింపు కూడా సమంజసం అనిపించేలా ఇటీవలి సుప్రీం కోర్టు తీర్పు కూడా అండగా నిలిచింది.

ఇదే విషయంపై 'గుజారిష్' (2010)లో సంజయ్ లీలా బన్సాలి సినిమాగా వచ్చినా అది ఒక గొప్ప వ్యక్తి జీవితం గురించి, పైగా అది **whose life is it any-way** (1981) అనే రంగస్థల నాటకాన్ని సినిమాగా తీసిన దాన్ని హిందీలో బన్సాలి తనదైన గొప్ప చిత్రీకరణలో తీశారు. బ్రైన్‌క్లార్క్ 1978లో రాసి ప్రదర్శించిన ఈ నాటకం జాన్ బొధామ్ దర్శకత్వంలో రిచర్డ్ డ్రెయూస్స్ (అకాడెమీ అవార్డ్ గ్రహీత) ముఖ్యపాత్రగా చిత్రించబడింది.

దిగువ మధ్య తరగతి జీవితాల్లో జరిగిన విషాదాన్ని చర్చించిన వాస్తవానికి అతి చేరువలో ఉన్న సలీం నవల 'మరణకాంక్ష' **(A DESIRE FOR DEATH)** పేరిట ఆంగ్లంలోకి అనువాదం కూడా అయింది. ఇది అంతర్జాలంలో గూగుల్ బుక్స్‌లో కూడా లభ్యమవుతుంది. మన తెలుగు నవల భారతీయ, అంతర్జాతీయాంశాలను సకాలంలో చర్చించడం, ఆ విషయమే సుప్రీంకోర్టు తాజా తీర్పుగా వెలువరించడం కవులు క్రాంతదర్శులు అని మరోమారు రుజువు చేస్తుంది. సలీం కేవలం మన తెలుగు రచయితే కాదు; అంతర్జాతీయ స్థాయి రచయిత అని చెప్పేందుకు అతను రచించిన తొలి ముస్లిం నవల 'వెండిమేఘం' (2003), నేడు ఈ 'మరణకాంక్ష' (2011) ఇంకా మరికొన్ని రచనలు, సాహిత్య చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయి అనడంలో సందేహం లేదు.

- జగద్ధాత్రి
87122 93994

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. సమీక్ష కోసం పుస్తకాలను పంపేవారు రెండు కాపీలను పంపాలి. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి.

అక్షరం, ప్రజాశక్తి సాహిత్య పేజీ, ప్రజాశక్తి కార్యాలయం, ఎంబి విజ్ఞాన కేంద్రం, గవర్నరుపేట, విజయవాడ - 2.
prajasavvadi@gmail.com

అంతరాలపై అక్షరాస్త్రం అలిశెట్టి


ఇంటర్‌తో సర్టిఫికెట్ల విద్యకు వీడ్కోలు చెప్పిన అతని కవిత్వమే నేడు పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పాఠాల రూపంలో పుస్తకాల పుటల్లోకి ఎక్కుతుందని ఎవరైనా ఊహించారా? అందరి బాధల గాథల్ని తన మస్తిష్కంలో మథించి కవనవనంలో 'ఎర్రపావురాలు' ఎగరేసినవాడు. 'మంటల జెండాలు' రెపరెపలాడించాడు, 'రక్తరేఖలు' గీసి 'సిటీలైఫ్'ను చిత్రించినవాడు. మట్టి వాసన ఉన్న కవి అలిశెట్టి ప్రభాకర్ కాక మరెవరు? చిన్న పదాలతో గొప్ప అర్థాలు చెప్పిన మేధావి. దోపిడీ సమాజంపై అక్షరాయుధాలు ఎక్కుపెట్టాడు. సాహితీ చీకటిని చీల్చిన ప్రభాకరుడు.

అతను బతికింది అతి కొద్దికాలమే... కానీ చరిత్ర పుస్తకంలో తనకంటూ కొన్ని పేజీలను కేటాయించుకున్నాడు. అతను కవిత్వమై ధ్వనించింది కేవలం 20 ఏళ్ళే. 1970 దశకంలో తెలుగు కవిత్వంలో వచ్చిన మినీ కవితాసరళికి ఆకర్షితుడై చేతిలో ఉన్న కుంచెను పక్కన పెట్టి, కలాన్ని పట్టుకున్నాడు. చేపట్టిన కలాన్ని తుది ఊపిరిదాకా విడిచిపెట్టకుండా వందలాది పొట్టి కవితలకు ప్రాణం పోసిన గట్టి కవి అలిశెట్టి ప్రభాకర్. సాధారణ పదాల పొందికతోనే ప్రబలమైన కవిత్వాన్ని సాధించవచ్చన్న ఆలోచనను నమ్మి అదే సూత్రాన్ని కడవరకు ఆచరించి చూపించాడు. ఆయన రాసిన కవితల్లో మూడు పాళ్ళకు పైగా మినీ కవితలే ఉన్నాయి. ఆస్తికి పేద అయినవాడే అక్షర ధనికుడవుతాడనడానికి అలిశెట్టి ప్రభాకర్ జీవితం- కవిత్వం చెదరని ఉదాహరణ.. జనకవిగా నిలవాలనుకునేవారికి గొప్ప ప్రేరణ. మినీ కవితలతో తెలుగు సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కించిన కలం యోధుడు కవి అలిశెట్టి ప్రభాకర్. అందుకే అతని కవిత్వం గోడలపై నినాదమై మెరుస్తుంది.

తొలిసారి ప్రచురింపబడిన కవిత కూడా ఎనిమిది ఫంక్తులదే. 'గుండెల్లో/ మెత్తగా దిగబడే/ కాగితపు కత్తి/ కరెన్సీ నోటు' అన్నాడు గాని నిజానికి ప్రభాకర్ ప్రతి కవిత అక్షరపు కత్తిలా అంతే మెత్తగా గుండెల్లో దిగబడుతుంది. ఆయన కవిత్వంలో సూటిదనం ఉండటం, కొలత తక్కువతో పాటు తేలిక పదాలు ఉండటం అదనపు ఆకర్షణలుగా ప్రభాకర్ కవిత్వం అనతికాలంలోనే ఆదరణను పొందింది. ప్రభాకర్ కవిత్వంలో ఉన్న మినీతనాన్ని మరింత బలంగా చెప్పడానికి ఆయన 'చురకలు' తోడ్పడతాయి. తన రెండోకవితా సంపుటి 'మంటల జెండాల'తో పాటు ప్రచురించిన 'చురకలు' కేవలం 18 పేజీల్లో వేసిన 80 ద్విపదల సంకలనం ఇది. కవలలు అనే ద్విపదలో 'సెక్స్- క్రైమ్ కవలలు / కలిపి చదివితే నవలలు' అంటాడు. కవి- సమ్మెటలో 'చదివిన కవిత చలి-ముదుసలి/ కప్పించుకుంది కశ్మీరు శాలువా' అనే ఈ ద్విపద కేవలం శాలువాల కోసం కవిత్వం రాసే వారికి ఒక చురక లాంటిది. అందుకే వీటికి చురకలు అని పేరు పెట్టి ఉంటారు. అలిశెట్టి ప్రభాకర్‌కు ఎంతో పేరు తెచ్చిన వేశ్య కవిత- 'తను శవమై../ ఒకరికి వశమై.../ తనువు పుండై.../ ఒకడికి పండై../ ఎప్పుడూ ఎడారై.../ ఎందరికో ఒయాసిస్సై..'. ఇందులో ఉన్నవి మొత్తం పన్నెండు పదాలే. చదవరులను కట్టిపడేసే మరో కవిత 'గుడిసెలే/ మేడల్ని కడతాయి/ అయినా/ మేడలే/ గుడిసెల్ని కొడతాయి'.

మధ్య మధ్య దీర్ఘ కవితలు కొన్ని రాసినా, ప్రభాకర్ మినీ కవితలతో రంగ ప్రవేశం చేసి చివరకు 'సిటీలైఫ్'లో పరిమిత ఫంక్తుల్లో సమాజాన్ని నిలదీస్తూ నిష్క్రమించాడు. ఏ గ్రంథాలు తిరగేయకున్నా నిరంతర సాధనతో కావ్య శిల్పాన్ని ఒడిసి పట్టుకున్నాడు. వాక్య నిడివిలోనూ, పదాల విరుపులోనూ, చరణాల పొందికలోనూ నా మాటే చెల్లాలని భాషతో పేచీ పెట్టుకొని నెగ్గిన కవి అలిశెట్టి. జనం వాడుకలో ఉన్న ఇంగ్లీషు పదాలను వెనకాడకుండా వాడుకొన్నాడు. 'నీ లైఫ్‌ని/ బ్యూటిఫుల్ పెయింటింగ్‌గా/ మార్చుకోడానికి/ అట్రాక్టివ్ కలర్ 'రెడ్' కొరకు/ రక్తం మాత్రం/ ఎవరిదీ ఉపయోగించకు' అనే పెయింటింగ్ కవితలో ఆరు ఇంగ్లీషు పదాలు వాడుకొన్నాడు. 'సిటీలైఫ్' ద్వారా ప్రభాకర్ నిత్య జీవన సమస్యల వార్తలపై పరిమిత ఫంక్తులతో కావ్య రూపక వ్యాఖ్యానం అందించి అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యాడు. 'ధ్వంసమై పోతున్న సమస్త మానవ విలువల్ని, హింసా రాజకీయాల్ని నిరసించడంతోపాటు నిప్పు కణికల్లాంటి కన్నీటి గుళికలు ఇవి' అని ప్రభాకర్ ప్రకటించాడు.

1954 జనవరి 12న కరీంనగర్ జిల్లా జగిత్యాలలో చినరాజం, లక్ష్మీ దంపతులకు జన్మించాడు అలిశెట్టి ప్రభాకర్. కరీంనగర్‌లో ప్రాథమిక విద్య పూర్తి చేసిన ప్రభాకర్.. ఇంటర్ కోసం సిద్ధిపేటలో ఉన్న అక్క ఇంటికెళ్లాడు. అప్పటికే తండ్రి చనిపోవడంతో కుటుంబ భారాన్ని మోశాడు. పెన్సిల్‌తో బొమ్మలు గీసే హాబీనే ఆయన జీవితానికి సాహిత్యాన్ని పరిచయం చేసింది. అలా 18 ఏళ్ల వయసులోనే బూర్జువా దోపిడిదారులపై కవిత్వాన్ని రాశాడు. 1975లో పరిష్కారం పేరుతో అలిశెట్టి రాసిన కవిత తొలిసారి ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురితమైంది. ప్రభాకర్ గుండె లోతుల్లో అణిచివేయబడ్డ బడబాగ్ని 1978 జగిత్యాల జైత్రయాత్రతో ఉప్పెనలా బయటకొచ్చింది. దీంతో ఆయనపై ప్రభుత్వాలు, పోలీసులు, భూస్వాములు కక్షకట్టారు. నిర్బంధం పెరగడంతో జగిత్యాల నుంచి కరీంనగర్‌కు వచ్చి బతకడం కోసం శిల్పి స్టూడియో ప్రారంభించాడు. 1979లో 'మంటల జెండాలు' సంకలనాన్ని వెలువరించాడు. అందులో వచ్చిన దోపిడీ చిహ్నాం, దశ, పింజర లాంటి ఎన్నో కవితలకు ఇండియన్ ఇంక్‌తో అద్భుతమైన చిత్రాలు గీశాడు. వ్యంగ్యం, ప్రధానంగా రాజకీయ వ్యంగ్యం ప్రభాకర్‌కు ఇష్టమైన అస్త్రం. నాయకులను ఎద్దేవా చేయడంలో ఎగబడి మరీ రాసిన కవితలు ఆయనవి. టోపీని 'ఎన్నికల్లో/ ఓట్లడుక్కునే చిప్ప', శంకుస్థాపన రాయిని ప్రగతి వెంట్రుకలు మొలవని/ బట్టతల' నాయకుడు - పార్టీని 'వాడు ముందే వానపాము/ మరి ముడ్డెటో మూతెటో' అని రాయడం ఆయనకే చెల్లింది. ప్రభాకర్ కవిత్వంలో ఉన్న మరో సుగుణమేమిటంటే ఇప్పటికీ ప్రాసంగికత కోల్పోని రచనలు విరివిగా లభించడం. దీనికి తక్షణ ఉదాహరణ- 'చెయ్యి / కందిపోతుంది/ కందిపప్పు తాకకు/ దవడ/ పేలిపోతుంది/ ధరలేవీ చెప్పకు' అనే కవిత. అదే విధంగా- 'జన జీవన కెరటాల్లో/ ఊగుతోంది/ మృత్యునౌక/ మత మౌఢ్యం మందిరాన/ మోగుతోంది/ చావుకేక/ ఏదీ/ మనకందని దూరం/ మానవతాతీరం' ఈనాటి పరిస్థితులకు చక్కగా సరిపోతుంది.



ఓ వైపు ఫోటోలు తీస్తూనే.. ఇంకోవైపు కవితలు రాశాడు. మరోవైపు బొమ్మలు కూడా గీశాడు. తనలోని భావాలకు చిత్రరూపమిచ్చి వాటితోనే చిత్రకవితలు రాశాడు. ఆ ప్రక్రియ అప్పట్లో ఒక పెద్ద సంచలనం. 1981లో 'చురకలు' కవితా సంకలనం వచ్చింది. ప్రజల బతుకులు బాగు చేయడానికి, వారి బాధలు ప్రపంచానికి తెలియచేయడానికే కవిత్వమని నమ్మిన వ్యక్తి అలిశెట్టి ప్రభాకర్. 1982లో భార్య, ఇద్దరు పిల్లలతో కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చాడు. ఆయన రాసిన రక్తరేఖ, సంక్షోభ గీతాలు కవితలు సామాన్యులనూ ఆకట్టుకున్నాయి. 1983లో నిజ రూపమనే దీర్ఘ కవిత రాసి సాహితీలోకంలో సంచలనం సృష్టించాడు. 1985లో విడుదలైన రక్తరేఖ కవిత సంపుటిలో చిత్రాలు చూసిన ఎందరో ఎగబడి కొనుక్కున్నారు. ఆ సమయంలోనే ప్రభాకర్‌ను క్షయ చుట్టుముట్టింది. ఎడ తెరిపి లేని దగ్గు, అడుగు కదలనివ్వని ఆయాసం, రక్తం ముద్దలుగా పడుతున్న రోజుల్లోనూ.. ఆయన కవిత్వాన్ని రాయడం ఆపలేదు.. మృత్యువు దాడి చేసిన రోజు కూడా అక్షరాలకు జీవం పోశాడు. 'ఎల్లలు లేని/ కవితాకాశంలో/ ఎవరెవరి బాధలైనా/ రాస్తా../ క్షమించండి/ నా ఒక్కడివి మాత్రం/ దాస్తా... అని దగ్ధమయ్యే బాధలను కూడా దిగమింగాడు. 'నా కవిత్వం బ్యాంకులో/ దాచే/ అక్షర లక్షలన్నీ/ అక్షరాలా/ మీకే' అని వీలునామా రాసి జన్మదినం రోజే కన్ను (పెన్ను) మూసిన కవి అలిశెట్టి ప్రభాకర్. నేడు ఆయన నగర జీవితం అనే పేరుతో బడిపిల్లలకు చేరువయ్యాడు. నిప్పుకణికల్లాంటి అక్షరాలతో ఉషోదయపు భానుడిలా నవ్యపథానికి మార్గదర్శి అయ్యాడు.

- అనంతోజు మోహన్ కృష్ణ
88977 65417

కడితే.. సూపర్




మహిళా వస్త్రధారణ విషయంలో.. చీర అంటేనే ఓ అద్భుతం. సూపర్ నెట్ శారీస్ అంటే ఇక చెప్పక్కర్లేదు. లేలేత పెసర, పసుపు, ఆకుపచ్చ, బూడిదరంగు వంటి వర్ణాలు ఈ చీరల్లో మిళితమైతే.. ఆ అందాన్ని వర్ణించడానికి పదాలను వెతుక్కోవలసిందే! కంటికింపైన డిజైన్లతో ఉన్న చీరలు రెట్టింపు ఆకర్షణను తెచ్చిపెడతాయి. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ ట్రై చేయండి!





మొలకెత్తిన వెల్లుల్లితో మేలెంతో!

వెల్లుల్లి వల్ల ఎలాంటి ఆరోగ్యకర ప్రయోజనాలున్నాయో మనందరికీ తెలిసిందే. అయితే ఈ వెల్లుల్లిని సాధారణ రూపంలో కాకుండా మొలకెత్తించిన వాటిని తింటే, ఇంకా అనేక లాభాలు ఉంటాయని, అంతకు రెట్టింపు పోషకాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

✧ మొలకెత్తిన వెల్లుల్లిపాయల్లో సాధారణంకన్నా ఎక్కువగా యాంటీ యాక్సిడెంట్లు ఉంటాయి. మొలకెత్తిన వాటిలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి వివిధ వ్యాధుల్ని, ఇన్ఫెక్షన్లను నయం చేస్తాయి.

✧ మొలకెత్తిన వెల్లుల్లిపాయల్ని తింటే రక్త నాళాల్లో



పేరుకుపోయిన కొవ్వు కరుగుతుంది. చెడు కొలెస్ట్రాల్ పోయి, మంచి కొలెస్ట్రాల్ వృద్ధి చెందుతుంది. రక్త సరఫరా మెరుగుపడి, గుండెజబ్బులు రాకుండా ఉంటాయి. మధుమేహం నియంత్రణలో ఉంటుంది.

✧ మొలకెత్తుతున్న వెల్లుల్లి పాయల్లోని యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. క్యాన్సర్ రాకుండా చూడడంతో పాటు క్యాన్సర్ కణాల వృద్ధిని అడ్డుకుంటాయి.

✧ వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్న కారణంగా వయస్సు మీద పడడం వల్ల వచ్చే ముడతలు పోతాయి. దీంతో చర్మం యవ్వనంగా, కాంతివంతంగా మారుతుంది.

✧ మొలకెత్తిన వెల్లుల్లి పాయలను తింటుంటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. చిన్నారులకు తినిపిస్తే వారి మెదడు వికసిస్తుంది. బుద్ధి పెరుగుతుంది. నాడులన్నీ ఉత్తేజం అవుతాయి. రోజూ యాక్టివ్‌గా ఉంటారు. చదువుల్లో ప్రతిభను కనబరుస్తారు.

వెల్లుల్లిని ఇలా మొలకెత్తించాలి



చిన్న కప్పు లేదా గ్లాస్‌లో వెల్లుల్లిపాయను ఉంచాలి. దాని కింది భాగంలో ఉండే వేర్ల వరకు మాత్రమే మునిగేలా నీరు పోయాలి. ఇలా ఐదు రోజులు ఉంచితే వెల్లుల్లి మొలకెత్తుతుంది. అయితే వెల్లుల్లిని ఉంచిన పాత్రను కిటికీ వంటి ప్రదేశాల్లో, సూర్యరశ్మి తగిలేలా ఉంచాలి. దీంతో మొలకలు బాగా వస్తాయి. అలాగే నీరు స్వచ్ఛంగా లేకుండా మలినంగా మారుతుంటే, దాన్ని మార్చాల్సి ఉంటుంది. దీంతో మొలకలు త్వరగా వస్తాయి. అలా మొలకలు వచ్చాక పాత్ర నుంచి వెల్లుల్లిని తీసి, నిల్వ చేసుకోవాలి. వీటిని రోజూ రెండు, మూడు రెబ్బలను తినాలి. ★

వృద్ధుల సేవలో.. ఆమె




ప్రపంచంలో అందరికీ చెప్పుకోడానికి ఒక కథ ఉంటుంది. అది సమాజానికి ఏదోఒక రీతిలో స్ఫూర్తిని ఇస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ప్రపంచమంతా కథల భాండాగారం. ఒక్కో కథలో ఒక్కో వైవిధ్యమైన కోణం వెలుగుచూస్తుంది. తమిళనాడులోని తిరువారూర్ జిల్లాలో ఒక వృద్ధాశ్రమం ఉంది. అక్కడ వార్డెన్‌గా చేస్తున్న సెల్వరాణి కథ కూడా వైవిధ్యంగానే ఉంటుంది.

ఇది సెల్వరాణి కథ. అంతకుమించి ఆమె ఎంతోమందికి సహాయంగా ఉండటానికి పడిన శ్రమ. అలాగని ఇదామెకు బాధ కలిగించేదేమీ కాదు. ఇందులోనే ఆమె సంతోషాన్ని వెతుక్కుంది. జవసత్వాలుడిగిన వృద్ధులకు ఆనందమైన జీవితాన్ని అందించడాన్ని వృత్తిగా స్వీకరించింది. ఆ వృద్ధాశ్రమాన్ని ఒక ఎన్‌జిఓ నడుపుతుంది. అందులో సెల్వరాణి వార్డెన్. నిజానికి ఈమె ఒక ఫ్యామిలీ కౌన్సెలర్. సేవాదృక్పథం మెండుగా ఉన్న వ్యక్తి. అయితే చిన్నప్పటి నుంచి ఆమెను ఊళ్లో వాళ్లంతా ఒక రెబల్‌గా చూసేవాళ్లు. అంటే సమాజం అనుకునే 'ఆడపిల్ల'లా ఉండేదికాదు. గ్రామంలో అందరూ సెల్వరాణిని 'మగరాయుడు' అని పిలిచేవారు. దానికి కారణం ఆమెకు పదేళ్ల వయసున్నప్పుడు సైకిల్ తొక్కింది. సాంప్రదాయ విశ్వాసాలున్న గ్రామం కావడంచేత ఆడపిల్ల సైకిల్ తొక్కడాన్నీ తిరుగుబాటుగానే భావించేవాళ్లు. కానీ సెల్వరాణి మాత్రం ఎవరేమనుకున్నా తనకు ఏది సంతోషాన్ని ఇస్తుందో ఆ పని చేసేది. అందులో భాగంగానే సమాజసేవ చేయాలనే ఆలోచనల్లో పెళ్లి కూడా చేసుకోవాలనుకోలేదు. కుటుంబం నుంచి ఎంత వ్యతిరేకత వచ్చినాగానీ, ఆమె మాత్రం తాను కోరుకున్నట్లే జీవించడానికి సిద్ధపడింది. సేవ చేయడమే పరమావధిగా భావించిన సెల్వరాణి మొదట కుటుంబ సలహాదారుగా ఉచిత సేవలందిస్తూ, వృద్ధాశ్రమంలో వార్డెన్‌గా చేరింది.

వృద్ధులను ప్రేమగా చూసుకోవడం, వారికి కావాల్సిన అవసరాలు తీర్చడం ఒక వంతైతే వారి మానసిక పరిస్థితిని అర్థం చేసుకుంటూ వృద్ధాశ్రమాన్ని నిర్వహించడం ఎంతో శ్రమతో కూడుకున్న పని. కన్నబిడ్డలు వదిలేసిన ఆ వృద్ధుల్లో అనేకానేక మానసిక సంఘర్షణలు. సెల్వరాణి వార్డెన్‌గా ఉన్న ఆ ఆశ్రమంలో మానసికస్థితి సరిగాలేని వృద్ధులూ ఉన్నారు. ఒక్కోసారి అర్ధరాత్రి ఆశ్రమం నుంచి బయటకు వెళ్లిపోవాలని తలుపులు బాదేవారు. తమ మనుమలను చూడాలని అరిచేవారు. ఇంకొంతమంది వృద్ధులు రాత్రంతా ఏడుస్తూనే ఉండేవాళ్లు. కొందరు మౌనంగా ఎవరితోనూ మాట్లాడకుండా ఉంటారు. ఇంకొందరు చేయొద్దన్న పనినే చేస్తారు. ఇలాంటి విభిన్నమైన మనస్తత్వాలున్న వృద్ధులకు సెల్వరాణి ఎంతో ఓపిగ్గా సేవలందిస్తోంది. వృద్ధుల్లో ఉన్న నైపుణ్యాలను, సృజనాత్మకతనూ గుర్తించి, అవి సమాజానికి ఉపయోగపడేవిధంగా మార్చేది. ఆ వృద్ధుల జీవితానుభవాలను కుటుంబాలకు సలహాలిచ్చేందుకు ఉపయోగించేది. అందుకే ఆమెకు ఉత్తమ సేవకురాలిగా మంచి గుర్తింపు వచ్చింది. అయితే సెల్వరాణి కథ నుంచి నేర్చుకోవాల్సింది ఏమంటే, మనకు ఇష్టమైన పనిని చేయాలనుకుంటే ఎంత కష్టమైనప్పటికీ అందులో చాలా సంతోషం లభిస్తుంది. అలాగే మనకిష్టమైనట్లు జీవించాలనుకున్నప్పుడు ఎంత కష్టమైనా పడక తప్పదు. ★



కొత్త బైక్‌లకు సేఫ్టీ ఫీచర్ తప్పనిసరి!



దేశవ్యాప్తంగా టూ వీలర్ల ప్రమాదాలను నివారించడానికి అతి కీలకమైన సేఫ్టీ ఫీచర్‌ను కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. అయితే, ఈ రూల్ ఏప్రిల్ 1, 2018 తర్వాత వచ్చే బైక్‌లకు మాత్రమే. ఏప్రిల్ 1, 2018 నుంచి 125సీసీ కంటే ఎక్కువ కెపాసిటీగల బైకులకు కేంద్రం కొత్త రూల్స్ అమలు చేయనుంది. గతంలో బిఎస్-3 ఇంజన్‌లు ఉన్న బైకుల విక్రయాలను బ్యాన్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఏప్రిల్ 1, 2018 నుంచి 125సీసీ కంటే ఎక్కువ కెపాసిటీతో విడుదలయ్యే ప్రతి బైకులో, స్కూటర్‌లలో యాంటీ-లాక్ బ్రేకింగ్ సిస్టమ్ ఫీచర్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. టూ వీలర్ల ద్వారా జరిగే ప్రమాదాలను తగ్గించడంలో యాంటీ-లాక్ బ్రేకింగ్ సిస్టమ్ ఎంతో చక్కగా పనిచేస్తోంది. ఈ టెక్నాలజీ ఉన్న బైకుల్లో ప్రమాదాలు జరిగే అవకాశం దాదాపు తక్కువ. టూ వీలర్ల సేఫ్టీలో అత్యంత కీలకమైన ఫీచర్ యాంటీ-లాక్ బ్రేకింగ్ సిస్టమ్. ఎందుకంటే చాలా కంపెనీలు ఇప్పటికే 125సీసీ కంటే ఎక్కువ కెపాసిటీ ఉన్న టూ వీలర్లను విడుదల చేశాయి. ఏప్రిల్ 1 తరువాత విడుదల చేస్తే ఏబిఎస్ తప్పనిసరి కాబట్టి.. దానికి ముందే విడుదల చేస్తే ఏబిఎస్ లేకుండానే విక్రయించవచ్చు. ఏప్రిల్ 1, 2018 తర్వాత లభించే ప్రతి 125సీసీ కంటే ఎక్కువ కెపాసిటీ ఉన్న టూ వీలర్లలో ఏబిఎస్ తప్పనిసరి చేయకుండా.. ఆ తరువాత విడుదలయ్యే బైకుల్లో మాత్రమే ఏబిఎస్ ఉండాలని తీసుకున్న నిర్ణయంతో ప్రజలకు ఏ మాత్రం ప్రయోజనం



నిజానికి, ఇది అత్యంత ఖరీదైన బైకుల్లో మాత్రమే వస్తోంది. ఇక్కడ ప్రదానంగా గుర్తించాల్సింది.. కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ తీసుకున్న నిర్ణయం మేరకు, ఏప్రిల్ 1, 2018 తరువాత 125సీసీ కంటే ఎక్కువ కెపాసిటీతో విపణిలోకి కొత్తగా విడుదలయ్యే ప్రతి బైకులో ఏబిఎస్ కచ్చితంగా ఉండాలి. అయితే, ఇది వరకే విడుదలైన బైకుల్లో ఏబిఎస్ లేకపోయినా వాటి రిజిస్ట్రేషన్ జరుగుతాయి. ఈ నిర్ణయం ఒక రకంగా టూ వీలర్ల తయారీ సంస్థలకు బాగా కలిసొస్తుంది.

చేకూరదు అనేది కొందరి వాదన. ఎందుకంటే, ఏప్రిల్ 2018 తరువాత విపణిలో లభించే కొన్ని బైకుల్లో ఏబిఎస్ ఉంటుంది.. మరికొన్ని వాటిలో ఉండదు. అంటే ప్రస్తుతం ఉన్న పల్సర్ 150, అవెంజర్ సిరీస్, యమహా ఎఫ్‌జడ్, హోండా సిబి హార్నెట్ 160ఆర్ వంటి ఎన్నో బైకులు ఏబిఎస్ లేకుండా విక్రయించుకోవచ్చు. కానీ, ఇక మీదట విడుదలయ్యే ప్రతి 125సీసీ కెపాసిటీ కంటే ఎక్కువ ఉన్న బైకుల్లో ఏబిఎస్ తప్పనిసరి చేసింది. కాబట్టి, కేంద్రం ఈ నిర్ణయాన్ని సవరించాల్సి అవసరం ఎంతైనా ఉంది. ★

మెత్తటి చర్మానికి..



ఎంతో సులభంగా, తక్కువ ఖర్చుతో ఇంటి చిట్కాలు పాటించి మెత్తని చర్మాన్ని సొంతం చేసుకోవచ్చు. దీనికి కావాల్సిందల్లా కాస్తంత ఓపిక మాత్రమే.

నీళ్లు: చర్మం మృదువుగా, మెరుస్తూ ఉండాలంటే రోజుకి ఎనిమిది నుంచి పది గ్లాసుల నీళ్లు తాగాలి. ఇలా చేయడం వల్ల శరీరంలో వ్యర్థాలు బయటికిపోతాయి.

➢ చక్కెర పానీయాలు, ఆల్కహాల్, కార్బొనేటెడ్ డ్రింక్స్‌కి దూరంగా ఉండాలి. నీటిశాతం అధికంగా ఉన్న పళ్లు, కాయగూరలు తినాలి. రోజుకి కనీసం రెండుసార్లు ముఖాన్ని నీళ్లతో కడుక్కోవాలి.

నిమ్మరసం: ఇది చర్మాన్ని శుభ్రపరుస్తుంది. మచ్చలేమైనా ఉంటే వాటిని చర్మంలో కలిసిపోయేలా చేస్తుంది. సిట్రస్ అధికంగా కలిగిన నిమ్మలో క్లెన్సింగ్ ఎంజైమ్‌లు ఉంటాయి. ఇవి చర్మంపై ఉన్న మృతకణాలను తొలగించి.. చర్మాన్ని తాజాగా, మృదువుగా ఉంచుతాయి. ఇందులోని యాస్ట్రింజెంట్ గుణం జిడ్డుచర్మం ఉన్న వారికి చాలా బాగా పనిచేస్తుంది.

➢ నల్లమచ్చలు, మొటిమల మచ్చలు పోవాలంటే నిమ్మరసాన్ని ముఖానికి, మెడకు రాసుకోవాలి. పది నిమిషాల తరువాత గోరువెచ్చని నీళ్లతో కడుక్కోవాలి. ఇలా వారం పాటు వీలైనన్ని సార్లు చేస్తే.. మంచి ఫలితం కనిపిస్తుంది.

టమాటా: ఇది సహజసిద్ధమైన స్కిన్ టోనర్. మొటిమలు, కురుపులు వంటి వాటిని నయం చేస్తుంది. తాజా టమాటాలను బ్లెండర్ లేదా గ్రైండర్‌లో వేసి గుజ్జులా చేయాలి. ఈ టమాటా గుజ్జును ముఖానికి రాసుకుని, పది నిమిషాల తరువాత నీళ్లతో కడిగేయాలి. ★

మీ కోసం



బంగారు, వెండి నగలు వన్నె తరిగితే విరిగిన పాలతో కడగండి. కొత్తవాటిలా మెరుస్తాయి.

జీవన సౌరభం

దొంగలూ దోచుకెళ్ళడానికి వీలులేని సంపద.. ఒక్క విద్య మాత్రమే.

దీపిక



ఈ కోర్సు కాకుండా ఇంకో కోర్సులో చేరాల్సింది... ఈ జాబ్ కాకుండా మరో జాబ్ కోసం ట్రై చేయాల్సింది అని..! ఎందుకు అలా చేశారు... మీకు నచ్చిన కోర్సులో ఎందుకు చేరలేదు. ఇష్టమైన కెరీర్‌ను ఎందుకు ఎంచుకోలేదు.. అని అడిగితే నూటికి 99 శాతం మంది చెప్పే సమాధానం ఒక్కటే...అదే సరైన గైడెన్స్ లేకపోవడం. సో! టెన్త్, ఇంటర్ పూర్తయ్యాక తీసుకునే నిర్ణయం ఎంతో కీలకం.. మనలో చాలా మంది టెన్త్ అయ్యాక బైపీసీ కాకుండా ఎంపీసీలో చేరాల్సింది... ఎంపీసీ కాకుండా సీఈసీలో చేరాల్సింది.. హెచ్ఈసీ కాకుండా ఎంఈసీలో చేరాల్సింది అని బాధపడుతుంటారు... అంతా అయ్యిపోయిన తర్వాత బాధపడేకంటే.. ఓ అడుగు ముందుకేసి ముందే ఆలోచించాలి!!

ఇంటర్ తర్వాత...?

ఐఐటీలు, ఇంజనీరింగ్, మెడిసిన్‌లో చేరడమనేది జీవన్మరణ సమస్య ఎంతమాత్రం కాదు. సంప్రదాయ కోర్సులతోపాటు ఈవెంట్ మేనేజ్‌మెంట్, ఇంటీరియర్ డెకరేషన్, హెల్త్‌కేర్, పారామెడికల్, లాంగ్వేజెస్, అడ్వర్‌టైజింగ్, మైక్రోఫైనాన్స్, ఎడ్యుకేషన్, మీడియా, టెలివిజన్, స్పోర్ట్స్, ట్రావెల్ అండ్ టూరిజం, ఏవియేషన్, కమర్షియల్ పైలెట్, యానిమేషన్, కంపెనీ సెక్రటరీ, క్యాబిన్ క్రూ, హాస్పిటాలిటీ... ఇలా... కెరీర్ ప్రపంచం ఆకాశమంత విశాలంగా ఉంది! అంతరిక్షంలో నక్షత్రాలెన్ని ఉన్నాయో.. అంతకుమించిన అవకాశాలున్నాయ్!!


ప్రతి ఒక్కరూ ఇంజనీర్లు, డాక్టర్లు కానవసరం లేదు. 10+2 తర్వాత ఐఐటీలు... ఇంజనీరింగ్.. మెడిసిన్... వీటిల్లో చేరకపోతే భవిష్యత్ లేదనే ఆలోచన సరికాదు. ప్రపంచంలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు, హాస్పిటల్స్ మాత్రమే లేవు. మైక్రోసాఫ్ట్ అధినేత, ప్రపంచ కుబేరుడు బిల్‌గేట్స్. స్కూల్ డ్రాప్‌అవుట్! ప్రపంచ సాఫ్ట్‌వేర్ దిగ్గజం డెల్ కంప్యూటర్స్‌ను స్థాపించిన మైకెల్ డెల్... చదువు మధ్యలోనే ఆపేశారు. ఐపాడ్, ఐఫోన్‌లతో టెక్నాలజీ రంగాన్ని ఉర్రూతలూగించిన యాపిల్ కంపెనీ స్థాపకుడు స్టీవ్ జాబ్స్‌ది అరకొర చదువే! కాబట్టి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి టాప్ కాలేజీలు, కోర్సులొక్కటే మార్గంకాదు. ఆరంభంలోనే ఐదంకెల జీతాలందించే కోర్సులున్నాయి. ప్లేస్‌మెంట్స్‌లో కార్పొరేట్ జాబ్ ఖాయం చేసే కాలేజీలూ ఉన్నాయి. సేవతోపాటు సంపాదన, సంతృప్తిని మిగిల్చే కెరీర్స్ ఉన్నాయి. సృజనాత్మకతకు పదునుపెట్టే కోర్సులకూ కొదవలేదు. స్వయం ఉపాధితో పైకొచ్చే మార్గమూ లేకపోలేదు.

అందుబాటులో ఉన్న కోర్సులు

ఏ కోర్సులో చేరితే భవిష్యత్‌లో అవకాశాలు బాగుంటాయి? ఏ కెరీర్ ఎంచుకుంటే.. ఫ్యూచర్ బ్రైట్‌గా ఉంటుంది. ఏ కోర్సులో ఎక్కడ చేరాలి? ఆయా కోర్సుల్లో అడ్మిషన్‌కు ఏ పరీక్షలు రాయాలి? వినూత్న కోర్సులందించే ఇన్‌స్టిట్యూట్‌లు.. తదితర విషయాలను గురించి తెలుసుకుందాం.!!

టెన్త్ తర్వాత


ఎంపీసీ : ఎంపీసీ అనగానే తల్లిదండ్రులు, విద్యార్థులు చేసే భవిష్యత్తు ఆలోచన.. ఇంజనీరింగ్. వాస్తవానికి ఇంజనీరింగ్ అనేది ఎంపీసీ తర్వాత ఉన్న వంద దారుల్లో ఒక దారి మాత్రమే. డిగ్రీలో బీఎస్సీ చేయొచ్చు.. ఫ్యాషన్ టెక్నాలజీ.. లా.. చార్టర్డ్ అకౌంటెన్సీ.. యానిమేషన్, మీడియా కోర్సులు.. ఉన్నత విద్యకు వీల్లేకుంటే.. తప్పనిసరిగా ఉద్యోగం చేయాల్సివస్తే.. డిప్లమో కోర్సులు, సర్టిఫికెట్ కోర్సులతో తక్షణ ఉపాధి,



ఉద్యోగావశాలెన్నో.. ఇంజనీరింగ్, లేదా డిగ్రీ తర్వాత సివిల్స్, ఐఎఫ్ఎస్, ఐఈఎస్‌లతోపాటు ఏపీపీఎస్సీ గ్రూప్స్, రైల్వే, డిఫెన్స్, బ్యాంకింగ్ రంగాల్లో అవకాశాలు పుష్కలం.

బైపీసీ : తల్లిదండ్రులు, విద్యార్థుల ఆశలు, ఆశయాలకు రూపం.. బైపీసీ. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీఎన్‌వైఎస్, బీయూఎంఎస్ వంటి వైద్య కోర్సులతోపాటు వెటర్నరీ సైన్సెస్ కోర్సులు, అగ్రికల్చర్, ఫార్మసీ, పారామెడికల్... ఇలా ఎన్నో అవకాశాలు బైపీసీ విద్యార్థుల సొంతం. ఆధునిక ప్రపంచ పోకడలు మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, ఎక్స్‌రే టెక్నాలజీ, రేడియాలజీ, ప్రోస్తటిక్స్, ఆర్థోటిక్స్, డయాలసిస్ వంటి కోర్సులను ముందుకు తెచ్చింది. సంప్రదాయకంగా ఇంటర్ తర్వాత లైఫ్ సైన్సెస్‌లో బయాలజీ, బయోకెమిస్ట్రీ, బయోఫిజిక్స్, బయోఇన్ఫర్మేటిక్స్, మైక్రోబయాలజీ, మాలిక్యులర్ బయాలజీ, జెనిటిక్స్, జెనిటిక్ ఇంజనీరింగ్, బోటనీ, జువాలజీలతో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకొని... పీజీ, పీహెచ్‌డీలతో రీసెర్చ్, టీచింగ్ కెరీర్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చు. బోటనీ, జువాలజీలను ఆప్షన్స్‌గా తీసుకొని ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఎంపికైనవారెందరో. బైపీసీ అంటే.. ఎంబీబీఎస్, అగ్రికల్చరల్ కోర్సులేకాదు.. అత్యున్నత శిఖరాలకు ఎదగడానికి ఇంకా ఎన్నో మార్గాలున్నాయి.

సీఈసీ : ఇంటర్‌లో సీఈసీ పూర్తిచేయడం ద్వారా.. సహజంగా అందుబాటులో ఉండే బీకాం, బీబీఏ, బీబీఎంల్లో చేరొచ్చు. వీటి తర్వాత ఎంబీఏ చదివి సంస్థల నిర్వహణలో పాలుపంచుకునే కీలక అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. మేనేజ్‌మెంట్ నిపుణులుగా ఎదగొచ్చు. మరోవైపు చార్టర్డ్ అకౌంటెంట్, ఐసీడబ్ల్యూఏ, కంపెనీ సెక్రటరీ(సీఎస్) వంటి జాబ్ గ్యారెంటీ కోర్సులూ చదవొచ్చు. ఏ కంపెనీకైనా వీరి అవసరం



ఉంటుంది. ఇవి కష్టమనుకుంటే.. కాదనుకుంటే.. క్లాట్ రాసి జాతీయస్థాయిలోని ప్రతిష్టాత్మక లా కాలేజీల్లో న్యాయవిద్యను అభ్యసించొచ్చు. అకౌంటింగ్ ప్యాకేజెస్.. కామర్స్ విద్యార్థుల కోసమే. దాంతోపాటు బ్యాంక్ జాబ్స్, షేర్ మార్కెట్ కొలువులు, గ్రూప్-1,2,4 వంటి ఉద్యోగాలు ఉండనే ఉన్నాయి. ఇలాంటి సంప్రదాయ అవకాశాలతోపాటు బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, క్యాపిటల్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, ఎక్స్‌పోర్ట్, ఇంపోర్ట్ ఆర్గనైజేషన్స్, ఫైనాన్షియల్ విభాగాల్లోనూ కామర్స్ అభ్యర్థులు కెరీర్‌ను సొంతం చేసుకోవచ్చు.

హెచ్ఈసీ : ఇంటర్మీడియెట్‌లో హెచ్ఈసీ పూర్తిచేసిన అభ్యర్థులు డిగ్రీలో బీఏలో చేరొచ్చు. హెచ్ఈసీ విద్యార్థులు సైన్స్, టెక్నాలజీ కోర్సులు మినహాయించి... యానిమేషన్, ట్రావెల్ అండ్ టూరిజం, అడ్వర్‌టైజింగ్, జర్నలిజం, బిజినెస్ మేనేజ్‌మెంట్ వంటి అన్నిరకాల క్రేజీ కోర్సుల్లో చేరిపోవచ్చు. వీటితోపాటు జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఆధునిక కోర్సులూ తెరపైకి వస్తున్నాయి. గ్రూప్స్, సివిల్ సర్వీసెస్‌ను లక్ష్యంగా నిర్ణయించుకున్న వాళ్లకు హెచ్ఈసీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.



ఇంటర్ తర్వాత

ఇంటర్ పూర్తికాగానే ఇంజనీరింగ్, మెడిసిన్ కాకుండా కళ్లముందు కనిపించేది బీఎస్సీ/ బీకామ్/ బీఏ. వందల సంఖ్యలో కాలేజీలు.. వేల సంఖ్యలో సీట్లు. నేటి ఐటీ యుగంలో.. ప్రస్తుత మార్కెట్ ఎకానమీకి తగ్గట్లు కొన్ని ప్రత్యేక స్కిల్స్‌ను మెరుగుపరచుకుంటూ ఈ కోర్సుల్లో ఏది పూర్తిచేసినా.. అవకాశాలకేమీ కొదవలేదు. లా వంటి ప్రొఫెషనల్ కోర్సులతోపాటు రీసెర్చ్‌కూ బాటవేసుకోవచ్చు.

ఇంజనీరింగ్


ఆకాశంలో ఎగిరే విమానం.. రోడ్డుపై తిరిగే వాహనాలు.. పట్టాలపై పరుగులుపెట్టే రైళ్లు.. సముద్రంలో ప్రయాణించే ఓడలు.. చివరకు నిత్యకృత్యమైన సెల్‌ఫోన్లు, కంప్యూటర్‌లుఅన్నీ ఇంజనీరింగ్ ఆవిష్కరణలే! పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకం. ఐఐటీలు, నిట్‌లు, ఐఐఐటీల్లో ఇంజనీరింగ్ పూర్తి చేసినవారితో సబ్జెక్టుపై పట్టున్న ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థికి అవకాశాలు అనేకం. ఇంజనీరింగ్‌లో ప్రవేశానికి ప్రతిష్టాత్మక ఐఐటీ-జేఈఈ, ఏఐఈఈఈ, ఎంసెట్ మార్గాలు. ఈ ఏడాది నుంచి దేశవ్యాప్తంగా కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ నిర్వహించనున్నారు. కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ వంటి బ్రాంచీల్లో దేశవ్యాప్తంగా పది లక్షలకుపైగా ఇంజనీరింగ్ సీట్లుంటే...ఒక్క మన రాష్ట్రంలోనే 3 లక్షల ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి.

మెడిసిన్

తెల్లకోటు, స్టెతస్కోప్.. డాక్టర్ డ్రెస్ కోడ్. ఈ డ్రెస్‌కోడ్ లక్షల మంది కల. కానీ నిజం చేసుకోగలిగేది కేవలం 30 వేల మందే. దేశంలో ఎంబీబీఎస్ కోర్సుకున్న డిమాండ్‌కు ఇదే నిదర్శనం. సీట్లు తక్కువ.. పోటీ ఎక్కువ కోర్సు ఏదంటే ఠక్కున గుర్తుకొచ్చేది ఎంబీబీఎస్. ఎంబీబీఎస్ అంటే-బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్ అండ్ బ్యాచిలర్ ఆఫ్ సర్జరీ. ఇంటర్‌లో బైపీసీ తర్వాత మెడిసిన్‌లో చేరడానికి మెడికల్ ఎంట్రన్స్ రాయాలి. మన రాష్ట్రంలో దాదాపు 4500 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్న్‌షిప్‌తో కలుపుకొని ఐదేళ్లకు పైగా సాగే ఎంబీబీఎస్ తర్వాత అవకాశాల గురించి ఆలోచించాల్సిన పనేలేదు. ఈ ఏడాది నుంచి దేశవ్యాప్తంగా కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌ని 'నీట్' నిర్వహించనున్నారు.

ఫార్మసీ

దేశంలో ఫార్మా రంగం ఉజ్వలంగా దూసుకుపోతోంది. ఔషధ తయారీ కంపెనీలు... బల్క్ డ్రగ్స్ యూనిట్లు.. బహుళజాతి కంపెనీలు...రాన్‌బాక్సీ, అరబిందో, రెడ్డి ల్యాబ్స్, నాట్కో, దివిల్యాబ్స్- ఇలా అనేక ఫార్మా కంపెనీలు.. రోగాలను సమర్థంగా ఎదుర్కొనే మందుల తయారీపై దృష్టిసారించాయి. దాంతో ఫార్మా నిపుణులకు అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయి. డిఫార్మసీ, బీఫార్మసీ, ఫార్మ్‌డి, ఎంఫార్మసీ, ఫార్మసీలో పీహెచ్‌డీ వరకూ విద్యను అభ్యసించవచ్చు. ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి **కనీస అర్హత :** ఇంటర్ ఎంపీసీ/ బైపీసీ.





హెల్త్‌కేర్

హెల్త్‌కేర్‌లో భారత్ బాగా వెనుకబడి ఉందనేది అన్ని సూచీల సారాంశం. విస్తరణకు అన్నివిధాల స్కోప్ ఉన్న రంగం హెల్త్‌కేర్. హెల్త్‌కేర్‌లో అనేక విభాగాలు.. పబ్లిక్ హెల్త్, మెంటల్ హెల్త్, యాక్సిడెంట్స్/ ట్రామ్, డ్రగ్ అబ్యూస్/ డీఅడిక్షన్, హాస్పిటల్స్ అడ్మినిస్ట్రేషన్, నర్సింగ్ సెంటర్లు, మెడికల్ లేబొరేటరీ సర్వీసెస్‌ల్లో అనేకరకాల ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి.

బ్యాచిలర్ ఆఫ్ సైన్స్

బ్యాచిలర్ డిగ్రీ పూర్తయ్యాక ఉన్నతవిద్యను లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థులు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ వంటి సైన్స్ సబ్జెక్టుల పట్ల ప్రత్యేక ఆసక్తితో రీసెర్చ్ దాకా వెళ్లాలనుకునేవారు నిశ్చింతగా బ్యాచిలర్ ఆఫ్ సైన్స్‌లో చేరొచ్చు. అంతేకాదు.. గ్రాడ్యుయేషన్ తర్వాత క్లైమెట్, ఎర్త్ సిస్టమ్ సైన్సెస్, వైల్డ్‌లైఫ్ సైన్సెస్‌లో అరుదైన కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఐతే ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాల్లో భారీ జీతాలతో జాబ్స్.. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రీటైల్, మెడికల్, హెల్త్‌కేర్, ఫార్మారంగాల్లో అవకాశాలు ఊపందుకోవడంతో.. గత కొన్నేళ్లుగా సంప్రదాయ డిగ్రీ కోర్సుల కంటే ఇంజనీరింగ్, మెడికల్, మెడికల్ అనుబంధ ఫార్మా వంటి కెరీర్స్ వైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)లు సైన్స్‌లో ఇంటిగ్రేటెడ్ కోర్సులను ప్రవేశపెట్టినా... సాధారణ కాలేజీల్లో సైన్స్ కోర్సులకు పెద్దగా ఆదరణ పెరగలేదు. దాంతో సైన్స్, ఆర్ట్స్ కోర్సులకు పేరుగాంచిన ఢిల్లీ యూనివర్సిటీ వంటి విద్యాసంస్థలు సైతం కరిక్యులంలో పాలిమర్స్, మైక్రోఎలక్ట్రానిక్స్, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ వంటి అనుబంధ అంశాలను చేరుస్తున్నాయి. మరికొన్ని కాలేజీలు సైన్స్ విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంచేదిశగా ప్రాజెక్టు వర్క్‌లను ప్రవేశపెడుతున్నాయి.

బ్యాచిలర్ ఆఫ్ కామర్స్

ఏడు లక్షల వార్షిక ప్యాకేజీ.. ఈ వేతన ప్యాకేజీ ఏ ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలోనో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో వచ్చింది కాదు. ఇది బీకామ్ హానర్స్ చదివిన విద్యార్థికి ఓ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ఇచ్చిన ఆఫర్! ఇది శ్రీరాం కాలేజ్ ఆఫ్ కామర్స్, ఢిల్లీ యూనివర్సిటీ లాంటి కామర్స్ కోర్సులకు పేరుగాంచిన కాలేజీల్లో సాధ్యమైంది. అంటే.. జాబ్ మార్కెట్‌లో కామర్స్ కోర్సులకు కావల్సినంత డిమాండ్ ఉంది. కాకపోతే సబ్జెక్ట్, స్కిల్స్ ఉన్నవాళ్లు మాత్రమే జాబ్ ఆఫర్స్ అందుకుంటున్నారు. సబ్జెక్ట్ ఏదైనా కెరీర్ ఏదైనా రాణిస్తున్నారు. మన రాష్ట్రంలో దాదాపు అన్ని యూనివర్సిటీల్లో, అన్ని కాలేజీల్లో కామర్స్ కోర్సులున్నాయి. సంప్రదాయ బీకామ్ కామర్స్‌తోపాటు మార్కెట్ అవసరాలకు తగ్గట్లు బీకామ్ విత్ బ్యాంకింగ్ అండ్ ఇన్సూరెన్స్, బీకామ్ అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్ వంటి కోర్సులను యూనివర్సిటీలు ప్రవేశపెడుతున్నాయి. బీకామ్‌తో చార్టర్డ్ అకౌంటెంట్, కంపెనీ సెక్రటరీ, కాస్ట్ అకౌంటెంట్ వంటి ఏ ప్రొఫెషనల్ కోర్సును పూర్తిచేసినా వెనక్కు తిరిగి చూసుకునే పనే ఉండదు. ఇవి కాదనుకుంటే కంపెనీ సెక్రటేరియల్ ప్రాక్టీస్, యాక్చూరియల్ సైన్సెస్ వంటి వినూత్న అవకాశాలూ ఉన్నాయి.

బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్

ఆర్ట్స్ విభాగంలో ఉన్నన్ని సబ్జెక్టులు వేరే ఏ స్ట్రీమ్‌లోనూ లేవని చెప్పొచ్చు. దేశంలో ఎక్కువమంది చేరేది కూడా బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్‌లోనే. కొంతకాలం వరకూ బీఏ అంటే...ఏదో ఒక డిగ్రీ కోసం చేరడమనే అభిప్రాయం ఉండేది. కానీ ఇప్పుడు ఎకనామిక్స్, సైకాలజీ వంటి సబ్జెక్టులకు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా.. ఆర్ట్స్ అభ్యర్థులకు కెరీర్ అవకాశాలు మెరుగవుతున్నాయి. బీఏతోనే ఆగిపోకుండా... ఎంబీఏ, లా, మీడియా, టీచింగ్, హెచ్ఆర్, అడ్వర్‌టైజింగ్... విభాగాల్లో ఉన్నతవిద్యను అభ్యసించడం ద్వారా ఇంజనీరింగ్, మెడిసిన్‌కు దీటైన కెరీర్‌ను సొంతం చేసుకోవచ్చు. ★

ఉద్యోగాలు

ఏపీ పాలిసెట్-2018

ఏపీ 'పాలిసెట్' 2018-19 విద్యా సంవత్సరానికి గాను (పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) ప్రవేశ ప్రకటన విడుదలైంది.

అర్హతలు : పదో తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్, విజయవాడ వారి గుర్తింపు పొందిన అభ్యర్థులు మాత్రమే అర్హులు. కంపార్ట్‌మెంటల్‌గా ఉత్తీర్ణులైన లేదా ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరుకాబోతున్న అభ్యర్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ప్రవేశానికి ముందు అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులై ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది: 14.04.2018

వెబ్‌సైట్: https://polycetap.nic.in

దరఖాస్తు ఫీజు : రూ.350/- (హెల్ప్‌లైన్ సెంటర్లు/ ఏపీ ఆన్‌లైన్ సెంటర్ల గేట్‌వే ద్వారా చెల్లించాలి)

పరీక్ష తేదీ : 27-04-2018న ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు

పూర్తి వివరాలకు వెబ్‌సైట్: http://sbtetap.gov.in

గమనిక : ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో ఆధార్ నెంబరు తప్పనిసరి.

ఇస్రో-స్పేస్ అప్లికేషన్ సెంటర్‌లో 80 ఉద్యోగాలు

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ - ఇస్రో)కు అనుబంధంగా అహ్మదాబాద్‌లో ఏర్పాటుచేసిన స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఎస్ఏసీ).. 80 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు: సైంటిస్ట్/ ఇంజనీర్ 'ఎస్‌డీ'-3, సైంటిఫిక్ అసిస్టెంట్ 'ఎ'-1, టెక్నీషియన్ 'బి'-73 (ఫిట్టర్-14+మెషినిస్ట్-4+టర్నర్-1+ ఎలక్ట్రానిక్స్-34 + ఎలక్ట్రీషియన్-2+ఎల్‌పీసీపీ/ ఏవోసీపీ-4+డిజిటల్ ఫొటోగ్రాఫర్-1+ఆర్ఏసీ-2+ ఐటీ/ ఐసీటీఎస్ఎం/ ఐటీఈఎస్ఎం-9+ సీహెచ్ఎన్ఎం-2), కేటరింగ్ అటెండెంట్ 'ఎ'-1బీ కుక్-2.

వేతనశ్రేణి: సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌డి'-రూ.67,700-రూ.2,08,700, సైంటిఫిక్ అసిస్టెంట్ 'ఎ'-రూ.44,900-రూ.1,42,400, టెక్నీషియన్ 'బి'-రూ.21,700-రూ.69,100, కేటరింగ్ అటెండెంట్ 'ఎ'-రూ.18,000-రూ.56,900, కుక్-రూ.19,900-రూ.63,200.

అర్హతలు: సైంటిస్ట్/ ఇంజనీర్ 'ఎస్‌డి'కి.. ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో బీఈ/ బీటెక్+ఎంఈ/ ఎంటెక్‌తోపాటు పీహెచ్‌డీ (ఎలక్ట్రానిక్స్/ వీఎల్ఎస్ఐ/ మైక్రోవేవ్), సైంటిఫిక్ అసిస్టెంట్ 'ఎ'కు బీఎస్సీ (మల్టీమీడియా/ యానిమేషన్), టెక్నీషియన్ 'బి' పోస్టులకు పదో తరగతి/ తత్సమాన విద్యతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ/ ఎన్‌టీసీ/ ఎన్ఏసీబీ కేటరింగ్ అటెండెంట్ 'ఎ', కుక్‌కు పదోతరగతి/ తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. కుక్ పోస్టులకు అదనంగా ఏదైనా హోటల్/ క్యాంటీన్‌లో కనీసం ఐదేళ్ల అనుభవం.

వయసు: సైంటిఫిక్ అసిస్టెంట్ 'ఎ', టెక్నీషియన్ 'బి', కుక్ పోస్టులకు 18-35 ఏళ్ల లోపు, కేటరింగ్ అటెండెంట్ 'ఎ'కు 18-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి. సైంటిస్ట్/ ఇంజనీర్ 'ఎస్‌డి'కి గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.

ఎంపిక: సంబంధిత పోస్టులను అనుసరించి రాతపరీక్ష, స్కిల్ టెస్ట్.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ: ఏప్రిల్ 2, 2018.

పూర్తి వివరాలు: వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్: www.sac.gov.in

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో 54 పోస్టులు

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సౌత్ వెస్టర్న్ ఎయిర్ కమాండ్ పరిధిలోని ఎయిర్‌పోర్ట్ స్టేషన్స్‌లో 54 గ్రూప్ 'సి' ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది.

పోస్టు-ఖాళీలు: మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్)-12, హౌస్ కీపింగ్ స్టాఫ్ (హెచ్‌కేఎస్)-8, మెస్ స్టాఫ్-16, లాండ్రీమ్యాన్-2, కుక్ (ఆర్డినరీ గ్రేడ్)-6, కార్పెంటర్-3, పెయింటర్-2, వల్కనైజర్-1, ఎల్‌డీసీ-4.

అర్హతలు: ఎల్‌డీసికి ఇంటర్మీడియెట్/ తత్సమాన విద్యతోపాటు టైపింగ్, మిగిలిన పోస్టులకు పదోతరగతి/ తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. అలాగే కార్పెంటర్, పెయింటర్‌కు అదనంగా సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ, కుక్ పోస్టుకు అదనంగా కేటరింగ్‌లో డిప్లొమా ఉండాలి.

వయసు: 18-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక: రాతపరీక్ష, స్కిల్/ ప్రాక్టికల్/ ఫిజికల్ టెస్ట్.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.

దరఖాస్తు చేరడానికి చివరి తేదీ: ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో నోటిఫికేషన్ వెలువడిన 30 రోజుల్లోపు (ఏప్రిల్ 9, 2018).

పూర్తి వివరాలు: వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్: www.indianairforce.nic.in

అవిశ్వాసానికి కలిసి రావాలి : జెడి శీలం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (ఒంగోలు)

ఈ నెల 27న పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానానికి టిడిపి, వైసిపి కలిసి రావాలని కేంద్ర మాజీ మంత్రి జెడి.శీలం కోరారు. స్థానిక డిసిసి కార్యాలయంలో ఆదివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో జెడి శీలం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. 2014లో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి యుపిఎ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని, లేకపోతే రాష్ట్ర ప్రజలు, రైతులు, నిరుద్యోగ యువత నష్టపోతారని ప్రధాని నరేంద్ర మోడీకి రెండు సార్లు లేఖ ఇచ్చారని వివరించారు. ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకోకుండా ముఖ్యమంత్రి ఆ రోజే పోరాటం చేసి ఉంటే ప్రజలు హర్షించేవారన్నారు. సమావేశంలో ఎఐసిసి సభ్యులు, డిసిసి అధ్యక్షులు ఈదా సుధాకర్ రెడ్డి, ఎఐసిసి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



దీక్షలు శ్రీకాకుళంలో ఉద్యోగులు చేపట్టిన దీక్షా శిబిరంలో ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు

పాత పెన్షన్ విధానం కోసం పోరాటం

ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు పురుషోత్తంనాయుడు - 48 గంటల దీక్ష ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సిపిఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేసేవరకూ పోరాడతామని ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు అన్నారు. శ్రీకాకుళంలోని ఎన్‌జిఒహోం సమీపంలో ఎపి సిపిఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన చేపట్టిన 48 గంటల రిలే నిరవధిక నిరాహార దీక్షలను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పురుషోత్తంనాయుడు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రాష్ట్రంలో అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. పాత పింఛను విధానం అమలు చేయాలని సిపిఎస్ ఉద్యోగులతో ఈ నెల 28, 29 తేదీల్లో విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 28న రాయలసీమకు చెందిన ఆరు జిల్లాల్లో, 29న కోస్తా, ఉత్తరాంధ్రాకు చెందిన ఏడు జిల్లాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు వివరించారు. అంతకుముందు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలేసి, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు నివాళులర్పించారు. దీక్షలో 30 మంది ఉద్యోగులు కూర్చున్నారు. వీరికి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సంఘీభావం తెలిపి, పూర్తి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి రవీంద్ర, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఎస్.రాజశేఖర్, వి.హరిశ్చంద్రుడు, కె.భానుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు అపూర్వ స్పందన

- రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్
- ఉత్తరాంధ్రలో కొనసాగుతున్న జీపు జాతాలు
- సీతానగరం మండలంలో సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - యంత్రాంగం

విశాఖకు రైల్వే జోన్ కేటాయించాలని కోరుతూ సిపిఎం విశాఖ నగరంలో మహా పాదయాత్ర.. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో జీపు జాతాలు కొనసాగుతున్నాయి. రైల్వే జోన్ కోరుతూ విశాఖలో పాదయాత్ర ఆదివారానికి ఐదో రోజుకు చేరుకుంది. జివిఎంసి 45వ వార్డు పరిధి కాకరలోవ ప్రాంతంలో ప్రారంభమైన యాత్రకు అపూర్వ స్పందన లభించింది. చింతలలోవ, క్రాంతినగర్, శ్రీనాథపురం, దుర్గానగర్, అల్లూరి సీతారామరాజు కాలనీ, తెలుగుదేశం కాలనీ, అంబేద్కర్‌కాలనీ, జనతా కాలనీ, ప్రసాద్ నగర్, ఇండస్ట్రియల్ కాలనీ, ఇంద్రాకాలనీ, బర్మా కాలనీ, ఎక్స్ సర్వీస్‌మ్యాన్ కాలనీ, గొల్లలపాలెం మీదుగా కంచరపాలెం ప్రాంతానికి చేరుకుంది. త్రినాథపురం వద్ద జరిగిన సభలో పార్టీ నగర కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ టిడిపి, బిజెపిల మోసపూరిత విధానాలను వివరించారు. రైల్వేజోన్ విశాఖకు వస్తే యువతకు ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. పలుచోట్ల వైసిపి, జనసేన నాయకులు మద్దతు తెలిపారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జీపుజాతాను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు ఆదివారం ప్రారంభించారు. జాతా ఇచ్ఛాపురం, బొరివంక, కవిటి, కంచిలి, సోంపేట, బూరగాం, బారువు, మామిడిపల్లి మీదుగా మందస చేరుకుంది. జిల్లాలో శనివారం ప్రారంభించిన జీపు జాతా రెండో రోజూ కొనసాగింది. ఆదివారం పాలకొండ, సీతంపేట, మెట్టూరు, కొత్తూరు మీదుగా బాలేరు చేరుకుంది. జాతాలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.కృష్ణమూర్తి, నాయకులు ఎం.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు. విజయనగరం జిల్లాలో సిపిఎం చేపట్టిన ప్రచార జీపుయాత్ర మూడోరోజు జిల్లాలోని మెరకముడిదాం, దత్తిరాజేరు, గజపతినగరం, మెంటాడ మండలాల్లో సాగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ భావి తరాలు బాగుండాలంటే రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలని అందుకు ప్రజలంతా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మరోవైపు సీతానగరం మండలంలో చేపట్టిన సైకిల్‌యాత్ర రెండోరోజు పలు గ్రామాల్లో సాగింది. విశాఖ జిల్లా రావికమతం మండలం కొత్తకోట, దొండపూడి, టి.అర్జాపురం, పి.గదపపాలెం, డోలవానిపాలెం, మేడివాడ, రావికమతంలో ఆదివారం జీపుజాతా కొనసాగింది. గొలుగొండ మండలం సుద్దలపాలెం, అడ్డలోవ, చీడిగుమ్మల, యర్రవరం గ్రామాల్లో జీపుజాతా ఉత్సాహంగా సాగింది. బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో జీపుజాతాకు ప్రజల నుంచి స్పందన లభించింది. మన్యంలో పెదబయలు, ముంచంగిపుట్టులో కూడా జీపుజాతా కొనసాగింది. జాతాల్లో సిపిఎం నాయకులు జి.నాయినిబాబు, కె.అప్పలరాజు మాట్లాడారు.



విశాఖ కాకరలోవలో సాగుతున్న సిపిఎం పాదయాత్ర

హోదా కోసం ఐక్యపోరాటం : వి.ఉమామహేశ్వరరావు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఐదు కోట్ల మంది తెలుగు ప్రజలను మోసగించిందని, రానున్న రోజుల్లో ఉద్యోగ, కార్మిక సంఘాలతో ఐక్య పోరాటం చేస్తామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో విజయవాడ భవానీపురం ఐరన్ యార్డులో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా వల్లే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యమన్నారు. ఆంధ్ర ప్రాంతానికి రాజధాని నిర్మాణం జరగాలంటే సుమారు రూ.50 కోట్లు అవసరమన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలన్నింటిని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తామని వాగ్దానం చేసి నాలుగేళ్లు గడిచినా ఒక్క హామీనీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి టి.సుబ్బారెడ్డి, సహాయ కార్యదర్శి ఇ.వి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం జిల్లా పొదిలిలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

నోట్ల రద్దు తర్వాత నల్ల డబ్బు ఏమైంది?

సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు సూటి ప్రశ్న

ప్రజాశక్తి-పొదిలి (ప్రకాశం)

నోట్ల రద్దు తర్వాత నల్లడబ్బు ఏమైందని సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం పొదిలి పట్టణంలోని ఎన్‌జిఒ హోమ్‌లో సిపిఎం ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత కమిటీ విస్తృత సమావేశం జిల్లా నాయకులు గాలి వెంకటరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని స్పష్టం చేశారు. విభజన సమయంలో పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో బిజెపి ప్రభుత్వం దోషిగా నిలడిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై స్పష్టత లేని ప్రాంతీయ పార్టీలతో సిపిఎం పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు. స్విస్ బ్యాంకుల్లో నల్లడబ్బును అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో తెస్తామని చెప్పిన బిజెపి పెద్దనోట్లను రద్దు చేసి నలుపును తెలుపు చేసిందని విమర్శించారు. నోట్ల రద్దు తరువాత నల్లడబ్బు ఏమైందని ప్రశ్నించారు. గుత్త పెట్టుబడిదారుల నల్లడబ్బును మార్చుకునేందుకే నోట్ల రద్దు చేసిందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా ప్రతిఘటన రోజురోజుకూ పెరుగుతోందన్నారు. జాతీయస్థాయిలో వామపక్ష ప్రాబల్యం తగ్గించాలని ఉవ్విళ్లూరుతున్న బిజెపి అదే స్థాయిలో ప్రజా వ్యతిరేకతను కూడగట్టుకుందన్నారు. త్రిపురలో ఓడినంత మాత్రాన ఎర్రజెండా ఒరిగిపోలేదన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వైవి.రావు మాట్లాడుతూ ఈ నెల 27న రాజ్యాంగ పరిరక్షణ పేరుతో అంబేద్కర్ విగ్రహాల వద్ద బిజెపికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ పశ్చిమ ప్రకాశం కమిటీ కార్యదర్శి సయ్యద్ హనీఫ్ పాల్గొన్నారు.

'ఉపాధి' బకాయిలను తక్షణం చెల్లించాలి

వ్యకాస రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు బకాయి కూలి తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీకాకుళంలో అయన మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ బదులు పనిచేసిన చోటే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. తపాలాశాఖ ద్వారా కూలి చెల్లించాలని చెప్పారు. వేసవిలో రెట్టింపు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించకుంటే మేలో రాష్ట్ర వ్యాప్తంగా మండల కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగరాపు సింహాచలం, కోరాడ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల తరలింపును సహించం

బుచ్చిరాజుపేట, నల్లమట్టిపాలెం వాసుల హెచ్చరిక

ప్రజాశక్తి - నక్కపల్లి (విశాఖ)

పరిశ్రమల స్థాపనం కోసం గ్రామాలను తరలిస్తే సహించమని విశాఖ జిల్లా నక్కపల్లి మండం బుచ్చిరాజుపేట, నల్లమట్టిపాలెం గ్రామస్తులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గ్రామాల తరలింపును విరమించుకోవాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. విశాఖ జిల్లా బుచ్చిరాజుపేట గ్రామంలో సర్పంచ్ భర్త గొర్ల బాబూరావు అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ప్రభుత్వం మొదట భూములు మాత్రమే తీసుకుంటామని చెప్పి భూసేకరణ చేపట్టిందని, ప్రస్తుతం గ్రామాలను ఖాళీ చేయాలని అధికారులు చెప్పడం భావ్యం కాదన్నారు. సర్వేకు సహకరించాలని అధికారులు చెబుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి గ్రామాల్లో ఉంటూ కూలి, నాలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, గ్రామాలను తరలిస్తే రోడ్డున పడతామని ఆవేదన వెలిబుచ్చారు. వీరికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కన్వీనర్ పి.వెంకటస్వామి, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.రాజేష్ మద్దతు తెలిపారు.

పిఆర్‌టియు సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి - గాంధీనగర్ (విజయవాడ)

ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పిఆర్‌టియు) ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు హోదా కల్పించాలని కోరుతూ విజయవాడ గాంధీనగర్‌లోని అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో ఒకరోజు సత్యాగ్రహ దీక్షను చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ పిఆర్‌టియు ఫ్లోర్ లీడర్ గాదె శ్రీనివాసులునాయుడు మాట్లడుతూ 2014లో రాష్ట్రాన్ని విభజించి రాష్ట్రానికి విద్యాసంస్థలు, ప్రత్యేక ప్యాకేజీ, ఆర్థిక లోటు అనేక సమస్యలతో రాష్ట్రాన్ని విభజించి రాష్ట్రానికి అన్యాయం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి 16 వేల కోట్ల లోటు బడ్జెట్‌తో 13 జిల్లాల ప్రజలకు అన్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమానికి 13 జిల్లాల నుండి పిఆర్‌టియు సంఘం ఉపాధ్యాయులు ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. మార్చి 22న
2. 2020 మార్చి వరకూ
3. న్యూఢిల్లీలో మార్చి 20న
4. ఒడిషా
5. మేఘాలయలోని ఈస్ట్ కాశీ జిల్లాలోని లైత్సోహుమ్ గ్రామం వద్ద

బాపనయ్య జీవితం ఆదర్శనీయం

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పాటూరు రామయ్య




గుంటూరు బాపనయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాటూరు రామయ్య, వి.వెంకటేశ్వర్లు తదితరులు

ప్రజాశక్తి - మచిలీపట్నం

శాసనసభ్యునిగా, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ప్రజలకు నిస్వార్థ సేవలు చేసి భూమికోసం, భుక్తి కోసం, సాంఘిక యుక్తి కోసం పోరాటానికి శంఖారావం పూరించిన కామ్రేడ్ గుంటూరు బాపనయ్య జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, ప్రజాశక్తి ఎడిటర్ పాటూరు రామయ్య కొనియాడారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని జ్యోతిరావుపూలే విజ్ఞాన కేంద్రంలో గుంటూరు బాపనయ్య 40వ వర్ధంతి సభ ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా పాటూరు రామయ్య మాట్లాడుతూ 1919లో దివిసీమలోని నాగాయతిప్ప గ్రామంలో బాపనయ్య నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన ఆయన తొలిరోజుల్లో కుల వివక్షతకు గురయ్యారని గుర్తు చేశారు. ఆనాటి నుంచి కమ్యూనిస్టు ఉద్యమాల్లో పాల్గొని అనేక పోరాటాలు చేశారని చెప్పారు. నేడు దళితులు స్వేచ్ఛగా బయటకు తిరుగుతున్నారంటే ఆ పోరాటాల ఫలితమేనని గుర్తు చేశారు. బాపనయ్య స్వీయ అనుభవంతో దేశ, ప్రపంచంలోని సమస్యలను తెలుసుకునేవారన్నారు. వ్యవసాయ కార్మికులు ఎల్లప్పుడూ దోపిడీకి గురౌతూనే ఉంటారన్నారు. ఆ రోజుల్లో నెల్లూరు జిల్లాలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించారని, ఆ స్ఫూర్తితో బాపనయ్య కృష్ణా జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘాన్ని నెలకొల్పి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. చల్లపల్లి రాజాకు 30 వేల ఎకరాలు ఉండేవని గుర్తుచేశారు. చంద్ర రాజేశ్వరరావు, చల్లపల్లి నారాయణలతో కలిసి బాపనయ్య జమీందార్లపై పోరాటాలు చేశారని, అనేక సమస్యలను ఎదుర్కొన్నారన్నారు.

వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం రాష్ట్రవ్యాప్తంగా భూపోరాటాల్లో పాల్గొన్నారన్నారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాపనయ్య జీవితాంతం ప్రజల కోసమే జీవించారని, ప్రజాపోరాటాల్లోనే చనిపోయా రన్నారు. అందుకే ఆయన మృతి చెంది 40 సంవత్సరాలు గడిచినా నేటికీ పేదల మనసుల్లో నిలిచారన్నారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం తూర్పుకృష్ణా కార్యదర్శి ఎం.రాజేష్ అధ్యక్షత వహించారు. కెవిపిఎస్ తూర్పుకృష్ణా కార్యదర్శి డి.సాల్మన్‌రాజు, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.రవి, పట్టణ ప్రధాన కార్యదర్శి సిహెచ్.రాజేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు విశాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రైతులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న డివి సుబ్బారావు

రైతుల కోసం ఫార్మర్స్ ప్రొడ్యుసర్స్ ఆర్గనైజేషన్

వ్యవసాయ జాతీయ సదస్సులో నాబార్డు ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ డివి సుబ్బారావు

ప్రజాశక్తి- బాపట్ల (గుంటూరు జిల్లా)

వ్యవసాయాన్ని సులభతరం, లాభదాయకం చేసేందుకు కృషి ప్రారంభమైందని నాబార్డు ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ డివి సుబ్బారావు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా బాపట్లలోని వ్యవసాయ కళాశాలలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న వ్యవసాయ జాతీయ సదస్సులో భాగంగా ఆదివారం రైతులతో నిర్వహించిన ఇష్టాగోష్టిలో సుబ్బారావు మాట్లాడారు. నూతన పద్ధతుల ద్వారా సన్న, చిన్నకారు రైతులు, కౌల్దార్ల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేలా వ్యవసాయ రంగంలో సరళీకృతమవుతోందని చెప్పారు. పెద్దరైతులంతా పొలాన్ని కౌలుకు ఇస్తున్న నేపత్యంలో కౌల్దార్లు, సన్న, చిన్నకారు రైతులు ఒంటరి పోరాటంతో ముందుకెళ్లలేకపోతున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో చిన్నరైతుల్ని సంఘాలుగా ఒకే గొడుకు కిందికి తెచ్చి నిపుణుల ద్వారా సలహాలిస్తామన్నారు. గిట్టుబాటు ధరలతోపాటు ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఫలితాలను వారికే చెందేలా విధనాలను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఫార్మర్స్ ప్రొడ్యుసర్స్ ఆర్గనైజేషన్ స్థాపన ద్వారా రైతులకు భరోసా కల్పించే ప్రయత్నం చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాబార్డు డిజిఎం ఎపిఆర్‌ఒ ఆర్.శంకన నారాయణ, డిపి దాస్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ప్రత్యేకం

పోర్టు గ్రహణం వీడేనా..?

- ఏళ్ల తరబడి వాయిదా పడుతున్న నిర్మాణ పనులు
- జిల్లా ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

బందరు పోర్టుకు పట్టిన రాజకీయ గ్రహణం వీడటం లేదు. నిర్మాణ పనులు ఏళ్ల తరబడి వాయిదా పడుతూ వస్తున్నాయి. దుగ్గిరాజపట్నం పోర్టుకు ప్రత్యామ్నాయం చూపించటం లేదంటూ కేంద్రంపై చిందులు వేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకొచ్చి నాలుగేళ్లు కావస్తున్నా బందరు పోర్టు నిర్మాణ పనులను ఎందుకు చేపట్టలేకపోతున్నారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అధికారంలోకొచ్చిన ఆరు నెలల్లో నిర్మాణ పనులను పట్టాలెక్కిస్తానంటూ జిల్లా ప్రజలకు చంద్రబాబు ఇచ్చిన ఎన్నికల హామీ నేటికీ నెరవేర్చకపోవడంతో జిల్లా ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మార్చి, 2018 నాటి కల్లా పోర్టు నిర్మాణ పనులు చేపట్టి తీరుతామంటూ ఆరు నెలల నుండి ఊదరగొడుతున్న రాష్ట్ర క్రీడలు, యువజన, న్యాయశాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటనల్లోనూ పసలేదని అర్థమైంది. భూ బాధితులతో చంద్రబాబు నిర్వహించిన ముఖాముఖీ సమావేశం ఆశించిన ఫలితాలను రాబట్టలేకపోయింది. ఈ క్రమంలోనే నాలుగేళ్ల నుండి నోరు మెదపని బిజెపి నేతలు బందరు పోర్టుకు 33 వేల ఎకరాలు ఎందుకంటూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలివ్వటం హాట్ టాపిక్‌గా మారింది. బందరు పోర్టు జిల్లా సమగ్రాభివృద్ధితో ముడిపడి ఉందన్న విషయాన్ని చంద్రబాబు సర్కార్ ఉద్దేశ్యపూర్వకంగా విస్మరిస్తుందనే భావన ప్రజల్లో బలంగా నాటుకుంది.

దేశంలో మూడో మున్సిపాల్టీగా చరిత్రకెక్కిన బందరు పురపాలక సంఘం నేడు జనాభా తగ్గుతున్న ఏకైక పట్టణంగా సరికొత్త ట్రెండ్‌ను సృష్టిస్తోంది. ఖాళీ అవుతున్న పట్టణ జనాభాను చూసి బాధపడాలో.. పట్టణ అభివృద్ధిని కాంక్షించని ప్రభుత్వాలను తప్పుబట్టాలో తెలియని సందిగ్ధావస్థ నెలకొంది. జిల్లా సమగ్రాభివృద్ధితో ముడిపడి ఉన్న బందరు పోర్టు నిర్మాణంతోనే వలసలు అదుపులోకి తీసుకురాగలమనే బలమైన నమ్మకంతో దశాబ్దంన్నర క్రితం జిల్లా ప్రజలు సంఘటితమయ్యారు. బందరు తీరం కన్నా గోగిలేరు ప్రాంతం బెటర్ అంటూ కొన్ని రాజకీయ శక్తులు తెరవెనుక లాబీయింగులు నడిపాయి. స్థానికులు, విపక్షాలు తిరిగి గళమెత్తటంతో చివరకు బందరు తీరాన్నే ఖరారు చేశాయి.

బందరు పోర్టుకు రెండు వేల ఎకరాలు సరిపోతాయంటూ విపక్షంలో ఉండగా ఉద్యమించిన టిడిపి అధికారంలోకొచ్చిన తర్వాత పోర్టుకు పారిశ్రామిక నడవాను మేళవించి 33 వేల ఎకరాలకు నోటిఫికేషన్ ఇవ్వటం ఇటు రాజకీయ పార్టీలను అటు ప్రజలను నిర్ఘాంతపర్చింది. టిడిపి సర్కార్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విపక్షాలన్నీ ఒకే గొడుకు కిందకొచ్చాయి. ఉద్యమాన్ని తీవ్రతరం చేయటంతో ప్రభుత్వం తాత్కాలికంగా వెనుకడుగు వేసింది. అయితే 2013 భూసేకరణ చట్ట ప్రకారం భూములను సేకరించేది లేదని, భూసమీకరణ (ల్యాండ్‌పూలింగ్)కు రైతులు ముందుకు రావాలంటూ మెలిక పెట్టింది. వరుసగా మూడు సార్లు నోటిఫికేషన్‌ను పొడిగిస్తూ వచ్చింది తప్ప చట్టప్రకారం నష్టపరిహారం ఇవ్వనంటోంది. అధికారులు, రైతులతో సమీక్షలు, సమావేశాల నిర్వహణ అనంతరం భూసేకరణకు



ముడ అధికారులతో రివ్యూ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర...(ఫైల్‌ఫొటో)

రూ.750 కోట్లు కేటాయించబోతున్నామని, మార్చి, 2018 నాటికి నిర్మాణ పనులు మొదలౌతాయని మంత్రి కొల్లు రవీంద్ర ఆరు నెలలుగా చేస్తున్న ప్రకటనల్లో వాస్తవం లేదని అర్థమైంది.

2018-19 వార్షిక బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవటం దీనికి ఊతమిస్తోంది. దుగ్గరాజపట్నం పోర్టుకు కేంద్రమే ప్రత్యామ్నాయం చూపించాలంటున్న చంద్రబాబు బందరు పోర్టు నిర్మాణాంశంలో చోటుచేసుకుంటున్న జాప్యానికి సమాధానం చెప్పాలని వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. నిన్నటి వరకు మిత్రపక్షంగా ఉన్న బిజెపి 33 వేల ఎకరాలు ఎందుకంటూ నేడు టిడిపి సర్కార్‌ను నిలదీస్తోంది.

ఉత్తరప్రదేశ్‌లో బిఎస్‌ఎఫ్ జవాన్ అనుమానాస్పద మృతి

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని బరైచ్ ప్రాంతంలో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్) జవాన్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఆయనను మిహిపూర్వా గ్రామానికి చెందిన నారాయణన్‌గా గుర్తించారు. ఆయన జమ్ములో జవాన్‌గా పనిచేస్తున్నారని, సెలవులపై ఇంటికి వచ్చారని పోలీసులు తెలిపారు. నారాయణన్ నివాసానికి 500 మీటర్ల దూరంలో అనుమానాస్పందగా మృతి చెందగా, అటుగా వెళ్ళిన ఓ వ్యక్తి చూసి కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేశాడు. మరణానికి గల కారణాలు తెలియరాలేదు.



సమావేశం చెన్నైలో జరుగుతున్న డిఎంకె సమావేశంలో పార్టీ అధ్యక్షుడు కరుణానిధి, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంకె స్టాలిన్

కావేరి మేనేజ్‌మెంట్ బోర్డును తక్షణమే ఏర్పాటు చేయాలి

డిఎంకె డిమాండ్

చెన్నై : కేంద్ర ప్రభుత్వం తక్షణమే కావేరి మేనేజ్‌మెంట్ బోర్డు (సిఎంబి)ని ఏర్పాటుచేయాలని డిఎంకె ఆదివారం డిమాండ్‌చేసింది. సిఎంబి స్థానంలో మరేదైన పానెల్‌ను ఏర్పాటు చేయడం అనుమతించబోమని తెలిపింది. ఇక్కడ జరిగిన రెండు రోజుల డిఎంకె సదస్సులో ఈ మేరకు ప్రత్యేక తీర్మానం చేసింది. అంతరాష్ట్ర వివాదాల నేపథ్యంలో రాష్ట్ర హక్కులు దెబ్బతినకుండా చూడాలని తమిళనాడు ప్రభుత్వాన్ని డిఎంకె అభ్యర్థించింది. ఈ విషయంలో అధికార ఎఐఎడిఎంకె విఫలమైతే ఆందోళనలకు దిగుతామని హెచ్చరించింది. డిఎంకె వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంకె స్టాలిన్ ఈ తీర్మానాన్ని సదస్సులో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సిఎంబి స్థానంలో కేంద్ర ప్రభుత్వం ఒక సూపర్‌వైజరి కమిటీని ఏర్పాటు చేసే అవకాశముందని ఒక వర్గం మీడియాలో వచ్చిన వార్తలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. అటువంటి చర్యను వ్యతిరేకిస్తూ తీర్మానించారు. సిఎంబి ఏర్పాటు విషయంలో రాజీపడొద్దని, దాని స్థానంలో మరే ఇతర పానెల్ ఏర్పాటును అంగీకరించొద్దని, సాధ్యమైనంత త్వరలో సిఎంబిని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం" అని డిఎంకె తీర్మానం పేర్కొంది.

కేబినెట్ ఆమోదానికి వాహనాల తొలగింపు ప్రతిపాదనలు

కేంద్ర మంత్రి గడ్కరీ

న్యూఢిల్లీ : ఇరవై ఏళ్ళ పైబడిన వాణిజ్య వాహనాలను వినియోగం నుంచి తొలగించడాన్ని తప్పనిసరి చేస్తూ రూపొందించిన ప్రతిపాదనలు మరో నెల రోజుల్లో కేబినెట్ ఆమోదం కోసం వెళ్తాయని కేంద్ర రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరి తెలిపారు. ఆ ప్రతిపాదనలు అమలులోకివస్తే ప్రభుత్వ ఖజానాలకు అదనంగా రూ. 10 వేల కోట్లు సమకూరుతాయని చెప్పారు. ఎంతోకాలంగా వేచి ఉన్న ఈ పాలసీకి ప్రధాన మంత్రి కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి అంతర్ మంత్రిత్వ శాఖల సమావేశంలో సూత్ర ప్రాయంగా ఆమోదం లభించింది. ఈ ప్రతిపాదనలు ఆమోదం పొందితే ఏప్రిల్ 1, 2020 నుండి 20 సంవత్సరాలు పైబడిన వాణిజ్య వాహనాలను వినయోగం నుంచి తొలగించేందుకు మార్గం సుగమం అవుతుంది.

అంబానీ కుమారుడు ఆకాశ్‌కు గోవాలో నిశ్చితార్థం?

ముంబయి : బిలియనియర్ ముఖేష్ అంబాని కుమారుడు ఆకాశ్ అంబానీ త్వరలో ఓ ఇంటి వాడు కానున్నాడు. ప్రముఖ డైమండ్ వ్యాపారి రస్సెల్ మెహతా కుమార్తె శ్లోకా మెహతా ఆకాశ్ వివాహం చేసుకోనున్నాడు. గోవాలో శనివారం నిశ్చితార్థ కార్యక్రమం జరిగినట్లు స్థానిక మీడియాలో వార్తలు వెలవడ్డాయి. నిశ్చితార్థానికి సంబంధించిన ఫొటోలు అభిమానుల ఫేస్‌బుక్ పేజీలలోనూ, సోషల్ మీడియాలోనూ దర్శనమిచ్చాయి. వీరి వివాహం త్వరలోనే జరగనున్నదని వార్తలు పేర్కొన్నాయి. అయితే దీనికి సంబంధించి కుటుంబ సభ్యుల నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

జమ్ము, కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

ఉగ్రవాది హతం, తుపాకులు స్వాధీనం

శ్రీనగర్: మధ్య కాశ్మీర్‌లోని బుడ్గమ్ జిల్లాలో భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో గుర్తు తెలియని ఉగ్రవాది చనిపోయాడు. ఓ మహిళ కూడా గాయపడినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. బీర్‌వా ప్రాంతంలోని అరిజాల్‌లోని ఖాన్ మొహల్లాలో ఉగ్రవాదులు ఉన్నారన్న పక్కా సమాచారంతో భద్రతా దళాలు అక్కడ తనిఖీలు నిర్వహించారని పోలీసు అధికారులు చెప్పారు. దీంతో పారిపోవడానికి ప్రయత్నించిన ఉగ్రవాదులు ఇంట్లోకి బయటకు వచ్చి భద్రతా దళాలపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. బలగాలు ప్రతిఘటించడంతో ఒక ఉగ్రవాది మృతి చెందాడు. సంఘటనా స్థలం నుంచి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే మృతి చెందిన ఉగ్రవాది వివరాలు, అతనికి సంబంధించిన గ్రూపు ఏది అనేది తెలియరాలేదు. గాయపడిన మహిళను ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమె పరిస్థితి స్థిరంగా ఉందని అధికారులు తెలిపారు.

బాయ్ ఫ్రెండ్స్ వల్లే దాడులు

బిజెపి ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

భోపాల్ : యువకులతో ఫ్రెండ్‌షిప్ మానేస్తే యువతులపై దాడులు తగ్గుతాయని బిజెపి ఎంఎల్ఎ నోరుపారేసుకున్న ఘటన మధ్యప్రదేశ్‌లో జరిగింది. ఇందువలన యువతులపై దాడులు జరిగే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని మధ్య ప్రదేశ్‌కు చెందిన బిజెపి ఎమ్మెల్యే పన్నాలాల్ శాక్య యువతు లను హెచ్చరించాడు. ఇక్కడ పిజి కాలేజిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువతులకు బాయ్ ఫ్రెండ్స్ వద్దని, బాయ్ ఫ్రెండ్స్ లేకపోవడం వల్ల వారిపై దాడులు జరిగే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని అన్నారు. ఇదే సమయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడాన్ని కూడా ఆయన తప్పు పట్టారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం పాశ్చాత్యుల భావన అనిపాశ్చాత్య సంస్కృతి వైపు వెళ్ళొద్దని, భారతీయ సంస్కృతిని అనుసరించేందుకు ప్రయత్నించాలని విద్యార్థులకు సూచించారు. నవరాత్రుల సందర్భంగా మహిళలను పూజిస్తామని, ప్రత్యేకించి మహిళా దినోత్సవం అవసరం లేదని అన్నారు. ఆ తరువాత మీడియాతో మాట్లాడుతూ తన వ్యాఖ్యలను ఆయన సమర్థించుకున్నారు. శాక్య గత ఏడాది కూడా విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ పెళ్ళి విషయంలో కూడా ఇటువంటి వ్యాఖ్యలు చేశారు. స్వదేశాభిమానం లేకపోవడం వల్లే వారు ఇటలీలో పెళ్లి చేసుకున్నారని వ్యాఖ్యానించి వివాదానికి గురయ్యారు.

యుపిలో 24 గంటల్లో 6 ఎన్‌కౌంటర్లు

ఇద్దరు దుండగలు కాల్చివేత

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో గడిచిన 24 గంటల్లో 6 ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్లలో ఉత్తరప్రదేశ్ పోలీసులు ఇద్దరు దుండగులను హతమార్చారు. దీంతో గత ఏడాది మార్చి 20 నుంచి చూస్తే ఇప్పటి వరకు రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్లలో మృతి చెందిన నేరస్తుల సంఖ్య 45కు చేరుకుంది. ఈ ఏడాది 12 మంది మృతి చెందారు. నేరస్తులకు కేంద్రంగా ఉన్న గజియాబాద్‌లో గడిచిన 24 గంటల్లో 182 మంది నేరస్తులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాష్ట్రంలోని నొయిడా, ఘజియాబాద్, సహరన్‌పూర్, ముజఫర్‌నగర్‌లో నేరస్తులను పట్టుకునేందుకు శనివారం రాత్రి నుండి ఉత్తరప్రదేశ్ పోలీసులు ప్రత్యేక గాలింపు కార్యక్రమాన్ని చేపట్టారు.

టాయిలెట్ల కోసం బాలిక నిరసన.. దిగొచ్చిన మోడీ సర్కార్

స్వచ్ఛ భారత్ కింద 550 మరుగుదొడ్ల నిర్మాణం

జమ్మూ : బహిరంగ మల విసర్జనతో మహిళలు ఎదుర్కొంటున్న ఆత్మగౌరవ సమస్యను 14ఏండ్ల బాలిక లేవనెత్తింది. పిన్న వయస్సులోనే పోరాటపటిమను అలవర్చుకుని మరుగుదొడ్ల నిర్మాణం కోసం నిరాహార దీక్షకు దిగింది. అంతేకాదు ఆమెతోపాటు మరో 35మంది సహవిద్యార్థులు నిరసనకు దిగేలా చేసింది. దాంతో ఆ గ్రామంలో దాదాపు 550 మరుగుదొడ్ల నిర్మాణాలు మొదలయ్యాయి. ఎవరిపనుల్లో వారుంటే పదో తరగతి చదువుతున్న నిశా మాత్రం తన చుట్టూ ఉన్న సమాజం గురించి ముందడుగేసి అందరినీ ఆలోచింపజేసింది. తన కుటుంబీకులు, సంబంధిత ప్రభుత్వాధికారులనూ కదిలించింది. జమ్మూ కాశ్మీర్‌లోని ఉదంపూర్ జిల్లాలోని కుడ్‌బస్తీ గ్రామానికి చెందిన నిశా పదో తరగతి చదువుతోంది. బహిరంగ విసర్జన వల్ల సమస్యలు, మరుగుదొడ్లతో కలిగే సౌకర్యాన్ని పాఠశాలలో తెలుసుకుంది. 'ఇవి తెలుసుకున్నప్పుడు చాలా సంతోషించాను కానీ మా ఇంట్లో మరుగుదొడ్డి లేకపోయేసరికి చాలా నిరాశపడ్డాను'అని నిశా చెబుతోంది. మరుగుదొడ్డి నిర్మించాలని ఈ నెల 14న నిశా నిరాహార దీక్ష మొదలుపెట్టింది. దాదాపు రెండు రోజులపాటు ఆమె నిరసన కొనసాగింది. దీంతో ఆమె కుటుంబీకులతో పాటు సంబంధిత అధికారులూ దిగొచ్చారు. నిశా ఇంటి ఆవరణలో టాయిలెట్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అయితే ఈ కాలంలో ఆమెతోపాటు ఆమె సహవిద్యార్థులు 35మంది కూడా కలిసి నిరసన చేపట్టారు. దీంతో ఆ గ్రామపంచాయతీలో పెనుమార్పే సంభవించింది. నిశా నిరసన చేపట్టిన వారం రోజుల తర్వాత ఆ గ్రామంలో సుమారు 550 మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఇందులో నిరసన చేసిన 35మంది విద్యార్థుల ఇంటి ఆవరణల్లో ప్రారంభమైనవీ ఉన్నాయి. నిశా ఇంటి ఆవరణలో స్వచ్ఛ భారత్ కింద టాయిలెట్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది.

బెంగాల్‌లో మతోన్మాద చిచ్చుకు

కాషాయ మూక యత్నాలు

వామపక్షాల నిరసన ర్యాలీలు



ప్రజాశక్తి ప్రతినిధి, కోల్‌కతా :

బెంగాల్ ప్రజల మధ్య మతోన్మాద చిచ్చు పెట్టేందుకు ఆరెస్సెస్, బిజెపి శక్తులు అధికార పార్టీ అండతో చేస్తున్న ప్రయత్నాలను నిరసిస్తూ లక్షలాది మంది వామపక్ష కార్యకర్తలు ఎర్రజెండాలతో రాష్ట్ర వ్యాప్తంగా భారీయెత్తున నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఏటా శ్రీరామనవమికి ముందు ఆరెస్సెస్ బిజెపి శక్తులు ఇటువంటి కుట్రలు పన్నుతూనే వున్నప్పటికీ ఈ ఏడాది వాటికి అధికార పార్టీ అండ లభిస్తుండటంతో మరింత చెలరేగిపోతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలోని హిందీ-నాన్ హిందీ ప్రజల మధ్య చిచ్చు పెట్టే ప్రమాద సంకేతాలు వెలువడుతుండటంతో వామపక్షాల పిలుపు మేరకు లెఫ్ట్ కార్యకర్తలు ఈ యత్నాలను భగ్నం చేసేందుకు నడుం బిగించారు. రాష్ట్ర ప్రజలు శాంతి, సామరస్యాలను కోరుకుంటున్నారని, వాటిని భగ్నం చేసేందుకు ఎవరు ఎటువంటి ప్రయత్నాలు చేసినా వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వుంటుందని లెఫ్ట్ కార్యకర్తలు కుట్రదారులను గట్టిగా హెచ్చరించారు. గత ఏడాది మత ఘర్షణలు జరిగిన బీర్భమ్ జిల్లా రాంపూర్‌హట్ ప్రాంతంలో లెఫ్ట్ ఫ్రంట్ ఛైర్మన్ బిమన్ బసు నేతృత్వంలో 'మహామిచిల్' పేరిట నిర్వహించిన శాంతి ర్యాలీలో వేలాది మంది కార్యకర్తలు అరుణపతాకాలతో పాల్గొన్నారు. అదే విధంగా దుర్గాపూర్‌లోని ఉక్కు కర్మాగారం ఉద్యోగులు, అసన్‌సోల్, జల్పాయ్‌గురి, మైనాగురి, మాల్డా టౌన్, భుజ్ భుజ్ తదితర ప్రాంతాలలో కూడా భారీయెత్తున ర్యాలీలు నిర్వహించారు. గత నాలుగేళ్లుగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్న సందర్భాలలో ఆరెస్సెస్, బిజెపికి చెందిన కాషాయ మూకలు మతోన్మాదాన్ని, మత విద్వేషాన్ని రెచ్చగొడుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది తరహాలోనే ఈ ఏడాది కూడా మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు కాషాయ మూకలు చేస్తున్న ప్రయత్నాలను పసిగట్టిన వామపక్ష వాదులు వాటిని గట్టిగా తిప్పికొట్టేందుకు సిద్ధమయ్యారు. వీరి ప్రయత్నాలకు అధికార తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ కార్యకర్తలు తోడవుతుండటం గమనార్హం. రాంపూర్‌హట్ ర్యాలీలో లెఫ్ట్ ఫ్రంట్ ఛైర్మన్ బిమన్ బసు మాట్లాడుతూ కాషాయ మూకల ప్రయత్నాలపై అధికార యంత్రాంగం తగు విధంగా స్పందించకపోతే, లెఫ్ట్ కార్యకర్తలు కార్యాచరణకు దిగుతారని హెచ్చరించారు. రాష్ట్రంలో మత చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వుంటుందని ఆయన ఆరెస్సెస్ శక్తులను హెచ్చరించారు.

నెటిజన్లకు జుకర్‌బర్గ్ క్షమాపణలు...

లండన్: ప్రముఖ సోషల్‌మీడియా ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ బ్రిటన్ నెటిజన్లకు బహిరంగ క్షమాపణలు తెలిపారు. బ్రిటన్ మీడియా సంస్థలు ఈ ప్రకటనను ప్రచురించాయి. కోట్లాది మంది ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం దుర్వినియోగ మైందంటూ ఫేస్‌బుక్‌పై గత కొన్ని రోజులుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. దీనిపై జుకర్‌బర్గ్ స్పందించారు. 'మీ సమాచారాన్ని భద్రంగా ఉంచాల్సిన బాధ్యత మాపై ఉంది. అలా చేయలేకపోతే.. మాకు అర్హత లేనట్టే. ఇకపై అప్రమత్తంగా ఉంటాం. నాణ్యమైన సేవలందిస్తాం' అని ఉన్న ప్రకటన కింద జుకర్‌బర్గ్ సంతకం ఉంది. రెండు రోజుల క్రితం జుకర్‌బర్గ్ మీడియా ద్వారా క్షమాపణలు చెప్పారు.

రాజస్థాన్ వ్యాక్స్ మ్యూజియంలోకి రోబో...!

జైపూర్ : రాజస్థాన్‌లోని ఆరావళి కొండలలో నహర్‌ఘర్ కోటలో ప్రసిద్ధ జైపూర్ మైనపు మ్యూజియానికి వచ్చిన సందర్శకులను ఆహ్వానించటానికి ఒక రోబోట్‌ను ప్రవేశపెట్టనున్నారు. త్వరలోనే రోబోట్ వస్తుందని, దానికి మ్యూజియం గురించి విషయాలను తెలియపరుస్తామని, సందర్శకులను స్వాగతించడానికి, శిక్షణను ఇచ్చి మార్గ దర్శిగా ఏర్పాటు చేయనున్నట్లు మ్యూజియం వ్యవస్థా పకుడు అనూప్ శ్రీవాస్తవ తెలిపారు. ఐదడుగుల పది అంగుళాల పొడవైన ఈ రోబోట్‌ను ఒక సంవత్సరం పాటు 'రోబోటిక్ గైడ్'గా పనిచేయిస్తామని, రోబోట్‌కు ఇంగ్లీష్ బాషతో కమ్యూనికేట్ చేస్తామని, అయితే హిందీ భాషని కూడా చేర్చేందుకు సాఫ్ట్‌వేర్‌ను తాము అప్‌డెట్ చేస్తామని శ్రీవాస్తవ తెలిపారు.

భారత దేశపు తొలి పాసింజర్ ప్లేన్ 'సరస్'

- 19 సీట్ల టర్బో ప్రాప్ విమానం
- నిర్మాణ సమయం 18 ఏళ్ళు
- ఈ ఏడాది నిర్వహించిన పరీక్షలు విజయవంతం
- భారత్‌ను అనుసరిస్తున్న రష్యా, చైనా, అమెరికా, ఇండోనేషియా, పోలండ్



బెంగళూరు : భారత దేశపు తొలి పాసింజర్ విమానం. 'సరస్'ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసి ప్రయాణానికి సిద్ధం చేశారు. ఇది దేశంలో రూపొందించిన తొలి పాసింజర్ ట్రాన్స్‌పోర్ట్ విమానం. ఇది 19 సీట్లతో రూపొందిన టర్బో ప్రాప్ విమానం. బెంగళూరులోని నేషనల్ ఏరో స్పేస్ లేబరేటరిస్ (ఎన్ఎఎల్) దీనిని డిజైన్ చేసింది. వైమానిక దళానికి చెందిన పైలెట్లుఉ దీనిని పరీక్షించారు. దాదాపు 18 ఏళ్ళుగా దీని నిర్మాణం కొనసాగింది. అందులో భాగంగా 2009లో ఒకసారి పరీక్షించినప్పుడు కుప్పకూలి ఇద్దరు పైలెట్ల ప్రాణాలను బలిగొంది. కూలిపో వడానికి గల కారణాన్ని పరిశీలించినప్పుడు విధానపరమైన పొరపాటుగా తేలిందని ఎన్ఎఎల్ డైరెక్టర్ జితేంద్ర జె. జాదవ్ మీడియాకు తెలిపారు. విధానపరమైన పొరపాటుతో పాటు డిజైన్‌లో పలు లోపాలు కూడా వెలుగు చూశాయని, వాటిని తమ బృందం సాధ్యమైనంత వేగంగా సరిచేసింద న్నారు. ప్రధానంగా నిర్వహణ నాణ్యత, నియంత్రణలకు సంబంధించిన లోపాలను సరిచేశామని చెప్పారు. ఈ ప్రాజెక్టు తిరిగి 2016లో ప్రారంభమైంద న్నారు. దాదాపు 7 వేల కిలోల బరువున్న ఈ విమానం ఈ ఏడాది ఇప్పటికే రెండు సార్లు విజయవంతంగా పరీక్షించామని తెలిపారు.

ఉడ్డాన్ పథకం కింద ప్రయాణాల అనుసంధానానికి సరస్ ఎంకె 2 ఆదర్శంగా ఉంటుందని కేంద్ర సైన్స్ మంత్రి హర్షవర్ధన్ తెలిపారు. ఎయిర్ టాక్సి, ఏరియల్ సెర్చ్, సర్వే, ఎగ్జిక్యూటివ్ ట్రాన్స్‌పోర్ట్, విపత్తు నిర్వహణ, సరిహద్దు గస్తీ, కోస్ట్‌గార్డ్, అంబులెన్స్ తదితర ప్రయాణ సేవలు దీని నుంచి పొందవచ్చునని ఆయన చెప్పారు. సరస్ మిలటరి వెర్షన్‌కు హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) ఉత్పత్తి ఏజెన్సీగా ఉంది. దీని సివిల్ వెర్షన్‌ఉత్పత్తిని ప్రైవేటు కంపెనీకి ఇవ్వనున్నట్లు నేషనల్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తెలిపింది. రానున్న పదేళ్ళలో రెండు వెర్షన్‌లలోనూ దాదాపు 120 నుంచి 160 వరకు విమానాల అవసరం భారత్‌కు ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో సరస్‌విమానం 1970 నాటి మోడల్ అందుబాటులో ఉందని తెలిపింది.

భారత్ తన తేలికపాటి రవాణా ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టును ప్రారంభించిన తరువాత రష్యా, చైనా, అమెరికా, ఇండోనేషియా, పోలండ్‌లు తదుపరి జనరేషన్‌కు అవసరమై 19 సీట్ల ఎయిర్ క్రాఫ్ట్‌ను అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని ప్రారంభించాయి.

కలిసొచ్చే పార్టీలతో పొత్తు

ఎన్‌సిపి అధినేత శరద్ పవార్

థానే : రానున్న లోక్ సభ ఎన్నికలు, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కలిసొచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకుంటామని ఎన్‌సిపి అధినేత శరద్ పవార్ చెప్పారు. రానున్న రాష్ట్ర, లోక్ సభ ఎన్నికల్లో కలిసొచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకుంటామని శరద్ పవార్ తెలిపారు. కేంద్రంలో ఎన్డీయేతర కూటమి అధికారంలోకి వస్తే ప్రధానమంత్రి ఎవరు అవుతారనే అంశంపై తనకు, రాహుల్ గాంధీకి మధ్య ఎటువంటి చర్చ జరగలేదని చెప్పారు. అభివృద్ధి ప్రాజెక్టుల పేరు మీద రైతులు భూములను కోల్పోతున్నారని, అయితే తమ పార్టీ అభివృద్ధికి వ్యతిరేకం కాదని, కానీ అది వ్యవసాయ భూములను, స్థానిక ఉద్యోగాలను ఫణంగాపెట్టి మాత్రం జరగకూడదని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

చండీగర్ : హర్యానాలో ఆదివారం ఓ ట్రక్ కారును గుద్దడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. మృతి చెందిన వారిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. వారంతా ఢిల్లీ నుండి ఇంటికి తిరిగి వస్తుండగా ఇక్కడ దగ్గరలోని చక్కెర మిల్లులు వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు.

మూడోవంతు కంపెనీల మూసివేత..!

ఒక్క ఏడాదిలోనే మూతపడిన 2,38,000 కంపెనీలు..!!

న్యూఢిల్లీ : ఈ ఏడాది(2018) జనవరి 31 వరకల్లా మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (ఎంసీఏ) వద్ద 17,29,363 కంపెనీలు రిజిస్టర్ కాగా, వాటిలో మూడోవంతు మూసివేతకు గుర య్యాయి. ఎంసీఏ డేటా ప్రకారం మూసివేతకు గురైన కంపెనీల సంఖ్య 5,38,340 (32 శాతం). కాగా, వీటిలో 2,38,000 కంపెనీలు (15 శాతం) గతేడాది(2017)లో మూసివేతకు గురయ్యాయి. 2017, జనవరి 31కల్లా మూని వేసిన కంపెనీల సంఖ్య 3,00,000.. మూసివేతకు గురైనవాటిలో ఎక్కువభాగం కంపెనీల చట్టం-2013లోని సెక్షన్ 248 కిందనేనన్నది గమనార్హం. ఈ చట్టం ప్రకారం మూడు కారణాలతో కంపెనీలను మూసివేసే అధికారం రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్(ఆర్‌వోసీ)కి ఉన్నది. కంపెనీని రిజిస్టర్ చేసిన ఏడాదిలోగా కార్యకలాపాలు ప్రారంభించకపోయినపుడు, తగినంత మూలధనం లేనపుడు, వరుసగా రెండు ఆర్థిక సంవత్సరాలు ఎలాంటి కార్యకలా పాలు నిర్వహించనపుడు మూసివేసే అధికారం ఆర్‌వోసీకి ఉంటుంది. మూసివేతకు గురవుతు న్నవాటిలో మొండి బకాయి కంపెనీలు అధికమని, ఆ తర్వాతి స్థానంలో డొల్ల(బినామీ) కంపెనీలుంటాయని వ్యాపార నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది జనవరి 31కల్లా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న మొత్తం కంపెనీలు 11,51, 153.. కాగా, కార్యాచరణలో ఉన్న వాటిలో మొదటి స్థానంలో వ్యాపార సర్వీసుల విభాగానికి చెందిన కంపెనీలున్నాయి. వాటి సంఖ్య 3,46,498 కాగా, రెండోస్థానంలో తయారీ రంగ కంపెనీలు (2,32,059), మూడో స్థానంలో వాణిజ్య కంపెనీలు(1,51,843), నాలుగో స్థానంలో నిర్మాణరంగ కంపెనీలు(1,04,359) ఉన్నాయి.

ఆర్థికసంస్కరణలకు ఐక్య ప్రతిఘటన





సిఐటియు జనరల్ కౌన్సిల సమావేశంలో మాట్లాడుతున్న పిఎల్ అజయ్‌కుమార్, అయోధ్యరాం

కోజికోడ్ : దేశ ఆర్థికరంగాన్ని అతలాకుతలం చేసి, అసమానతలు పెంచుతున్న సరళీకరణ ఆర్థిక విధానాలను ఐక్యంగా ప్రతిఘటించాలని పలువురు సిఐటియు నేతలు అన్నారు. స్థానిక మహ్మద్ అమిన్ నగరల్ జరుగుతున్న సిఐటియు జనరల్ కౌన్సిల్‌లో భాగంగా శనివారం సరళీకరణ ఆర్థిక విధానాలు, కార్మికరంగంపై చూపతున్న ప్రభావం, ఉద్యమాన్ని బలోపేతం చేయడంపై పలువురు వక్తలు మాట్లాడారు. 26 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను నరేంద్రమోడీ నేతృత్వంలోని ప్రస్తుత బిజెపి ప్రభుత్వం మరింత వేగంగా ముందుకు తీసుకుపోతున్నాయని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ నుండి చర్చల్లో పాల్గొన్న జె. అయోధ్యరాం. పిఎల్ అజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి జరుగుతున్న ప్రయత్నాల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తమ అనుకూల కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చడానికే ఈ తరహా చర్యలకు పాల్పడుతోం దని అన్నారు. ఒక పథకం ప్రకారం ప్రభుత్వ రంగ సంస్థలను నష్టాల్లోకి నెట్టి, దానిని సాకుగా చూపి ప్రైవేటీకరించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, వీటిని కార్మిక వర్గం సమైక్యగా ప్రతిఘటించాలని కోరారు. విశాఖ ఉక్కు, డిసిఐల ప్రైవేటీకరణకు జరుగుతున్న యత్నాలను, వాటికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలను వివరించారు.

'ఐటి సమస్యలు పరిష్కరించండి : తీర్మానంలో డిమాండ్

ఐటి, ఐటి ఆధారిత సేవల ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు జనరల్ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు ఐటిరంగంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో అనేక సంస్థలు ఉద్యోగులను తొలగిస్తున్నాయని, పని పరిస్థితులు అధ్వానంగా మారాయని, ఐటి ఆధారిత రంగంలో కనీస వేతనాలు కూడా ఇవ్వడం లేదని జనరల్ కౌన్సిల్ పేర్కొంది. ఈ నేపథ్యంలో ఐటి రంగంలో ఉద్యోగభద్రతకు, పని పరిస్థితుల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. యాజమాన్యాలను ప్రోత్సహించే పేరుతో ఐటి రంగంలో కార్మికచట్టాలను బలహీన పరుస్తూ తీసుకున్న చర్యలను ఉపసంహరించాలని కోరింది. ఐటి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి జాతీయ, రాష్ట్ర స్థాయిలో త్రైపాక్షిక కమిటీలను ఏర్పాటు చేయాలని కోరింది. ఐటి ఆధారిత సేవల రంగంలో వేరియబుల్ డిఎతో కలిపి 30వేల రూపాయలను, కనీస వేతనంగా చెల్లించాలని సిఐటియు జనరల్ కౌన్సిల్ డిమాండ్ చేసింది.

సిఐటియు జనరల్ కౌన్సిల్‌లో వక్తలు

రోహింగ్యాలకు సంఘీభావం

రోహింగ్యా శరణార్థులకు సిఐటియు జనరల్ కౌన్సిల్ సంఘీభావం తెలిపింది. రోహింగ్యాలపై జరుగుతున్న రాజ్య హింసను అన్ని వర్గాల ప్రజలు ఖండించాలని పిలుపునిచ్చింది. మయన్మార్ ప్రభుత్వం ఇప్పటికీ రోహింగ్యాలకు రక్షణ కల్పించడంలో విఫలమవుతున్న తీరు పట్ల ఆందోళన వ్యక్తం చేసింది.

పథకం ప్రకారం

జెఎన్‌యుపై దాడి

రొమిల్లా థాపర్ ఆవేదన

న్యూఢిల్లీ : ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయాన్ని (జెఎన్‌యు) ఒక పథకం ప్రకారం నాశనం చేస్తున్నారని ప్రముఖ చరిత్రకారిణి రొమిల్లా థాపర్ ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శనాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించాలనే ఉద్దేశ్యంతో జెఎన్‌యును స్థాపించగా...ఇప్పుడు ఆ ఉద్దేశ్యాన్నే చెరిపివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఊహాజనితమైన అంశాలను జొప్పించే ప్రమాదాన్ని ప్రస్తుతం చరిత్ర ఎదుర్కొంటోందని అన్నారు. జెఎన్‌యును స్థాపించినప్పుడు చేరిన మొదటి అధ్యాపకుల్లో ఒకరైన థాపర్ మొదటి వైఎస్ ఛాన్సలర్ గోపాలస్వామి పార్థసారధితో పాటు ఇతర విద్యావేత్తలు ఈ వర్శిటీని ఎంతో జాగ్రత్తతో నిర్మించారని చెప్పారు. జెఎన్‌యుతో పాటు ఇతర వర్శిటీల్లో హేతుబద్దంగా ఆలోచించే అధ్యాపకులపై దాడులు చేస్తూ విమర్శనాత్మక ఆలోచాలను తొక్కిపట్టేలా, అసమ్మతి గొంతు నొక్కేసేలా కేంద్ర పభుత్వ చర్యలు కొనసాగుతున్నా యంటూ వస్తున్న విమర్శల నేపథ్యంలో థాపర్ పై వ్యాఖ్యలు చేశారు.

జేఎన్‌యూ విద్యార్థుల పై కేసు నమోదు

పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొన్న జేఎన్‌యూ విద్యార్థుల పై ఎఫ్ఐఆర్ నమోదైంది. డిమాండ్లు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేస్తూ జేఎన్‌యూ విద్యార్థులు, ఉపాధ్యాయులు పార్లమెంట్ మార్చ్‌ను శుక్రవారం చేపట్టారు. దీంతో, విద్యార్థుల పై ఢిల్లీ పోలీసులు సరోజినీ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌ను శనివారం నమోదు చేశారు. పోలీసు అధికారి సహాయంతో దర్యాప్తును కొనసాగిస్తున్నారు. పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థుల పై వాటర్ కెనాన్‌లను పోలీసులు ప్రయోగించారు. లాఠీ ఛార్జ్ చేశారు. అంతటితో ఆగకుండా ఇద్దరు మహిళా జర్నలిస్టులను బెదిరిస్తూ భౌతిక దాడులకు దిగారు. చివరకు జర్నలిస్టుల ధర్నాతో పోలీసులు దిగి వచ్చి క్షమాపణలు కోరారు. కాగా, మహిళా జర్నలిస్టు పై అసభ్యంగా ప్రవర్తించిన పోలీసు అధికారి పై ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు కాకపోవడం గమనార్హం.

ద.చైనా సముద్రంపై చైనా వైమానిక న్యాసాలు

బీజింగ్ : ద.చైనా సముద్రం, పశ్చిమ పసిఫిక్ సముద్ర ప్రాంతాలపై చైనా వాయుసేనకు చెందిన యుద్ధ విమానాలు విన్యాసాలు ప్రారంభించాయి. చైనా వాయు సేనకు చెందిన హెచ్-6 బాంబర్లు, ఎస్-30, ఎస్‌యు-35 తరహా యుద్ధ విమానాలు ఈ విన్యాసాలలో పాల్గొంటున్నాయి. 'నావికా స్వేచ్ఛ' పేరిట అమెరికా నౌకాదళం ఈ ప్రాంతంలో నౌకా విన్యాసాలను చేసిన కొద్ది రోజులకే చైనా ఈ విన్యాసాలు ప్రారంభించటం విశేషం.



ప్రదర్శన
వలసవచ్చిని వారిని ప్రభుత్వం బహిష్కరించ నుందన్న వార్తలు రావటంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా టెల్‌అవీవ్‌లో ప్రదర్శన జరుపుతున్న ఇజ్రాయిల్ ప్రజలు

వలసదారులపై ఇజ్రాయిల్ దాష్టీకం

బహిష్కరణపై వెల్లువెత్తిన ఆగ్రహం

జెరూసలేం : చట్టవిరుద్ధంగా దేశంలోకి ప్రవేశించిన ఎరిత్రియన్లు, సూడానీలను సామూహికంగా బహిష్కరించేందుకు ఇజ్రాయిల్ ప్రయత్నిస్తోందన్న వార్తలపై వేలాది మంది ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్త ంచేశారు. ఇజ్రాయిల్ ప్రయత్నాలను నిరసిస్తూ శనివారం నాడు సెంట్రల్ టెల్ అవీవ్‌లో వేలాది మంది ప్రజలు భారీయెత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. వలసదారులు, ఇజ్రాయిలీలతో కలిపి మొత్తం 20 వేల మందికి పైగా ప్రజలు ఈ ర్యాలీలో పాల్గొన్నారని ఇజ్రాయిలీ మీడియా తన వార్తా కథనాలలో వెల్లడించింది. ఈ ర్యాలీ దృశ్యాలను వైనెట్ న్యూస్ వెబ్‌సైట్ ప్రసారం చేసింది. 'మమ్మల్ని కూడా మనుషులుగా గుర్తించండి' అంటూ వారు పెద్దపెట్టున నినాదాలు చేస్తున్న దృశ్యాలను ఈ వెబ్‌సైట్ ప్రసారం చేసింది. 'మీకూ, మాకూ ఒకే రంగు నెత్తురుందని, మమ్మల్ని వివక్షతో చూడవద్దని' ఆందోళనకారులు నినదించారు. వలసదారులను తిప్పి పంపాలన్న ఇజ్రాయిల్ ప్రభుత్వ ఆదేశాలను ఆ దేశ సుప్రీంకోర్టు ఇటీవల సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం దీనిపై ప్రభుత్వ స్పందనను కోరింది. దీనిపై మరింత సమాచారాన్ని ఈ నెల 26లోగా తమకు సమర్పించాలని కోర్టు ఆదేశించింది.

పెరూ మాజీ అధ్యక్షుడి ఇళ్లపై అధికారుల దాడి

లిమా (పెరూ) : పెరూ మాజీ అధ్యక్షుడు పెడ్రో పాబ్లో కుజ్జిన్‌స్కీపై వచ్చిన మనీలాండరింగ్ ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న అధికారులు ఆయనకు చెందిన రెండు ఇళ్లపై దాడులు చేశారు. ఈ రెండు ఇళ్లూ లిమా నగరంలోనే వున్నాయని ప్రభుత్వం ఒక అధికార ప్రకటనలో పేర్కొంది. కుజ్జిన్స్కీ రాజీనామాను పార్లమెంట్ ఆమోదించిన మరుసటి రోజే అధికారులు ఈ దాడులుచేయటం గమనార్హం. అధికారులు ఆయన బాక్స్‌లతో ఇళ్లలోకి ప్రవేశిస్తున్న దృశ్యాలను టీవీ ఛానళ్లు ప్రసారం చేశాయి. కాగా కుజ్జిన్‌స్కీ దేశం విడిచి వెళ్లవద్దంటూ ప్రాసిక్యూటర్ కార్యాలయం జారీ చేసిన ఆదేశాలను తాము అంగీకరిస్తున్నట్లు కుజ్జిన్‌స్కీ అనుచరులు చెప్పారు. ప్రభుత్వ వర్క్ కాంట్రాక్ట్‌లను ఇచ్చేందుకు బ్రెజిల్‌కు చెందిన నిర్మాణ సంస్థ ఓడబ్రెక్ట్ నుండి భారీగా ముడుపులు అందుకున్న ఆరోపణలపై కుక్‌జిన్‌స్కీపై కేసు నమోదయిన విషయం తెలిసిందే.

జోస్ ఆంటోనియో అబ్రూ కన్నుమూత

కారకస్ : తన సంగీతంతో వెనిజులాకు చెందిన వేలాది మంది పిల్లలను నేరాలు, పేదరికం నుండి బయటపడేసిన జోస్ ఆంటోనియో అబ్రూ శనివారం రాత్రి మృతి చెందారు. ఈయన 1939లో వరేలాలోని అండేనియన్ అనే చిన్న పట్టణంలో జన్మించారు.

1975లో తొమ్మిది మంది సంగీతకారులతో ఒక గ్యారేజ్‌లో ఇఐ సిస్టేమా అనే సంస్థను నెలకొల్పారు. ఈ సంస్థలోని మొత్తం 300 మంది గాయకులకు, ఆర్కెస్ట్రాలకు యునెస్కో, రాయల్ స్వీడిష్ అకాడమిని నుండి పలు అవార్డులు పొందారు. ఆయన ఆర్కెస్ట్రా నిర్వాహకుడు, పియానిస్ట్, ఆర్థిక వేత్త, అధ్యాపకుడు, రాజకీయ వేత్త.

షింజో అబే మరో వివాదం

టోక్యో : ఇటీవల వెలుగులోకి వచ్చిన రాజకీయ కుంభకోణంతో సతీ సమేతంగా పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిన జపాన్ ప్రధాని షింజో అబే, దీని నుండి బయటపడేందుకు రాజ్యాంగ సవరణ కోసం ప్రయత్నిస్తుండటం వివాదాస్పదంగా మారుతోంది. ప్రధాని అబే తన మద్దతుదారుల్లో ఒకరికి ప్రభుత్వ భూమిని కారుచౌకగా కట్టబెట్టారని, ఇందులో ఆయన భార్య అకీ కీలక పాత్ర పోషించారని ప్రతిపక్షం ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ భూ విక్రయాలకు సంబంధించి అధికారిక రికార్డులను తారుమారు చేశామని, ప్రధాని అబే, ఆయన భార్యతో పాటు మరికొంత మంది రాజకీయ నేతల పేర్లను ఇందులో నుండి తొలగించామని ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన అధికారులు అంగీకరించటంతో ఈ కుంభకోణం పరిధి మరింత విస్తరించింది. 'దీనిపై సమగ్రంగా దర్యాప్తు జరిపించి ఏం జరిగిందన్న విషయాన్ని ప్రజల ముందుం చుతానని ఆయన అధికార లిబరల్ డెమొక్రాటిక్ పార్టీ వార్షిక సమావేశంలో ప్రకటించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ వ్యవస్థను పునర్నిర్మించటం ద్వారా తాను తన



కర్తవ్యాన్ని నెరవేరుస్తానంటూ అధికారంలో కొనసాగాలన్న కృతనిశ్చ యాన్ని వెల్లడించారు. ఈ కేసులో తనకు, తన భార్యకు ప్రమేయం వుందన్న ఆరోపణలను ఆయన ఖండించినప్పటికీ, ఈ కుంభకోణంపై ప్రధానికి వ్యతిరేకంగా దేశవ్యా ప్తంగా నిరసన ప్రదర్శనలు మిన్నంటు తున్నాయి. ఈ కుంభ కోణం వెలుగులోకి రావటంతో 2012 చివరిలో అధికార పగ్గాలు చేపట్టినప్పటి నాటికంటె ఇప్పుడు అబే ప్రజాదరణకు భారీగా గండిపడింది. ఈ కుంభకోణానికి సంబంధించిన శ్వేతపత్రాన్ని గతంలో ఈ వ్యవహారాన్ని చూసిన ఆర్థికశాఖ మాజీ అధికారి ఆదివారం నాడు పార్లమెంట్‌కు సమర్పించాల్సి వుంది. అయితే తాను ప్రజాదరణ కోల్పోతున్నాన్న వాదనను కొట్టి పారేస్తున్న ప్రధాని షింజో అబే తాను రెండో ప్రపంచ యుద్ధానంతరం అమెరికా ప్రకటించిన ప్రస్తుత రాజ్యాంగాన్ని సవరించి తీరుతానని స్పష్టం చేశారు. అధికారికంగా స్వయం రక్షణ దళం (ఎస్‌డిఎఫ్)గా పిలువబ డుతున్న జపాన్ సైన్యానికి రాజ్యాంగ బద్ధతపై జరుగుతున్న చర్చకు కూడా తెరదించాలని తాను భావిస్తున్నానన్నారు. జపాన్ ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోదని, తాము భూ, నౌకా, వాయు సేనలను కొనసాగించబోమని ప్రస్తుత రాజ్యాంగం చెబుతున్న విషయం తెలిసిందే.

మేథో హక్కులు రక్షిస్తాం

బీజింగ్ దేశీయ, విదేశీ సంస్థలను సమా నంగా పరిగణిస్తామని, మేథోసంపత్తి హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని చైనా ఉప ప్రధాని హాన్ ఝెంగ్ చెప్పారు. ఆదివారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతులపై టారిఫ్‌లను పెంచుతూ వాణిజ్య పోరుకు తెరతీసిన నేపథ్యంలో చైనా ఈ ప్రకటన చేయడం విశేషం. ఇటీవల చైనా ఉప ప్రధానిగా ఎంపికయిన హాన్ తొలిసారిగా ఇక్కడ మీడి యాతో మాట్లాడుతూ బీజింగ్‌లోని చైనా అభివృద్ధి వేదికను బయట ప్రపంచానికి విస్తరించాల్సిన అవసరం వుందన్నారు. ఈ

చైనా పునరుద్ఘాటన

కార్యాచరణను తాము చేపట్టిన బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బిఆర్ఐ) ప్రాజెక్టు ద్వారా కొనసాగిస్తామని ఆయన చెప్పారు. ఏకపక్షవాదం, వాణిజ్య రక్షణ విధానాలూ ఎవరి ప్రయోజనాలకూ ఉపయోగపడవని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చైనా నేషనల్ డెవలప్‌మెంట్ అండ్ రిఫార్మ్ కమిషన ఛైర్మన్ హీ లీఫెంగ్ మాట్లాడుతూ 'సరఫరాల విషయంలో వ్యవస్థీకృత సంస్కరణలను విస్తరించటంతో పాటు అసమగ్ర సరఫరాలను నిర్మూలించేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రపంచంలో బొగ్గు, ఉక్కు ఉత్పత్తిలో అగ్రస్థానంలో వున్న చైనా ఈ ఏడాది తన ఉత్పత్తి సామర్థ్యాన్ని దాదాపు 3 కోట్ల టన్నుల మేర తగ్గించనున్నదని ఎన్‌డిఆర్‌సి ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. తాము చేపట్టిన బిఆర్ఐ ప్రాజెక్టులో భాగంగా తమ అంతర్జాతీయ సహకారాన్ని కూడా విస్తరించేందుకు చైనా కృతనిశ్చయంతో వుందని ఆయన చెప్పారు. అదే విధంగా మేథో సంపత్తి హక్కులకు చట్టపరంగా సమాన స్థాయిలో రక్షణ కల్పిస్తామని, తమ ఆర్థిక వ్యవస్థను వాస్తవిక పరిస్థితులతో సమన్వయం చేసుకుంటామని ఆయన చెప్పారు.

తాలిబన్లకు సాయం ఆరోపణలను ఖండించిన రష్యా

మాస్కో : ఆఫ్ఘన్‌లో తాలిబన్లకు సాయం అందిస్తున్నారంటూ అమెరికాకు చెందిన సైనికాధికారి చేసిన ఆరోపణలను రష్యా ఖండించిది. ఆఫ్ఘన్ తాలిబన్లకు రష్యా పూర్తి స్థాయిలో మద్దతునివ్వటంతో పాటు వారికి ఆయుధాలను కూడా అందచేస్తోందని అమెరికా సైన్యానికి చెందిన ఉన్నతాధికారి జనరల్ జాన్ నికల్సన్ గత వారం ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో ఆరోపించిన విషయం తెలిసిందే. ఉగ్రవాదం, మాదకద్రవ్యాలపై తాము తలపెట్టిన పోరుకు రష్యా చర్యలు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయని ఆయన విమర్శించారు. 'ఆఫ్ఘన్ నేతలు తమకు అందచేసిన ఆయుధాలను తాము తీసుకు వచ్చామని, ఈ ఆయుధాలను రష్యా తాలిబన్లకు అందచేసినట్లు వారు చెప్పారని ఆయన వెల్లడించారు. 'ఇవి పూర్తిగా పసలేని ఆరోపణలని కాబూల్‌లోని రష్యా దౌత్య కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇటువంటి ఆరోపణలను గతంలో తాము పలుమార్లు ఖండించామని గుర్తు చేసింది. ఇటువంటి ఆరోపణలన్నీ నిరాధారమైనవని తాము మరోసారి గుర్తు చేస్తున్నామని, ఇటువంటి అవాస్తవాల గురించి మాట్లాడవద్దని తాము అధికారులను కోరుతున్నామని రష్యా దౌత్య కార్యాలయం తన ప్రకటనలో పేర్కొంది.

ప్రజల ప్రాణాలు కాపాడిన సైనికాధికారికి ఫ్రాన్స్ ఘన నివాళి

పారిస్ : ఫ్రాన్స్‌లోని ట్రెబెస్ సూపర్ మార్కెట్‌పై జరిగిన దాడిలో ఒక మహిళను రక్షించేందుకు స్వచ్ఛందంగా బందీగా మారి ప్రాణాలర్పించిన సైనికాధికారి లెఫ్టినెంట్ కల్నల్ ఆర్నాడ్ బెల్‌ట్రేమ్‌కు ఫ్రాన్స్ ప్రజలు ఆదివారం నాడు ఘనంగా నివాళులర్పించారు. ఈ సూపర్‌మార్కెట్‌పై శుక్రవారం నాడు సాయుధులు దాడి చేసి కొందరిని బందీలుగా పట్టుకోవటంతో ఒక మహిళా ఖైదీని విడిపించేందుకు ఈ అధికారి తనకు తానుగా సాయుధులకు బందీ అయ్యాడు. అయితే తరువాత భద్రతా దళాలు, సాయుధులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన ఆయన వైద్య చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. తోటి పౌరుల కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన బెల్‌ట్రేమ్ గౌరవార్థం జాతీయ స్థాయిలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించాలని అధ్యక్షుడు మేక్రాన్ ఆదేశించారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో జరిగిన సంస్మరణ కార్యక్రమాలలో ఈ అధికారికి ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం జరిగిన ఈ దాడిలో సాయుధుడు తనకు రక్షణ కవచంగా ఒక మహిళను బంధించినపుడు ఆమెను విడిపించేందుకు ఈ అధికారి తాను నిరాయుధుడిగా అతడికి లొంగిపోయాడు. అయితే వెళ్తూ తన మొబైల్ ఫోన్‌ను ఆన్ చేసి బయట టేబుల్‌పై విడిచి వెళ్లాడు. దీనితో సూపర్ మార్కెట్‌లో ఏం జరుగుతున్నదీ పోలీసులు తెలుసుకునేందుకు వీలుపడుతుందని ఆయన భావించాడు. తుపాకీ మోతలు విన్న తక్షణం స్పందించిన పోలీసులు కాల్పులు ప్రారంభించి సాయుధుడ్ని హతమార్చారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సైనికాధికారి ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతూ మరణించారు.

మొదటి పేజీ తరువాయి

మోడీ యాప్ డేటా చోరీ చేస్తోంది : రాహుల్

డేటా నిబంధనలను ఉల్లంఘిస్తూ కేంబ్రిడ్జి ఎనాలిటికా డేటాను చోరి చేయడంతో వివాదం రాజుకుంది. ఈ వివాదం బిజెపి, కాంగ్రెస్‌ల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. ఆ రెండు పార్టీల నేతలు పరస్పరం నిందారోపణలు చేసుకుంటున్నారు. డేటా కంపెనీతో మీకు సంబంధాలున్నాయంటే, మీకు సంబంధాలున్నాయంటూ విమర్శించుకుంటున్నారు. ఈ ఆరోపణలను కాంగ్రెస్ నిరాకరించింది. బిజెపి, బీహార్‌లోని దాని మిత్రపక్షమైన జెడి(యు) 2014 ఎన్నికలతో సహా డేటా కంపెనీ సహాయం తీసుకున్నదని కాంగ్రెస్ విమర్శించింది.

అంబేద్కర్ స్ఫూర్తి ప్రదాత

అభినందించారు. ఉత్పత్తికి మద్దతుగా నిలిచే ఆధునిక సాంకేతికత సహాయంతో వారు రికార్డు స్థాయి ఉత్పత్తులు సాధించారని పేర్కొన్నారు. మోడీ తన ప్రసంగంలో ఆరోగ్య సంరక్షణను కూడా ప్రస్తావించారు. ఫిట్ ఇండియా నిర్మాణానికి యువత తగిన కృషి చేయాలన్నారు. ఫిట్ ఇండియా కోసం ఒక ఉద్యమాన్ని ప్రారంభించాలని యువతకు పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా ప్రజల నుంచి తనకు స్ఫూర్తిదాయకమైన లేఖలు ఎన్నో వచ్చాయని చెప్పారు. ఆ లేఖలు వివిధ అంశాలలో ప్రాధాన్యత కలిగి ఉన్నాయన్నారు. ఆ లేఖలలో ఒకటి అస్సాంలోని కరిమ్‌గంజ్ ప్రాంతానికి చెందిన రిక్షా పుల్లర్ అహ్మద్ అలి గురించి ఉన్నదన్నారు. అహ్మద్ అలి రిక్షా లాగుతూనే పేద పిల్లల కోసం 9 పాఠశాలలు నిర్మించాడని, ఇది తనకు ఒక దృఢ సంకల్పాన్ని కలిగిస్తోందని మోడీ అన్నారు. అదేవిధంగా కాన్పూర్‌కు చెందిన డాక్టర్ అజిత్ మోహన్ చౌదరి కూడా స్ఫూర్తి ప్రదాతగా నిలిచారన్నారు. ఆయన ఫుట్‌పాత్ మీద ఉన్న పేదల వద్దకు వెళ్ళి వైద్య సేవలు అందిస్తున్నారని, మందులు సమకూరుస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన గురించి చెప్పడం తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు.

90 శాతం మంది 'పెద్దలు' కోటీశ్వరులే..!

మాత్రమే కాదు వారి క్రిమినల్ రికార్డులను కూడా విశ్లేషించాయి. ప్రస్తుత సభ్యుల్లో దాదాపు 51 మందిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, వారిలో 20 మంది సభ్యులపై 'అత్యంత తీవ్ర స్థాయి' కేసులు నమోదయ్యాయని ఈ సంస్థలు తమ విశ్లేషణలో వెల్లడించాయి. వీరిలో పార్టీల వారీగా బిజెపిలో 14 మంది నేరచరితు లుండగా, కాంగ్రెస్ సభ్యులు ఎనిమిది మంది ఉన్నారు.

మీ కుమారుడి సంగతేంటి?

ప్రశ్నించారు. విజయ్‌మాల్యా దేశం వదిలి పరారయ్యాడని, విజయసాయిరెడ్డి పిఎంఒలో ఉంటున్నారన్నారు. విజయ్‌మాల్యా సభ్యత్వాన్ని రద్దు చేస్తే, విజయసాయిరెడ్డి సభ్యత్వాన్ని మాత్రం కొనసాగిస్తున్నారన్నారు. కావాలనే బిజెపి నేతలు టిడిపిపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని వివిధ పార్టీలు ఏపీ పక్షమో, కేంద్ర పక్షమో ఆయా పార్టీల నేతలే తేల్చుకోవాలన్నారు. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ప్రణాళిక మండలి ఉపాధ్యక్షులు కుటుంబరావు, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, ఎంపీలు సిఎం రమేష్, అవంతి శ్రీనివాస్ తదితరులు టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

గ్రామాలకు రోడ్లు వేసేదెప్పుడు?

రహదారి సౌకర్యాలు లేని విషయాన్ని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు.

ప్రతిపాదనలకే పరిమితం

రహదారి అనుసంధానం లేని ఆవాసాలు 11,907 ఉండగా వీటిలో 3,327 ఆవాసాలకు 5,469 కిలోమీటర్ల పొడవైన రోడ్డు అవసరముందని పంచాయతీరాజ్ శాఖ గుర్తించింది. దీని కోసం రూ.4,234 కోట్లతో అంచనాలు రూపొందించి ఎక్స్‌టర్నల్ ఎయిడ్ ప్రాజెక్టు(ఇఎపి), ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్(ఎఐఐబి) కింద ప్రతిపాదించింది. ప్రతిపాదనలు పంపి ఏడాదవుతున్నా కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేదు. ఈ పరిస్థితుల్లో రహదారి అనుసంధానం లేని గ్రామాలకు ఎప్పటిలోగా రహదారులు కల్పిస్తారనే అంశం ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు గిరిజన ప్రాంతాల్లో 1,398 ఆవాసాలకు 2,623.92 కిలో మీటర్ల మేర రోడ్డు సౌకర్యం కోసం రూ.8.82 కోట్లు కేటాయించినట్లు గిరిజన సంక్షేమ శాఖ చెబుతోంది.

మిర్చి కన్నీరు.. అపరాలు దిగాలు

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు రూ.8 వేలు నుంచి రూ.10 వేలు వరకు పెంచారు. మార్కెట్‌కు ఏప్రిల్ మొదటి వారం వరకూ సెలవులు ప్రకటించిన కారణంగా సరుకు మార్కెట్‌కు పెద్ద ఎత్తున వచ్చింది. ఆర్థిక సంవత్సరం చివరి రోజులు కావడంతో లెక్కలు చూసుకోవడానికి కొనుగోళ్లు నిలిపి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో మళ్లీ దళారులు కుమ్మక్కై నాణ్యత బాగున్నప్పటికీ ధరలను తగ్గించారు. శనివారం మార్కెట్ యార్డులో క్వింటా రూ.5 వేల నుంచి 6,500 పలికింది. దూర ప్రాంతాలనుంచి వచ్చిన రైతులు చేసేది లేక వచ్చిన ధరకు అమ్ముకున్నారు. దీంతో రైతులు దిక్కు తోచక వచ్చిన కాడికి అమ్ముకుంటున్నారు. మిరప విక్రయాలకు టెండరు విధానం లేకపోవడంతో ఇలాంటి దారుణాలు జరుగుతున్నట్లు రైతులు చెపుతున్నారు. దళారులు, పంటను తక్కువ ధరకు కొనుగోలు చేసి గోదాముల్లో నిల్వ చేసుకుని ప్రభుత్వం ధరలు పెంచినపుడు అమ్ముకుంటున్నారు.




గుంటూరు జిల్లా మాచర్ల మార్కెట్ యార్డులో కందుల నిల్వలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లాలో అపరాల సాగూ రైతులను నష్టాల బాట నుండి గట్టెక్కించలేకపోయింది. ఈ ఏడాది నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో వరికి అవకాశం ఇవ్వకపోవడంతో ఆరుతడి పంటలు పడించాలని ప్రభుత్వం రైతులకు సూచించింది. ఈ మేరకు జిల్లాలో గుంటూరు, నర్సరావుపేట డివిజన్లలో ఎక్కువ మంది మినుము, పెసర, శనగ, కంది సాగు చేపట్టారు. డెల్టాలో వరి తర్వాత రెండో పంటగా జొన్న, మొక్కజొన్నతోపాటు కొంతమంది మినుము, పెసర, వేరుశనగ సాగు చేశారు.__ ఎకరాల్లో మినుము, 54 వేల ఎకరాల్లో పెసర సాగు చేశారు. పెట్టుబడి భారీగా పెరిగి ఆదాయం తగ్గిందని అపరాల రైతులు గగ్గోలు పెడుతున్నారు. డెల్టాలో రెండో పంటగా ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగు చేశారు. జిల్లాలో 1.40 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా గతేడాది క్వింటా రూ.1500 ఉన్న ధర ఈ ఏడాది రూ.1100కు పడిపోయింది. సాగర్ ఆయకట్టు పరిధిలో 80 వేల ఎకరాల్లో శనగ సాగైంది. శనగల ధర క్వింటాలు రూ.4,450గా మార్క్‌ఫెడ్ ప్రకటించింది. బహిరంగ మార్కెట్‌లో రూ.3400 మాత్రమే ఉండటంతో రైతులు కొనుగోలు కేంద్రాలు వస్తున్నా ఇక్కడ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కందులకు రూ.5450 మద్దతు ధరలతో మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కొనుగోలు చేపట్టారు. బహిరంగ మార్కెట్‌లో కందుల ధర రూ.4500 మాత్రమే ఉంటోంది.

దీంతో మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలకు వస్తున్నా ఇక్కడ అధికారులు పెడుతున్న నిబంధనలను రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మాచర్ల ప్రాంతంలో వ్యాపారుల నుంచి కందులు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెపుతున్నారు. కొన్నిచోట్ల రాజకీయంగా పలుకుబడి కలిగిన వారి వద్దనే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారని రొంపిచర్ల కొనుగోలు కేంద్రంలో రైతులు ఆందోళనకు దిగారు. రెండేళ్ల కిందట కందులు, మినుములు, పెసరలు, శనగలు.. అన్ని రకాల అపరాల పంటలకు క్వింటాలు రూ.10 వేలకు తగ్గకుండా ధరలు రావడంతో రైతులు కొంత మేరకు లబ్ధిపొందగా ఈ ఏడాది భారీగా ధరలు పడిపోవడంతో కుదులేవుతున్నారు.


తీవ్రంగా నష్టపోయాను



ఎకరా పొలంలో మిరప వేశాను. జెమినీ వైరస్ వల్ల సగం పంట పోయింది. రూ.60 వేలు పెట్టుబడి పెట్టాను. రెండు వారాల క్రితం క్వింటా రూ.10 వేలు పలికింది. ఇప్పుడు అదే పంట క్వింటా రూ.6 వేలకు అడిగారు. వ్యాపారులు చెప్పిన రేటుకు అమ్ముకోవాల్సి వచ్చింది. తీవ్రంగా నష్టపోయాను.

– సి.మద్దిలేటి (రైతు), సింగవరం

రూ. లక్ష నష్టం వచ్చింది



మాది తెలంగాణ రాష్ట్రం, కర్నూలు మార్కెట్ దగ్గర కావడంతో ఇక్కడికి 30 బస్తాల మిరప తెచ్చాను. రెండెకరాలు మిరప సాగుకు రూ. 3 లక్షల పెట్టుబడి అయింది. వచ్చిన దిగుబడిని రూ.2 లక్షలకు అమ్ము కున్నాను. రూ.లక్ష నష్టం వచ్చింది. ఇప్పుడు అమ్ముకో కుంటే రేపటి నుంచి కొనుగోళ్లు జరగవని చెప్పారు.

– డి.రాజు (రైతు), ధర్మవరం, ఇటిక్యాల మండలం

లెక్కలేనితనం

(మొదటిపేజీ తరువాయి)

నిర్ద్వందంగా తిరస్కరిస్తోంది. సాధ్యమైన మేరకు బలవన్మరణాల సంఖ్యకు కోతలు పెడుతోంది. అందుకు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలను వేదికగా చేసుకుంది. తాము నవ్యాంధ్రలో అధికారంలోకొచ్చిన దగ్గర నుంచి ఇప్పటి వరకు కేవలం 248 రైతు ఆత్మహత్యలు నమోదయ్యాయని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రశ్నోత్తరాల్లో చర్చ సందర్భంగా మంత్రులు సైతం ఇదే సమాధానాన్ని వల్లె వేశారు. తమ ప్రభుత్వం వచ్చాక రైతులకు సాగును లాభసాటి చేసిందని, రుణమాఫీ సహా పలు సంక్షేమ పథకాలు అన్నదాతల ఆత్మహత్యలను బాగా తగ్గించాయని పేర్కొన్నారు. కాగా నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదికలు, వాటి ఆధారంగా సరిగ్గా ఇప్పుడే పార్లమెంట్‌లో మోడీ సర్కారు దేశ వ్యాప్తంగా రైతుల ఆత్మహత్యలను ప్రకటించింది. ఏపీలో 2014, 2015, 2016 ఈ మూడేళ్లల్లో 915 మంది రైతులు బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారని తెలిపింది. ఇదే సమయంలో వ్యవసాయ కార్మికులు 1,437 మంది ఆత్మహత్య చేసుకున్నారని వెల్లడించింది.

రాష్ట్ర సమాచారమే

ఈ నెల 20న దేశ వ్యాప్తంగా రైతుల ఆత్మహత్యలపై అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో కేంద్రం రాతపూర్వక జవాబు చెప్పింది. ఎన్‌సిఆర్‌బి గణాంకాలను ఆధారం చేసుకున్నట్లు పేర్కొంది. కాగా ఆత్మహత్యల విషయంలో ఎన్‌సిఆర్‌బి, ఎపి ప్రభుత్వ లెక్కలకు భారీ వ్యత్యాసం నెలకొంది. ఎన్‌సిఆర్‌బి ప్రతి ఏడాదీ ప్రమాద మరణాలు, ఆత్మహత్యలపై ప్రత్యేక నివేదికలు వెలువరిస్తుంది. ఆత్మహత్యల కేటగిరీలో రైతుల ఆత్మహత్యలను వేరేగా లెక్కిస్తుంది. ఎన్‌సిఆర్‌బి నేరుగా వివరాలు సేకరించదు. రాష్ట్రాల నుంచి సమాచారం తీసుకొని క్రోడీకరిస్తుంది. జాతీయ స్థాయిలో నేరాల నమోదుకు ఎన్‌సిఆర్‌బి ఉన్నట్లుగానే రాష్ట్ర పరిధిలో స్టేట్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎస్‌సిఆర్‌బి) ఉంటుంది. సాధారణంగా ఈ విభాగాన్ని క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంట్ (సిఐడి) నిర్వహిస్తుంది. ఎస్‌సిఆర్‌బి, సిఐడి వివరాలనే ఎన్‌సిఆర్‌బి ప్రకటిస్తుంది.

అంత వ్యత్యాసమా?

రైతు ఆత్మహత్యల నిర్ధారణకు పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ ముగ్గురు అధికారులతో త్రిసభ్య కమిటీ ఉంది. ఆత్మహత్య వ్యవసాయ సంబంధమైనదో కాదో విచారణ పరిపి తేలుస్తుంది. ఆ కమిటీ నిర్ధారించిందే అసలైన రైతు ఆత్మహత్య. దానికే ప్రభుత్వ సాయం అందుతుంది. పిల్లల చదువు కోసం, పెళ్లిళ్ల కోసం, కుటుంబ సభ్యుల వైద్య ఖర్చుల నిమిత్తం అప్పు చేసి వాటిని చెల్లించలేక రైతులు ఆత్మహత్య చేసుకుంటే వ్యవసాయ సంబంధం కాదు. రైతులను తాగుబోతులుగా, మాదకద్రవ్యాలు వాడే వ్యసనపరులుగా చిత్రీకరించి ఆత్మహత్యలను నమోదు చేయట్లేదు. కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు వ్యవసాయ సంక్షోభం వలన ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పటికీ వాటిని త్రిసభ్య కమిటీ అస్సలు గుర్తించట్లేదు.

తెలంగాణలో ఘోర ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

మహిళలున్నారు. ఈ విషాద ఘటన నిజామాబాద్ జిల్లా మెండోరా మండల కేంద్రం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం సమయంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం 19 మంది ప్రయాణికులతో ప్యాసింజర్ ఆటో ముప్కాల్ నుంచి మెండోరా మండల కేంద్రానికి బయలుదేరింది. మధ్యాహ్నం ఒంటిగంటన్నర సమయంలో మెండోరాకు చేరుకుంటున్న సమయంలో ఆటో డ్రైవర్ గోపి శ్రీనివాస్ వాటర్ బాటిల్ కోసం ఒక పక్కకు వంగాడు. దీంతో ఓవర్‌లోడ్‌లో ఉన్న ఆటో అదుపుతప్పింది. ఒకపక్కకు దూసుకుపోయి, రోడ్డు దిగువన ఉన్న వ్యవసాయ బావిలో పడిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి వెళ్లి సహాయక చర్యల్ని చేపట్టారు. ఏడుగురు ప్రయాణికుల్ని రక్షించారు. పోలీసులకు సమాచారాన్ని అందించారు. క్రేన్ సహాయంలో నీళ్లలో మునిగిపోయిన ఆటోను బయటకు తీశారు. అప్పటికే వారు నీట మునిగి ప్రాణాలు విడిచారు. బావి అడుగుభాగంలో ఉన్న మృతదేహాల్ని ఒక్కొక్కటిగా బయటకు తీశారు. ఈ ఘటనలో 10 మంది మృతదేహాల్ని బయటికి తీసారు. మృతుల్లో ముప్కాల్ మండలంలోని వేంపల్లికి చెందిన నాగంపేట సాయమ్మ(50), మోర్తాడ్ మండలం ధర్మోరాకు చెందిన మద్దికుంట లక్ష్మి(35), డిచ్‌పల్లి మండలం కేశాపూర్ గ్రామానికి చెందిన కేశాపూర్ గంగవ్వ(41), గుండు గంగామణి(45), వర్ని మండలం మోస్రాకు చెందిన పెద్దోళ్ల సంపత్ (19), మెండోరా మండలం (కొడిచర్ల)కు చెందిన మెట్టు వినయశ్రీ(6), బాల్కొండ మండలం చిట్టాపూర్‌కు చెందిన తెడ్డు రోజా(27)తో పాటు ఆమె ఇద్దరు పిల్లలు చక్కని(3), చిన్ను (1), ఆర్మూర్ మండలం ఆలూర్‌కు చెందిన మనస్విని(3) ఉన్నారు. మెండోరాకు చెందిన నిమ్మ సత్తెమ్మ(50) మృతదేహం కోసం గాలిస్తున్నారు. జిల్లా కలెక్టర్ రామ్మోహన్‌రావు, సిపి కార్తికేయ సహాయక చర్యల్ని పర్యవేక్షించారు. బావి వద్ద ఫెన్సింగ్ లేకపోవడం, డ్రైవర్ నిర్లక్ష్యం, అనుభవలేమి ఘటనకు కారణమని వారు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆర్మూర్ ఎసిపి శివకుమార్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ఆరు మృతదేహాల్ని ఆర్మూర్, నాలుగు మృతదేహాల్ని బాల్కొండ ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడు. బాధితులకు సహాయక చర్యల్ని వేగవంతం చేయాల్సిందిగా మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఫోన్‌ద్వారా కలెక్టర్ రామ్మోహన్‌రావును ఆదేశించారు.

8 మంది సురక్షితం

ఇదే ప్రమాదంలో ఆర్మూర్‌మండలం ఆలూర్‌కు చెందిన మనస్విని చనిపోగా ఆమె తల్లి సంగీత, కుమారుడు మనీష్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారితోపాటు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని దుబ్బకు చెందిన ప్రవీణ, డ్రైవర్ గోపి శ్రీనివాస్ సహా ముప్కాల్ వెంపల్లికి చెందిన సుమలత, పెద్దోళ్ల మల్లవ్వ, బొప్పారం చిన్నరాజు, బొప్పారం విజయ ప్రాణాలతో బయటపడ్డారు.

ప్రాణాలు కాపాడిన పైపు

బావిలో నుంచి నీటిని తోడే ఇనుపపైపు తమ ప్రాణాల్ని కాపాడాయని వేంపల్లి గ్రామానికి చెందిన క్షతగాత్రులు బొప్పారం చిన్నరాజు, విజయ తెలిపారు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా తమ బంధువుల్ని దూరం చేసుకున్నామని వాపోయారు. ఇనుప పైపును పట్టుకుని తాను, తన కాళ్ళు పట్టుకుని మరో ముగ్గురు ప్రాణాలు కాపాడుకున్నామని తెలిపారు. తమకళ్లముందే వదిన సాయమ్మ నీటిలో మునిగి చనిపోయిందని కన్నీటి పర్యంతమయ్యారు. ఆటో ప్రమాద ఘటనపై సిఎం కేసీఆర్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతిచెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



నట్టి, కృష్ణ చైతన్య, ఎస్ఎస్ థమన్, పవన్ కల్యాణ్, నితిన్, సుధాకర్ రెడ్డి, మేఘా ఆకాశ్ తదితరులు

ఇండస్ట్రీలో నాకు పెద్ద బలం పవనే

'ఛల్ మోహన్ రంగ' ప్రీ రిలీజ్ వేడుకలో నితిన్

"ఈ సినిమా 25వ సినిమా అని కాదు. ఈ సినిమా నిర్మిస్తున్నది పవన్ కల్యాణ్, త్రివిక్రమ్, మానాన్న. అందుకే నాకిష్టం. నా జీవితంలో ఇష్టమైన వ్యక్తుల్లో ఈ ముగ్గురే వస్తారు. త్రివిక్రమ్ అంటే పిచ్చి. ఇండస్ట్రీలో నాకు పెద్ద బలం పవన్ కల్యాణే. నా సినిమాకు నిర్మాత కావడం నా అదృష్టం" అని నితిన్ అన్నాడు.

నితిన్, మేఘా ఆకాశ్ నటించిన చిత్రం 'ఛల్ మోహన్ రంగ'. కృష్ణ చైతన్య దర్శకత్వం వహించారు. పవన్ కల్యాణ్, త్రివిక్రమ్, సుధాకర్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. ఏప్రిల్ ఐదున విడుదల కానున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ లుక్‌ను పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు.

పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'ఎలాంటి సపోర్టు లేకుండా ఫిల్మ్ ఇండస్ట్రీకి వస్తే ఆ బాధ ఎలా ఉంటుంది ఎలా ఉంటుందో నాకు తెలుసు. సినిమా ప్రొడ్యూస్ చేయాలని నితిన్ మాట్లాడుతున్నప్పుడు నా మీద ఇంత ప్రేమ ఉందని తెలిసింది. అపజయాలకు కుంగిపోకుండా 25 సినిమాలు చేశాడు. సంఖ్య పరంగా మా ఇద్దరిమీ సమానంగా సినిమాలు చేసినా అనుభవంలోనూ, ఏజ్‌లో కాస్త తేడాలున్నాయి. తమన్ మ్యూజిక్ డైరెక్టర్ కాకముందే 'ఖుషి' చిత్రంలో యే మేరా జహా... గీతం చేసి మెప్పించాడు. అతను ఎలాంటి సంగీతం అందిస్తాడో నాకు తెలుసు. ఈ సినిమాలో నిర్మాతనైనా నాకందరూ తెలియదు. ఈ సినిమా ఒక చక్కటి ఆనందాన్ని కలుగుజేస్తుందని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని అన్నారు.

నితిన్ మాట్లాడుతూ 'ఇది 25వ సినిమా. ఈ జర్నీ చాలా సంతోషంగా సాగింది. నేను ముందుగా కరుణాకరున్, పవన్‌కల్యాణ్‌కు థ్యాంక్స్ చెప్పాలి. చిత్రసీమలో నటుడిగా మొదట అవకాశం ఇచ్చిన తేజకు ధన్యవాదాలు. తమన్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. ఇది నా బెస్ట్ ఆల్బమ్. కల్యాణ్ గారు మాట్లాడుతూ నాకు, తనకు ఏజ్ గ్యాప్ అన్నారు. మీరే చూడండి.. ఇప్పుడు యంగెస్ట్‌గా ఉన్నది ఎవరు? పవన్ గారే కదా?. మీరు నమ్మరు...గతంలో 'ఇష్క్', 'అఆ' చిత్రాలకు మీరు ఆశీర్వాదాలు లభించాయి. ఇప్పుడు ఈ సినిమా ఫంక్షన్‌కు వచ్చారు. ఇది కూడా విజయం సాధిస్తుంది అని తెలిపారు. నితిన్ మాటలకు పవన్ స్పందిస్తూ...సినిమాలు లేకుండా సన్నబడిపోతానని చెప్పాడు.

దర్శకుడు కృష్ణ చైతన్య మాట్లాడుతూ 'పవన్ కల్యాణ్, త్రివిక్రమ్‌లను ఒక్క సారి చూస్తే చాలనుకున్నా. కానీ వాళ్లే నా సినిమాను ప్రొడ్యూస్ చేయడం చాలా ఆనందంగా ఉంది. నాకు బాగా సపోర్ట్ చేసిన వ్యక్తి, పిల్లర్ నట్టి' అని పేర్కొన్నారు. కృష్ణ చైతన్య ఓ ఉపాధ్యాయుడులా తనకు అన్నీ చెప్పేవారని మేఘా ఆకాశ్ అన్నారు.

పవన్‌కు నితిన్ వినతి...

"మీరు ఏ రంగంలో ఉన్నా రాణిస్తారు. విజయం సాధిస్తారు. మీకు అప్పుడప్పుడు ఖాళీ ఉన్నప్పుడు సినిమాలు చేయండి. సినిమాలు చేయను అని మాత్రం చెప్పకండి. మానేస్తే మానేయండి కానీ చేయను అని మాత్రం చెప్పకండి".

నవ్వుల ఫ్రస్ట్రేషన్!

రాజమౌళి దర్శకత్వంలో ఎన్టీఆర్, రామ్ చరణ్ కాంబినేషన్‌లో ఓ మల్టీ స్టారర్ తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. తాజాగా మరో మల్టీస్టారర్‌కు శ్రీకారం చుట్టారు దిల్ రాజు. వెంకటేశ్, వరుణ్ తేజ్ కలసి ఈ చిత్రంలో నటించబోతున్నారు. ఈ సినిమాకు 'ఎఫ్2' అనే టైటిల్ ఖరారు చేశారు. ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్ అనేది ఉపశీర్షిక. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందనుంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించనున్నారు. 'పటాస్', 'సుప్రీమ్', 'రాజా ది గ్రేట్' తర్వాత చేస్తోన్న చిత్రమిది. ఈ సినిమాను పూర్తిస్థాయి కుటుంబ కథా చిత్రంగా తెరకెక్కించనున్నారు. జూలై నుంచి రెగ్యులర్ చిత్రీకరణ మొదలు కానుంది.


వరుణ్ తేజ్

అనిల్ రావిపూడి


వెంకటేశ్

భరత్ అనే నేను హామీ ఇస్తున్నా...

దర్శకుడు కొరటాల శివ సినిమా అంటే సామాజిక సందేశం ఉంటుంది. ఆయన తీసిన సినిమాలు చూస్తే ఆ విషయం స్పష్టమవుతుంది. 'జనతా గ్యారేజ్' తర్వాత ఆయన చేస్తున్న సినిమా 'భరత్ అనే నేను'. మహేశ్‌బాబు హీరో. కైరా అద్వాని కథానాయిక. ఇందులో మహేశ్ అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా కనిపించబోతున్నారు. ఇప్పటికే విడుదల చేసిన ఈ సినిమా టీజర్‌కు ప్రపంచ స్థాయి రికార్డుల్లోకెక్కింది. శ్రీరామనవమి సందర్భంగా ఈ చిత్రంలోని టైటిల్ సాంగ్ ఆదివారం విడుదల చేశారు. ఈ పాట ద్వారా చిత్రంలో ముఖ్యమంత్రి పాత్రలో మహేశ్ విజన్ ఏమిటో చెప్పారు. 'విరచిస్తా నేడే నవశకం.. నినదిస్తా నిత్యం జనహితం.. నలుపెరుగని సేవే అభిమతం.. కష్టం ఏదైనా సమ్మతం,..భరత్ అనే నేను.. హామీ ఇస్తున్నాను.. బాధ్యుడ్నై ఉంటాను.. ఆఫ్ ద పీపుల్, బై ద పీపుల్, ఫర్ ద పీపుల్ ప్రతినిధిగా.. దిస్ ఈజ్ మి...అంటూ ఈ పాట సాగింది. రామజోగయ్య శాస్త్రి సాహిత్యమందించారు. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూర్చారు. డేవిడ్ సైమన్ ఆలపించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఏప్రిల్ 20న విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. ఇందులో ప్రకాష్‌రాజ్, శరత్‌కుమార్‌ల ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.



'నేల టికెట్'గాడు మేలో వస్తున్నాడు

'రాజా ది గ్రేట్ ' తర్వాత రవితేజ చేస్తోన్న సినిమా 'నేల టికెట్'. ఎస్ఆర్‌టీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతోంది. కల్యాణ్‌కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్ర నిర్మాణం ముగింపు దశలో ఉంది. కుటుంబ సమేతంగా చూసేవిధంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది అని నిర్మాత రామ్ తాళ్ళూరి తెలిపారు. మరో మూడు పాటలు చిత్రీకరించాల్సి ఉందని, దాదాపు 80శాతం చిత్రీకరణ పూర్తి చేసుకుందని చెప్పారు. ఈ చిత్రాన్ని మే 24న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు ప్రకటించారు. రవితేజ సరసన మాళవిక శర్మ హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ చిత్రంలో జగపతిబాబు, బ్రహ్మానందం, జయప్రకాశ్, రఘుబాబు, సుబ్బరాజు, ఆలి, పోసాని కృష్ణమురళి, అన్నపూర్ణమ్మ, ప్రియదర్శి, ప్రభాస్ శ్రీను, పృథ్వీ, సురేఖా వాణి, ప్రవీణ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. 'ఫిదా'ఫేం శక్తికాంత్ కార్తీక్ సంగీతం, ఛోటా కే ప్రసాద్ కూర్పు, బ్రహ్మ కడలి కళ, ముఖేష్ ఛాయాగ్రహణం సమకూరుస్తున్నారు.


'నేల టికెట్'లో రవితేజ

చాలా మంచి సినిమా తీశారు

'నీది నాది ఒకే కథ' సక్సెస్ మీట్‌లో సినీ ప్రముఖుల ప్రశంసలు



బెక్కం వేణుగోపాల్, రాజ్ కందుకూరి, తమ్మారెడ్డి భరద్వాజ, శ్రీవిష్ణు, నారా రోహిత్, వేణు ఊడుగుల, కిశోర్ తిరుమల, జి. నాగేశ్వరరావు తదితరులు

'మెంటల్‌మదిలో' తర్వాత శ్రీవిష్ణు చేసిన సినిమా 'నీది నాది ఒకే కథ'. రోహిత్ సమర్పణలో వేణు ఊడుగులని దర్శకుడిగా పరిచయమయ్యారు. ప్రశాంతి, కృష్ణ విజయ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. శ్రీ వైష్ణవి క్రియేషన్స్ పతాకంపై తెరకెక్కింది. ఈనెల 23న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా ప్రస్తుతం విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సక్సెస్ మీట్ ఏర్పాటు చేసింది. హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో జరిగిన ఈ కార్యక్రమంలో దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ, వి.ఎన్. ఆదిత్య, జి.నాగేశ్వర్ రెడ్డి, మదన్, పవన్ సాదినేని, విరించి వర్మ, సాగర్ చంద్ర, కిషోర్ తిరుమల, దేవిప్రసాద్, ప్రముఖ నిర్మాతలు రాజ్ కందుకూరి, బెక్కం వేణుగోపాల్, హీరోలు నారా రోహిత్, శ్రీవిష్ణు, చిత్ర దర్శకుడు వేణు ఊడుగుల, శ్రీ వైష్ణవి క్రియేషన్స్ అధినేత నారాయణరావు అట్లూరి, సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి, కెమెరామెన్ రాజ్ తోట, ఎడిటర్ బొంతల నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'ఈ సినిమా టైటిల్ విని ఈరోజుల్లో ఇటువంటి సినిమాలు ఎవరు చూస్తారులే అనుకున్నాను. కానీ సినిమా సమీక్షలు చూశాక చూడాలనిపించింది. ఈ సినిమా చూశాక నా మైండ్ బ్లాక్ అయ్యింది. ఫస్ట్ ఇంతమంచి సినిమా నిర్మించిన నిర్మాతలకు దండం పెట్టాలనిపించింది. ఈ కథను ఒప్పుకోవడం సినిమాగా తీయడం చాలా గొప్ప విషయం. దర్శకుడికి స్వేచ్ఛనిచ్చి కథని కథలాగా చాలా అద్భుతంగా ఈ సినిమా తీశారు' అని తెలిపారు.

నారా రోహిత్ మాట్లాడుతూ ' ఇండస్ట్రీ నుండే కాకుండా బయట నుండి కూడా చాలామంది మంచి సినిమా తీశారని అప్రిషియేట్ చేస్తున్నారు. మరో 40 థియేటర్లు పెరిగాయి. ఇంకా బెటర్ స్టేజ్‌కి వెళ్తుందని నా ఫీలింగ్. మా ఆరాన్ మీడియా వర్క్స్ బేనర్‌లో ఇంత మంచి సినిమాని ఇచ్చిన దర్శకనిర్మాతలకు థ్యాంక్స్. కొత్తదనం ఉన్న కథలతో మా బేనర్‌లో మరిన్ని సినిమాలు వస్తాయి. ఈరోజుల్లో ఇలాంటి సినిమాలు ఎవరు చూస్తారు? అని చెప్పారు. అయినా నా డబ్బు, నా ఇష్టం. నాకు నచ్చిన సినిమాలు చేసుకుంటూ వెళ్తున్నాను. ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. వారందరికీ నా థాంక్స్" అని అన్నారు.

దర్శకుడు మదన్ మాట్లాడుతూ ' వేణు నా చిత్రాలకు అసిస్టెంట్ డైరెక్టర్. ఎన్ని కష్టాలు వచ్చినా రాజీ పడని మనస్తత్వం అతనిది. అది ఈ సినిమాలో పూర్తిగా కనిపించింది. శ్రీవిష్ణు లాస్ట్ వన్ అవర్ తన స్టన్నింగ్ పెర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులందర్నీ కంటతడి పెట్టించాడు. వేణు తన కన్విక్షన్‌తో చెప్పాలనుకున్న పాయింట్‌ని పర్‌ఫెక్ట్‌గా చెప్పాడు. ఇలాంటి కొత్త కాన్సెప్ట్ సినిమాలు చేయడానికి నాలాంటి దర్శకులందరికీ కొత్త ఉత్సాహాన్ని కలిగించింది" అని పేర్కొన్నారు.

సినిమా స్టార్ట్ అయిన దగ్గర్నుండీ జనం అరుస్తూ ఎంజాయ్ చేస్తున్నారని, సినిమా చూస్తున్నంత సేపూ నాకు దర్శకుడు, శ్రీవిష్ణులే కన్పించారని దర్శకుడు జి.నాగేశ్వరరావు అన్నారు. ఈ సినిమాతో శ్రీవిష్ణు బిగ్ స్టార్ అయ్యాడని రాజ్‌కందుకూరి ప్రశంసించారు.

నటుడు, దర్శకుడు దేవిప్రసాద్ మాట్లాడుతూ 'ఓ రెండు కథలను రెడీ చేసుకొని అవి ట్రాక్ ఎక్కించే పనిలో ఉండగా వేణు ఈ చిత్ర కథ చెప్పాడు. కథ విని చాలా ఎగ్జైట్ అయ్యాను. నా క్యారెక్టర్ నచ్చి ఈ సినిమా చేశాను. సినిమా చూసి ఎక్కడెక్కడ నుండో ఫోన్‌లు చేస్తూ సినిమా చాలా బాగుందని అప్రిషియేట్ చేస్తున్నారు. ఈ సినిమా నేను చేయకపోయుండుంటే జీవితంలో ఒక గొప్ప గౌరవాన్ని మిస్ అయ్యేవాణ్ణి' అని పేర్కొన్నారు.

హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ ' ఈ టైటిల్ ఏ ముహూర్తాన వేణు పెట్టాడో గానీ వినగానే గన్ షాట్ హిట్ అన్పించింది. ప్రతి ఒక్కరూ ఇది నా కథ, మా ఇంట్లో జరిగిన కథ అని ఓన్ చేసుకుంటున్నారు' అని తెలిపారు.

ఎవ్వరికీ చెప్పొద్దు

క్రేజీ ఆంట్స్ ప్రొడక్షన్ కొత్త చిత్రాన్ని ప్రకటించింది. 'ఎవ్వరికీ చెప్పొద్దు' అనే టైటిల్‌ను ఖరారు చేసింది. నా పెళ్లి అనేది ఉపశీర్షిక. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను విడుదల చేశారు. నేను సీతారాముల పెళ్లి అందరికీ చెప్పండి...హరిత హరి పెళ్లి ఎవ్వరికీ చెప్పొద్దు అని పేర్కొంటూ హీరో హీరోయిన్లను చూపించి ఆసక్తిగా రూపొందించారు. ఈ చిత్రంలో రాకేష్ వర్రె, గార్జయి యల్లాప్రగడ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. కుటుంబ కథా చిత్రంగా రూపొందిస్తున్నారు. ఈ చిత్రానికి కథను అందిస్తూ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు బసవ శంకర్ ఏడాది. శంకర్ శర్మ బాణీలు సమకూరుస్తున్నారు. రాకేష్ వర్రె నిర్మిస్తున్నారు.



రాకేష్ వర్రె, గార్జయి



మేమే జీతాలిచ్చుకుంటాం

డిజటల్ సర్వీస్ ప్రొవైడర్లు వసూలు చేస్తున్న అద్దెలకు నిరసనగా దక్షిణాది చిత్రసీమలో థియేటర్లకు కంటెంట్‌ను ఇవ్వకూడదని నిర్ణయం తీసుకున్నారు. నిర్మాత మండలి తీసుకున్న ఈ నిర్ణయానికి చిత్రసీమలో అన్ని వర్గాల నుంచి మద్దతు లభించింది. తెలుగు ఇండస్ట్రీ మాత్రం మధ్యలో ఆ సమ్మె నుంచి బయటకొచ్చేసింది. రామ్ చరణ్, మహేశ్ బాబు, అల్లు అర్జున్ సినిమాల విడుదల వాయిదా అవుతుందని సమ్మె విరమించుకున్నారని ఆరోపణలు వచ్చాయి. తమిళనాడులో మాత్రం ఇప్పటికీ ఆ సమ్మె కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో తమిళ నిర్మాత మండలి (టీఎఫ్‌పీసీ) అధ్యక్షుడు, దక్షిణాది రాష్ట్రాల ఆర్టిస్టుల అసోసియేషన్ (ఎస్ఐఏఏ) కార్యదర్శి విశాల్ ఆదివారం సమావేశం నిర్వహించారు. దర్శకుల యూనియన్, ఎడిటర్స్ యూనియన్, ఎఫ్ఈఎఫ్ఎస్ఐ తదితర సంఘాలతో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సూర్య, కార్తి, విశాల్ నిర్మాతలకు భారం తగ్గించే కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి తమ సహాయకలకు తామే జీతాలిచ్చుకుంటామని ప్రకటించారు. ఈ సమావేశం అనంతరం దక్షిణాది ఆర్టిస్టు సంఘం అధ్యక్షుడు నాజర్ మాట్లాడుతూ 'ఇది చాలా ప్రోత్సహించాల్సిన నిర్ణయం. సూర్య మొదటి సారిగా ఈ నిర్ణయం తీసుకున్నారు. తనకు సహాయంగా ఉండేవారికి తన జేబిలో సొమ్మే ఇచ్చుకుంటానని చెప్పారు. తర్వాత తామూ అలాగే చేస్తామని కార్తి, విశాల్ ప్రకటించారు. ఈ నిర్ణయం వల్ల నిర్మాతకు రూ.12 నుంచి రూ.15 లక్షలు భారం తగ్గనుంది. ఈ మిగులు డబ్బులు వేరే వాటికి ఉపయోగించొచ్చు. మిగిలిన నటీనటులు కూడా ఈ నిర్ణయానికి సంఘీభావం తెలుపుతూ స్వాగతిస్తారని ఆశిస్తున్నా. సర్వీస్ ప్రొవైడర్ల సమస్య పరిష్కారానికి ఇదొక మార్గం. ఇదే నిర్ణయాన్ని చట్టబద్ధంగా అమలుకు ఇతర సంఘాలతో త్వరలో చర్చిస్తాం' అని తెలిపారు. దీనికి ముందు విశాల్ రజనీకాంత్‌తో సమావేశమైనట్టు వార్తలొచ్చాయి. ఈ సమస్యకు పరిష్కారం తొందరగా అన్వేషించాలని చెప్పినట్టు తెలిసింది.

పూజాకు సల్మాన్ సాయం



అలనాటి నటి పూజా దద్వాల్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సంగతి తెలిసిందే. కొంతకాలంగా ఆమె క్షయ వ్యాధితో బాధపడుతుంది. ఆమె గురించి సల్మాన్ మాట్లాడారు. 'పూజ పరిస్థితి నాకు తెలుసు... ఇది నిజంగా చాలా బాధాకర విషయం. ఆమె 'వీర్ ఘటి' సినిమాలో నాకు జోడీగా చేయలేదు. అతుల్ అగ్నిహోత్రికి జంటగా చేశారు. నాకు ఇప్పుడే ఈ విషయం తెలిసింది.. మా బృందం ఆమెకు సాయం చేసే పనిలోనే ఉంది. ఆమె త్వరలోనే కోలుకుంటుందని ఆశిస్తున్నా' అని సల్మాన్ అన్నారు.



విద్యారుణం నియమ.. నిబంధనలు

ఇది విద్యార్థులకు పరీక్షల సమయం. ఇప్పటికే పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇక వరుస క్రమంలో దిగువస్థాయి నుంచి హైస్కూల్, ఇంటర్ మీడియట్, కాలేజీ వరకూ పరీక్షలు జరగనున్నాయి. వచ్చే విద్యాసంవత్సరంలో ఏ కాలేజీలో చేరాలి.. విదేశాల్లో చదవాలంటే.. ఆర్థికంగా ఎలాంటి చేయూత అవసరం వంటి విషయాల గురించి అటు విద్యార్థులు ఇటు తల్లిదండ్రులూ ఆలోచిస్తుంటారు. ఇలాంటి నేపథ్యంలో ఉన్నత చదువులు చదవాలనే కలలుగనే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కొన్ని బ్యాంకులు విద్యారుణాలు అందజేస్తున్నాయి. ఈ.. విద్యారుణాలు ఆసరాగా.. స్వదేశంలోనే కాదు, విదేశాల్లోనూ ఉన్నత చదువులు చదువుకోడానికి ఆస్కారం ఉంది. అయితే ఆయా రుణాలను పొందాలనుకునేవారు ఎలాంటి ప్రయత్నం చేయాలి? బ్యాంకుల నియమ నిబంధనలు ఎలా ఉంటాయి? ఇదే ఇవాల్టి 'రూపాయి' ప్రత్యేకకథనం.

ఒకప్పుడు విదేశాల్లో చదవడం అనేది కేవలం ధనవంతుల కుటుంబాలకు చెందిన పిల్లలకే సాధ్యమయ్యేది. స్వదేశాల్లో ఉన్న ఉత్తమ కళాశాల, విశ్వవిద్యాలయాల్లోగాని, విదేశాల్లోగానీ చదువుకోవాలనే పేదవిద్యార్థుల కల.. కలగానే మిగిలిపోయేది. కానీ, ప్రస్తుతకాలంలో విదేశీ విద్య అనేది అన్నివర్గాల వారికి సాధ్యమవుతోంది. ఒకపక్క చదువు అనేది ఎంతో ఖరీదైన అంశంగా మారుతున్న క్రమంలో విదేశీ చదువులు మరింత భారమైన వ్యవహారమైనా.. ప్రతిభగల విద్యార్థులకు దాదాపు అన్ని బ్యాంకులు సులభంగానే విద్యారుణాలు అందిస్తున్నాయి.



విద్యారుణం.. ఇలా!

విద్యారుణం మంజూరుకు సంబంధించి ప్రతి బ్యాంకూ కొన్ని ప్రత్యేక ప్రమాణాలను పాటిస్తుంటాయి. కొన్ని బ్యాంకులు టెక్నికల్ కోర్సులకు మాత్రమే రుణాలనిస్తాయి. ముఖ్యంగా ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చదివేవారికి, దీర్ఘకాలిక కోర్సులు చదివేవారికి ప్రాధాన్యతనిస్తాయి. వొకేషనల్ కోర్సులు చదవాలనుకునే వారికి విద్యారుణాలు అందడం ఒకింత కష్టమే. రూ.నాలుగు లక్షలకు మించి విద్యారుణం తీసుకోవాలనుకున్నప్పుడు, కొంత మొత్తాన్ని మార్జిన్‌మనీగా చూపించాల్సి ఉంటుంది. సాధారణంగా ఇది 15 శాతం వరకూ ఉంటుంది. రుణాన్ని నేరుగా విద్యాసంస్థల పేరు మీదే చెల్లిస్తారు.

ఫీజులు-ఖర్చుల వివరాలు

విదేశాల్లో విద్యాభ్యాసం అంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నది. అయితే, విద్యారుణం తీసుకున్నప్పుడు ఇందులో వేటిని పరిగణనలోకి తీసుకొని రుణాన్ని అందిస్తారన్నది ముందుగానే విద్యార్థులకు తెలియాలి. ఆ వివరాలు..



ట్యూషన్ ఫీజు / లేబరేటరీ ఫీజు, / పరీక్షల ఫీజు / లైబ్రరీ ఫీజు, విద్యాభ్యాసానికి అవసరమైన పరికరాలు, పుస్తకాల కొనుగోలు కోసం ల్యాప్‌టాప్ కొనుగోలుకు ప్రయాణ ఖర్చులు / విదేశాల్లో నివసించేందుకు అయ్యే ఖర్చులు, ప్రాజెక్టు, స్టడీ టూర్లకయ్యే ఖర్చులు.. ముఖ్యమైనవి.

విద్యారుణాలు అందించే బ్యాంకుల వివరాలు

ఎస్‌బీఐ.. గ్లోబల్ ఎడ్-అడ్వాంటేజ్

అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా, యూరప్, సింగపూర్, జపాన్, హాంగ్‌కాంగ్‌లలో ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్లాలనుకునే వారికి ఈ పథకం కింద రుణం మంజూరు చేస్తోంది ఎస్‌బీఐ. దీనికింద కనీసం రూ.20 లక్షల నుంచి గరిష్టంగా రూ.1.5 కోట్ల వరకూ రుణం పొందే వీలుంది. రుణ మొత్తానికి సమానమైన ఆస్తిని బ్యాంకుకు తనఖాగా పెట్టాల్సి ఉంటుంది.

విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చులో 20 శాతం మార్జిన్ మొత్తంగా విద్యార్థి భరించాలి. మిగతా 80 శాతాన్ని రుణంగా ఇస్తుంది. స్కాలర్‌షిప్పులను మార్జిన్‌లో చూపించుకునే వీలుంది. కోర్సు కాలం, మారటోరియం సమయంలో సాధారణ వడ్డీని విధిస్తారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్స్యూరెన్స్ నుంచి బీమా పాలసీ (ఎస్‌బీఐ లైఫ్ రిన్ రక్షా) తీసుకున్న వారికి వడ్డీ రేటులో 0.50 శాతం రాయితీ లభిస్తుంది. ఇప్పటికే ఈ పాలసీ ఉంటే.. దీనిని బ్యాంకు పేరు మీద అసైన్ చేయాల్సి ఉంటుంది. విద్యార్థినులకు 0.50 శాతం వడ్డీలో రాయితీ లభిస్తుంది.



కోర్సు పూర్తయిన ఆరు నెలల తర్వాత నుంచీ రుణాన్ని.. నెలసరి వాయిదాల రూపంలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. అయితే, కోర్సు పూర్తయిన తర్వాతా అనివార్య కారణాలతో సరైన ఆదాయం పొందలేక, రుణం చెల్లింపు చేయలేకపోతే 15 ఏళ్ల దాకా మారటోరియం వ్యవధిని పొందే అవకాశం ఉంది. ఈ సమయంలో సాధారణ వడ్డీని విధిస్తారు.

బరోడా స్కాలర్ స్కీం

ఈ పథకంలో కనీస రుణ మొత్తం రూ.20 లక్షలు. విద్యార్థి కోర్సు ఫీజు మొత్తంలో 15 శాతం భరించాలి. రుణ మొత్తంలో ఒక్క శాతం (గరిష్టంగా రూ.10 వేలు) పరిశీలనా రుసుముగా వసూలు చేస్తారు. మొదటి విడత రుణం మంజూరు సమయంలో దీనిని తిరిగి ఇచ్చేస్తారు. కోర్సు పూర్తయిన తర్వాత ఏడాది లేదా ఉద్యోగం వచ్చిన తర్వాత ఆరునెలల పాటు (ఏది ముందయితే అది) మారటోరియం వ్యవధిగా వ్యవహరిస్తారు.

పంజాబ్ నేషనల్ బ్యాంకు - ఉడాన్

దేశ, విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం చేయాలనుకునే ప్రతిభావంతులైన విద్యార్థులకు పంజాబ్ నేషనల్ బ్యాంకు పలు పథకాలను అందిస్తోంది. ఇందులో విదేశీ విద్యాభ్యాసానికి ప్రత్యేకంగా ఉడాన్‌ను అందిస్తోంది.

అవసరం, విద్యార్థి, తల్లిదండ్రుల తిరిగి చెల్లింపు సామర్థ్యాన్ని బట్టి రుణ మొత్తాన్ని నిర్ణయిస్తుంది. గరిష్టంగా రూ.20లక్షల వరకూ రుణం ఇస్తుంది. రూ.4లక్షల వరకూ ఎలాంటి మార్జిన్ మొత్తమూ అక్కర్లేదు. రూ.4 లక్షలకు మించి రుణం కావాలనుకున్నప్పుడు 15% మార్జిన్‌మనీ అవసరం. రుణాన్ని 15 ఏళ్ల వ్యవధిలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ముందస్తు చెల్లింపు రుసుములు లేవు. మీ సమీపంలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు శాఖలో ఈ పథకం కింద రుణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

గతంలో ప్రభుత్వ బ్యాంకులు మాత్రమే విద్యారుణాలు అందించేవి. ప్రస్తుతం యాక్సిస్, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ వంటి ప్రయివేటు బ్యాంకులు, ఆర్థిక సంస్థలూ విద్యారుణాలు అందిస్తున్నాయి. వడ్డీ రేటు ప్రాధాన్యతల్లో తేడా ఉంటుంది. విద్యావసరాలను బట్టి.. అందుబాటులో బ్యాంకులను సంప్రదిస్తే మిగతా వివరాలు తెలుసుకోవచ్చు.

- వి. చైతన్య

గ్యారంటీ అంశాలు

విద్యారుణాల విషయంలో రూ.4 లక్షల వరకూ ఎలాంటి హామీలు, తనఖాలు అక్కర్లేదనే నిబంధనలు ఉన్నాయి. అయితే, అంతకన్నా ఎక్కువ మొత్తంలో కావాలనుకున్నప్పుడు మాత్రం బ్యాంకులు కొన్ని హామీలు, తనఖాలు అడిగే ఆస్కారం ఉంది.

రుణానికి దరఖాస్తు చేసే విద్యార్థి తల్లిదండ్రులు/సంరక్షకులు తప్పనిసరిగా రుణ సహ దరఖాస్తుదారుడిగా ఉండాలని చాలా బ్యాంకులు నిబంధన విధిస్తున్నాయి. వివాహం అయిన వ్యక్తికి జీవిత భాగస్వామి, తల్లిదండ్రులు లేదా అత్తామామలు కూడా సహ దరఖాస్తుదారులుగా ఉండే అవకాశం ఉంది. కొన్నిసార్లు మూడో వ్యక్తి హామీనీ అడుగుతున్నాయి. లేదా ఆస్తులను చూపించాల్సి రావచ్చు. తల్లిదండ్రులు/సంరక్షకుల ఆదాయం రుణ మొత్తానికి కనీసం మూడు రెట్ల వరకూ ఉంటే.. వారే పూర్తిస్థాయి హామీని ఇచ్చేందుకు అవకాశం ఉంది. ఒకవేళ రుణం రూ.7.5 లక్షలకు మించి కావాలనుకున్నప్పుడు.. రుణ మొత్తానికి సరిపడా విలువైన ఆస్తులను తనఖాగా చూపించాలి. దీంతోపాటు భవిష్యత్తు ఆదాయాన్ని బ్యాంకులకు అసైన్‌చేయాలి.

కావాల్సిన అర్హతలు



భారత పౌరులందరికీ విద్యా రుణాల కోసం దరఖాస్తు చేసుకునే అర్హత ఉంది. దరఖాస్తు చేసుకునేందుకు నిర్ణీత పత్రాలతో సిద్ధం అయితే చాలు.

ఆ వివరాలు:

- మీరు చదువుకునేందుకు దరఖాస్తు చేసుకున్న విశ్వవిద్యాలయం నుంచి ప్రవేశపత్రం (ఇందులో ఎలాంటి షరతులూ ఉండకూడదు). మొత్తం ఎంత ఖర్చవుతుందనే అంచనా పత్రం (విశ్వవిద్యాలయం నుంచి)
- దరఖాస్తుదారుడు, సహ దరఖాస్తుదారుడివి రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు నకలు, వ్యక్తిగత, చిరునామా ధ్రువీకరణ కోసం ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపుకార్డు (ఆధార్ కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సులాంటివి) విద్యార్థి, సహ దరఖాస్తుదారులకు సంబంధించిన ఆరు నెలల బ్యాంకు ఖాతా లావాదేవీల వివరాలు.
- సహ దరఖాస్తుదారుడి ఆదాయ ధ్రువీకరణ కోసం అతని వేతనం స్లిప్పు, గత రెండేళ్ల ఫారం-16, ఆదాయపు పన్ను రిటర్నులు.
- సహ దరఖాస్తుదారుడి ఆస్తులు-అప్పులకు సంబంధించిన వివరాలు, ఆస్తులకు సంబంధించిన పత్రాలు (అసలు), ఆస్తి పన్ను చెల్లింపు రశీదు
- విద్యార్థి విద్యార్హతలకు సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల జాబితాలు.

'రూపాయి'కి మీరూ రాయండి!



బ్యాంకు, పోస్టాఫీసు, షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఎల్‌ఐసీ, ఇతర బీమా పథకాలు, ఇన్‌కంటాక్స్ వంటి ఆర్థిక విషయాలపై మీరూ మీ అనుభవాలను 'రూపాయి' ఫీచర్‌కి పంపండి. సంబంధిత విషయాలపై సలహా, సూచనల్ని తెలియజేయండి. ఏవైనా సందేహాలు ఉంటే రాయండి.

మా చిరునామా

రూపాయి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com
ఫోన్ నెం. 9490099006



ఎవరిని?

మెల్ల మెల్లగా నడకోయి
జీవితకాలం మెండోయి
నా రక్షణ భారం డొప్పదోయి
నేను ఉభయచర జీవినోయి?

జవాబు : తాబేలు

జోక్:

టీచర్ : పిల్లలూ! ఒక ప్రశ్న అడుగుతాను రక్కున జవాబివ్వండి. మనం మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడవాలంటే ఏం చేయాలి?

చిన్ని : అవి ఇంకెక్కడ ఉన్నాయి సార్.. ఎప్పుడో చెరిగిపోయాయిగా?!

చుక్కలు కలపండి!



పిల్లలూ! పక్కనున్న బొమ్మలోని చుక్కలు కలిపి, రంగులు వేయండి !

అక్కడంతా అందగత్తెల్లా?!



పిల్లలూ..! ఒక వేదికపై కొందరు అమ్మాయిలు హొయలు పోతున్నారు. అందమే అసూయ పడేంత అందాన్ని సొంతం చేసుకున్న అందగత్తెలు వాళ్లు. అందరూ అందాల పోటీల్లో పాల్గొనటానికి వచ్చిన వారే. అవేమీ మిస్ యూనివర్స్, మిస్ ఇంటర్నేషనల్ బ్యూటీ పోటీలు కాదు. కొంటెచూపులతో, వయ్యారి నడకలతో కుందనపు బొమ్మలా ఉండే ఆ కొంటె కోణంగులు అసలు అమ్మాయిలే కాదంటే నమ్ముతారా?! నమ్మాలి. జపాన్ రాజధాని టోక్యోలోని కోబామా హైస్కూల్లో 'మిసెస్ కోబామా' అందాల పోటీలు ప్రతి సంవత్సరం జరుగుతాయి. అన్ని అందాల పోటీల కంటే ఇవి వినూత్నమైనవి. చిరునవ్వులు చిందిస్తూ అందాల భామ 'మిసెస్ కోబామా'గా కిరీటం అందుకుంటుంది. అయితే ఈ పోటీల్లో వింతేముంది అంటారా? అందులో పాల్గొన్న వాళ్లంతా అసలు అమ్మాయిలే కాదు. అబ్బాయిలే అందమైన అమ్మాయిల్లా తయారై, ఈ పోటీల్లో పాల్గొంటారు. అసలు వాళ్లు అబ్బాయిలేనని ఎవరూ గుర్తించలేనంత అందంగా ముస్తాబవుతారు. అన్నట్లు కోబామా హైస్కూల్లో అబ్బాయిలు మాత్రమే చదువుతారు. అమ్మాయిలకు నో ఎంట్రీ. నవంబర్, డిసెంబర్ మాసాల్లో జపాన్‌లోని అన్ని పాఠశాలల్లో 'కల్చరల్ డే' నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే సంగీతం, నృత్య పోటీలతోపాటు పెయింటింగ్, సినిమా స్క్రీనింగ్, నాటకాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. కోబామా హైస్కూల్లో కొన్ని సంవత్సరాల నుంచి అబ్బాయిలకు అందాల పోటీ నిర్వహిస్తున్నారు. వారి కట్టుబొట్టు, వేషధారణ, నడక, నవ్వే విధానం మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకుని 'మిసెస్ కోబామా'ను ప్రకటిస్తారు. అబ్బాయిలు అమ్మాయిల్లా వేషం కట్టే అందాల పోటీలను జపాన్ అంతటా నిర్వహిస్తారు. ఈ పోటీలు 'క్రాస్ డ్రెస్సింగ్ బ్యూటీ కాంటెస్ట్'గా జపాన్‌లో చాలా పాపులర్. ★





నేను వేసిన బొమ్మ





కె.దీపిక,
6వ తరగతి,
బోయలకుంట్ల (గ్రామం).
శ్రీ గురురాజ ఇంగ్లీషు మీడియం స్కూల్, నంధ్యాల.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

స్మిత్, వార్నర్‌పై జీవితకాల వేటు?



కాన్‌బెర్రా: బాల్ టాంపరింగ్ వివాదం నేపథ్యంలో స్టీవ్‌స్మిత్, డేవిడ్ వార్నర్‌లపై క్రికెట్ ఆస్ట్రేలియా కఠిన చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీరిద్దరిపై జీవిత కాల నిషేధం అవకాశం ఉందని నిపుణులు భావిసున్నారు. బాల్ టాంపరింగ్‌పై విచారణ జరుగుతున్న క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) వెల్లడించింది. బంతి ఆకారం దెబ్బ తీసేందుకు గాను బాన్ క్రాఫ్ట్ బాల్ టాంపరింగ్‌కు పాల్పడటంపై క్రికెట్ ఆస్ట్రేలియా ఆదివారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. స్మిత్, వార్నర్‌లను కెప్టెన్, వైస్ కెప్టెన్ పదవుల నుంచి తొలగిస్తున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించింది. అలాగే ఈ వివాదంలో స్టీవ్ స్మిత్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) డబుల్ షాకిచ్చింది. ఓ మ్యాచ్ నిషేధం విధించడంతో పాటుగా మొత్తం మ్యాచ్ ఫీజును (100 శాతం) కోత విధిసున్నట్లు ప్రకటించింది. ఇక బాల్ ట్యాంపరింగ్‌కు యత్నించిన ఆసీస్ ఆటగాడు బెన్‌క్రాఫ్ట్‌కు మ్యాచ్ ఫీజులో 75 శాతం కోత విధిస్తూ.. మూడు డీమెరిట్ పాయింట్లు ఇచ్చింది. కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికాతో జరుగుతోన్న మూడో టెస్టులో బెన్ క్రాఫ్ట్ ట్యాంపరింగ్‌కు యత్నించి టీవీ కెమెరాలకు దొరికిన విషయం తెలిసిందే. మ్యాచ్ అనంతరం ఈ విషయాన్ని జట్టు వ్యూహంలో భాగమేనని స్టీవ్ స్మిత్, కామెరాన్ బెన్‌క్రాఫ్ట్‌లు చేసిన తప్పును ఒప్పుకున్నారు. ఈ ఘటనపై ఆస్ట్రేలియా ప్రధానమంత్రి మాల్కమ్ టర్న్‌బుల్ సైతం స్పందించారు. కెప్టెన్ స్మిత్, జట్టు ప్రవర్తించిన తీరు తనను ఆశ్చర్యానికి గురి చేసిందని, దీన్ని ఆసీస్ క్రికెట్ అభిమానులు సైతం అంగీకరించబోరని ఆయన పేర్కొన్నారు.

జూడో పోటీలకు ఆంధ్రా జట్లు

ప్రజాశక్తి -విజయవాడ స్పోర్ట్స్

ఈ నెల 28 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో జరుగనున్న జాతీయ స్థాయి జూడో పోటీలకు బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్లు ఆదివారం ఎపి జూడో సంఘం ప్రకటించింది. బాలికల విభాగంలో ఎస్.శ్యామలాదేవి, ఎం.చిన్మయి, భారతీ, ప్రియాంక, మోబీన్, నేహ శ్రీ, ముంతాజ్, శ్రీజాలను ఎంపిక చేశారు. బాలుర విభాగంలో డి.కళ్యాణి, తిప్పి స్వామి, ఇమ్రాన్, రఘు, సయ్యద్ భాషా, సి.హచ్.గిరిష్, వి.అప్పన్నా, ఆఫ్‌నవీద్‌లు ఉన్నారు. జూనియర్ బాలికల విభాగంలో ఎస్.రత్నాదేవి, గాయత్రి, సంధ్యారాణి, విజయ దుర్గా, సాయి జ్యోతి, ఆశ్విని, సుచిత్రా, రహాశ్రీలను ఎంపిక చేశారు. జూనియర్ బాలుర విభాగంలో ఈ.శ్రీను, ముత్తయ్య, గణేష్, ప్రతాఫ్ నాయుడు, హరికృష్ణా, చందు నాయుడు, శభీర్‌లు పోటీలలో పాల్గొననున్నారు. ఈ జట్లకు కోచ్‌లుగా శేషగిరి, సామ్యూల్ రాజు, మేనేజర్లగా డి.రమేష్, జి.జయసింహాలు వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో భారత జూడో ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ నామిశెట్టి వెంకట్, ఎపి జూడో సంఘం సభ్యులు సి.కిరణ్‌కుమార్, జి.సుబ్బారావు, సి.హెచ్.శ్రీనివాస్ తదితరులు క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

మూడో టెస్టులో ఆసీస్ పరాజయం



మాన్ ఆఫ్ ది మ్యాచ్ మోర్కెల్

కేప్‌టౌన్ : బాల్ టాంపరింగ్ వివాదం ప్రభావం ఆస్ట్రేలియాపై తీవ్రంగా పడినట్లు కనిపిస్తుంది. దక్షిణాఫ్రికాతో మూడో టెస్టులో 322 పరుగుల భారీ తేడాతో ఆస్ట్రేలియా ఓటమి చూవిచూసింది. ఈ టెస్టులో దక్షిణాఫ్రికా విధించిన 430 పరుగులు లక్ష్యాన్ని చేధించడానికి బరిలోకి దిగిన ఆస్ట్రేలియా తన రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 39.4 ఓవర్లలో 107 పరుగులకే ఆలౌటయింది. దీంతో ఇంకా ఒక రోజు ఆటమిగిలి ఉండగానే దక్షిణాఫ్రికా విజయం సాధించింది. నాలుగు టెస్టుల ఈ సిరీస్‌లో 2–1తో దక్షిణాఫ్రికా ఆధిక్యంలో ఉంది. నాలుగో రోజు ఆటలో ముందుగా 5 వికెట్లు నష్టానికి 238 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన దక్షిణాఫ్రికా 373 పరుగులకు ఆలౌటయింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ సఫారీల బౌలింగ్ దాటికి నిలవలేకపోయింది. మాన్ ఆఫ్ ది మ్యాచ్ మోర్కెల్‌కు ఐదు వికెట్లు లభించాయి.



ఆఫ్ఘన్ అదరహో

- విండీస్‌పై ఘన విజయం
- ప్రపంచ కప్ అర్హత టోర్నీ ఫైనల్ మ్యాచ్

హరారే : అఫ్ఘనిస్తాన్ క్రికెట్ జట్టు మరో సంచలనం సృష్టించింది. ఇప్పటికే 2019 ప్రపంచకప్‌కు అర్హత సాధించి అందరి దృష్టిని ఆకర్షించిన ఆఫ్ఘన్ తాజాగా అర్హత టోర్నీ ఫైనల్ మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను కంగుతినిపించింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విండీస్ విధించిన 204 పరుగులు లక్ష్యాన్ని ఆఫ్ఘనిస్తాన్ అవలీలగా చేధించింది. 40.4 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 206 పరుగులతో ఆఫ్ఘనిస్తాన్ విజయాన్ని అందుకుంది. ఈ టోర్నీలో ఫైనల్‌కు చేరిన రెండు జట్లు వచ్చే ఏడాది ప్రపంచకప్‌కు అర్హత సాధించిన సంగతి తెలిసిందే. వరుణుడి కరుణతో ఫైనల్‌కు చేరిన ఒకప్పటి విశ్వ విజేత విండీస్ తుదిపోరులో అన్ని రంగాల్లోనూ విఫలమయింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 46.5 ఓవర్లలో 204 పరుగులకే ఆలౌట యింది. విండీస్ ఓపెనర్, విధ్వంసకర బ్యాట్స్‌మెన్‌గా గుర్తింపు ఉన్న క్రిస్ గేల్ కేవలం 10 పరుగులు చేసి తొలి వికెట్‌గా పెవిలియన్ చేరుకున్నాడు. ఈ తరువాత కూడా విండీస్ బ్యాట్స్‌మెన్లు ఆఫ్ఘన్ బౌలర్లపై అధిపత్యం చూపలేకపోయారు. జట్టులో రోవ్మాన్ పావెల్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 75 బంతులు ఆడిన పావెల్ రెండు సిక్స్‌లు, ఒక ఫోర్‌తో 38 పరుగులు చేశాడు. తరువాత హెత్మాయెర్ 38 పరుగులు (51 బంతుల్లో ఒక ఫోర్) చేశాడు. ఆఫ్ఘన్ బౌలర్లలో ముజీబ్ ఉర్ రహ్మాన్ నాలుగు వికెట్లు సాధించగా, గుల్బాదిన్ నయిబ్ రెండు వికెట్లు దక్కించుకున్నాడు. రషీద్ ఖాన్, దవ్లాత్ జద్రాన్, షరుపుద్దీన్ అష్రాఫ్‌కు ఒక్కో వికెట్ లభించింది.

లక్ష్య సాధనకు దిగిన ఆఫ్ఘనిస్తాన్ ఆరంభం నుంచి దాటిగా ఆడింది. 10 ఓవర్లలో గుల్బాదిన్ నయిబ్ (14) మొదటి వికెట్‌గా అయ్యాడు. ఈ దశలో అప్పటికే దాటి ఆడుతున్న ఓపెనర్ మహమ్మద్ షహజాద్‌కు రహ్మత్ షా జత కలిశాడు. ఈ జోడీ సమర్ధవంతంగా ఆడుతూ ఆఫ్ఘన్ విజయదిశగా తీసుకుని వెళ్లింది. అయితే 84 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద మహమ్మద్ షహజాద్, 51 పరుగులు (78 బంతుల్లో నాలుగు ఫోర్లు) వ్యక్తిగత స్కోరు వద్ద రహ్మత్ షా అవుటయ్యారు. ఈ తరువాత సామియిల్లాహ్ షెన్వారి (20), మహమ్మద్ నబీ (27) నాటౌట్‌గా నిలిచి ఆఫ్గన్‌కు విజయాన్ని అందించారు.

40.4 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి ఆఫ్గనిస్తాన్ 206 పరుగులు చేసింది. 93 బంతుల్లో రెండు సిక్స్‌లు, 11 ఫోర్లతో 84 పరుగుల చేసిన మహమ్మద్ షహజాద్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. జింబాబ్వే క్రికెటర్ సికిందర్ రాజాకు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించింది.

రషీద్ ఖాన్ ప్రపంచ రికార్డు



ఆఫ్ఘనిస్తాన్ యువ సంచలనం రషీద్ ఖాన్ సరికొత్త ప్రపంచ రికార్డు లిఖించాడు. అంతర్జాతీయ వన్డేల్లో అత్యంత వేగంగా 100 వికెట్లు సాధించిన బౌలర్‌గా రికార్డు నమోదు చేశాడు. 44 మ్యాచుల్లోనే రషీద్ ఖాన్ ఈ ఘనతను అందు కున్నాడు. వన్డే ప్రపంచకప్ అర్హత టోర్నీలో భాగంగా ఆదివారం వెస్టిండీస్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌తో రషీద్ ఈ ఘనత దక్కించున్నాడు. ఇప్పటి వరకూ ఆస్ట్రేలియా బౌలర్ మిచెల్ స్టార్క్ 52 మ్యాచుల్లో 100 వికెట్లతో ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా, ఆదివారం మ్యాచ్‌తో రషీద్ ఖాన్ స్టార్క్‌ను అధిగమించాడు.

23 ఓవర్ చివరి బంతికి విండీస్ ఆటగాడు పై హెూప్‌ను ఎల్బీడబ్ల్యూ చేసి 100 వికెట్ల క్లబ్‌లో చేరాడు. ముస్తాక్ (పాకిస్తాన్) 53, షేన్ బాండ్ (న్యూజిలాండ్) 54, బ్రెట్‌లీ(ఆస్ట్రేలియా) 55 మ్యాచుల్లో ఈ ఘనతను అందుకోని తరువాతి స్థానాల్లో ఉన్నారు. ఇక భారత్ నుంచి 59 మ్యాచుల్లో ఇర్ఫాన్ పఠాన్ ఈ ఫీట్‌ను సాధించి వకార్ యూనిస్(పాకిస్తాన్), మోర్కెల్ (దక్షిణాఫ్రికా)లతో సమంగా 8వ స్థానంలో నిలిచాడు. కాగా, రషీద్ ఖాన్ ఈ సీజన్‌లో ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున బరిలోకి దిగుతున్న విషయం తెలిసిందే.

ముక్కోణపు సిరీస్‌లో మహిళలకు మరో ఓటమి



డానియల్ వ్యాత్

ముంబయి : స్వదేశంలో జరుగుతున్న ముక్కోణపు సిరీస్‌లో భారత మహిళా క్రికెట్ జట్టు వరుసగా రెండో ఓటమి చవిచూసింది. ఈ సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ మహిళా క్రికెట్ జట్టు 7 వికెట్ల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌తో మహిళా టీ20ల్లో రెండో భారీ స్కోరు (198)ను సాధించినా భారత్ మ్యాచ్‌ను నిలబెట్టుకోలేకపోయింది. ఇంగ్లాండ్ ఓపెనర్ డానియల్ వ్యాత్ సెంచరీతో (124) విజృంభించడంతో ఆ జట్టు ఇంకా ఎనిమిది బంతులు ఉండగానే భారీ లక్ష్యాన్ని చేధించింది. ఈ టోర్నీలో ఈ నెల 22న జరిగిన ప్రారంభ మ్యాచ్‌లోనూ ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓటమి చెందింది. సోమవారం జరిగే మ్యాచ్‌లో భారత్, ఆస్ట్రేలియా జట్లు తలపడతాయి. ఈ నెల 29న భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుంది. ఈ నెల 31న ఫైనల్ జరుగుతుంది. ప్రస్తుతానికి భారత్ పాయింట్ల పట్టికలో చివరిస్థానంలో ఉంది. రెండు మ్యాచుల్లోనూ విజయాలతో ఇంగ్లాండ్ తొలిస్థానంలో ఉంది. భారత్ ఫైనల్ చేరే అవకాశాలు క్లిష్టంగా ఉన్నాయి. ఆదివారం మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచిన ఇంగ్లాండ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు మిథాలీరాజ్, స్మృతి మంధన శుభారంభం ఇచ్చారు. ఇద్దరూ అర్థ సెంచరీలతో రాణించారు. ముఖ్యంగా స్మృతి మంధన ధాటిగా ఆడింది. కేవలం 25 బంతుల్లోనే 50 పరుగుల స్కోరు దాటింది. దీంతో భారత్ నుంచి వేగంగా అర్థ సెంచరీ చేసిన మహిళా క్రికెటర్‌గా మంధన నిలిచింది. మొత్తంగా 40 బంతులు ఆడిన స్మృతి రెండు సిక్స్‌లు, 12 ఫోర్లతో 76 పరుగులు చేసి 13 ఓవర్‌లో తొలి వికెట్‌గా అవుటయింది. మరో వైపు 43 బంతుల్లో ఏడు ఫోర్లతో 53 పరుగులు చేసిన మిథాలీ 15 ఓవర్‌లో రెండో వికెట్‌గా పెవిలియన్ చేరుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ 30 పరుగులు చేసింది. 20 ఓవర్లలో భారత్ నాలుగు వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. లక్ష్యసాధనకు దిగిన ఇంగ్లాండ్ జట్టులో డానియెల్లి యాట్ 64 బంతుల్లో 5 సిక్స్‌లు, 15 ఫోర్లతో 124 పరుగులు చేసి జట్టుకు ఒంటి చేత్తో విజయాన్ని అందించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది. టీ20ల్లో యాట్‌కు ఇది రెండో సెంచరీ.

ఆర్టీసీ నుంచి అటువైపు

- ఆనవాయితీ కొనసాగేనా
- జూన్‌లో పదవీ విరమణ చేయనున్న డిజిపి మాలకొండయ్య
- ఆర్టీసి ఎండి నియామకంతో మొదలైన చర్చ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఎపిఎస్ ఆర్టీసి)కి తాజాగా మేనేజింగ్ డైరక్టర్ (ఎండి)ని నియమించ డంతో కొత్త డిజిపి నియామక వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ఆక్టోపస్ చీఫ్ సురేంద్రబాబుకు డిజిగా పదోన్నతి కల్పించి ఆర్టీసీ ఎండిగా నియమిస్తూ మూడు రోజుల క్రితమే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎపిఎస్ ఆర్టీసి ఎండిగా విధులు నిర్వహించిన ఐపిఎస్ అధికారులు తదనంతరకాలంలో డిజిపిగా నియమితులు కావడం గత కొంతకాలంగా ఆనవాయితీగా వస్తోంది. తాజాగా పదవీ విరమణ చేసిన మాజీ డిజిపి సాంబశివరావు కూడా ఆర్టీసి ఎండిగా విధులు నిర్వహిస్తూనే డిజిపిగా ఎంపిక య్యారు. సాంబశివరావు తరువాత ఆర్టీసి ఎండి అయిన ప్రస్తుత డిజిపి మాలకొండయ్య విషయంలోనూ అదే ఆనవాయితీ కొనసాగింది. రాష్ట్ర విభజనకు ముందు డిజిపిలుగా విధులు నిర్వహించిన ప్రసాదరావు, దినేష్‌రెడ్డి కూడా ఆర్టీసి ఎండిలుగా చేసి డిజిపిగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో మరో మూడు నెలల్లో పదవీ విరమణ చేయనున్న మాలకొండయ్య తరువాత డిజిపి ఎవరనే దానిపై అప్పుడే చర్చలు మొదలయ్యాయి. ప్రస్తుతం ఆర్టీసి ఎండిగా నియమితులైన సురేంద్రబాబు కంటే సీనియరైన విజయవాడ పోలీస్ కమిషనర్ గౌతమ్ సవాంగ్, ఎసిబి డిజి ఆర్పీ ఠాకూర్‌లు గతంలోనే డిజిపి పోస్ట్ కోసం ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. మాలకొండయ్య తరువాత సీనియార్టీని పరిగణనలోకి తీసుకుంటే వీరిద్దరిలో ఒకరిని ప్రభుత్వం డిజిపిగా నియమించాల్సి ఉంది. ఆనవాయితీ దృష్ట్యా ఆర్టీసీ ఎండి పదవి వీరిద్దలో ఒకరికి దక్కే అవకాశం ఉందని గతంలో చర్చలు సాగాయి. ప్రభుత్వం హఠాత్తుగా సురేంద్రబాబును ఆర్టీసీ ఎండిగా తెరపైకి తేవడంతో హోం శాఖలో ఏం జరుగుతుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మాలకొండయ్య పదవీకాలం జూన్‌తో ముగియనున్న నేపథ్యంలో ఈసారి డిజిపిగా ఎంపికయ్యే అధికారి ఎన్నికల సమయంలో కీలకంగా మారే అవకాశముంది. డిజిపి పదవిలో తమ ఇష్టమైన వారిని నియమించుకునే వెసులుబాటు కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చింది.

ప్రత్యామ్నాయాలవైపు ఐపిఎస్‌ల చూపు

హోం శాఖ పరంగా రాష్ట్రంలో జరుగుతున్న వ్యవహారాలపై ప్రభుత్వంపై కొందరు ఐపిఎస్‌లు అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో కొందరు అధికారులు కేంద్ర సర్వీసులకు వెళ్లిపోతూ ప్రత్యామ్నాయ మార్గాల్ని చూసుకుంటున్నారు. రాష్ట్ర విభజన తరువాత మొత్తం 145 మంది ఐపిఎస్ అధికారుల్ని రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుతానికి 120 మంది అధికారులు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా పోలీస్ వెల్ఫేర్ అదనపు డిజి అంజనా సిన్హా, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ ఐజిగా, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ అతుల్‌సింగ్ సెంట్రల్ విజిలెన్స్ సెల్‌కు డెప్యుటేషన్‌పై వెళ్లిపోయారు. ఇప్పటికే రాష్ట్రం నుంచి ఐపిఎస్ అధికారులు మధుసూదన్‌రెడ్డి, వివిఎస్‌కె కౌముది, సంతోష్ మెహ్రా, పిఎస్ఆర్ ఆంజనేయులు డెప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసుల్లో విధులు నిర్వహిస్తున్నారు. పదోన్నతులు, ప్రాధాన్యతా పోస్టుల నియామకాలకు సంబంధించి ప్రభుత్వం వివక్ష చూపుతుందనే కారణంతోనే ఎక్కువ మంది అధికారులు కేంద్ర సర్వీసుల వైపు మొగ్గు చూపుతున్నారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో మరో మూడు నెలల్లో కొత్త డిజిపిని నియమించాల్సిన క్రమంలో ఆర్టీసి ఎండిగా సురేంద్రబాబు రావడం గమనార్హం. సీనియార్టీని పరిగణనలోకి తీసుకుని గౌతమ్ సవాంగ్, ఆర్పీ ఠాకూర్‌లలో ఒకరిని నియమిస్తారా లేక పాత సంప్రదాయాన్నే కొనసాగిస్తూ సురేంద్రబాబుకే డిజిపిగా పట్టం కడతారా, లేక మాలకొండయ్యనే కొనసాగిస్తారా అనేది అధికార వర్గాల్లో ప్రస్తుతం చర్చానీయాంశంగా మారింది.



కడప జిల్లా ఒంటిమిట్టలో తలంబ్రాల తయారీకి బియ్యం, పసుపు, ముత్యాలు తీసుకెళ్తున్న మంత్రులు సోమిరెడ్డి, ఆదినారాయణరెడ్డి

వైభవంగా ధ్వజారోహణం

ప్రజాశక్తి – ఒంటిమిట్ట/నందలూరు

కడప జిల్లా ఒంటిమిట్ట ఏకశిలానగిరిలోని కోదండరామాలయంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత ఘనంగా ప్రారంభమైయ్యాయి. ఆదివారం కోదండరాముని బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో వైభవంగా జరిగింది. ఏకశిలపై వెలసిన సీతారామ, లక్ష్మణులను యాత్రికులు వేకువజాము నుండే దర్శించుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్య ఓంలో వేదపండితులు ఆగమశాస్త్రం ప్రకారం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కలశపూజ చేపట్టారు. ఉత్సవ మూర్తులను వివిధ రాష్ట్రాల నుంచి తెచ్చిన పూలతో అలంకరించారు. ధ్వజస్తంభం, వస్త్రానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను తిరు మాడ వీధిలో ఊరేగించారు. ఈ బ్రహ్మో త్సవాల ప్రారంభోత్సవానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మార్కెటింగ్‌శాఖ మంత్రి ఆదినా రాయణరెడ్డి, ప్రభుత్వ విఫ్ మేడా వెంకట మల్లిఖార్జునరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంతకుముందు శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డి రాములోరికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ధ్వజారోహణం కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి శ్రీ సీతారాముల కల్యాణం కోసం ఆలయంలో తలంబ్రాల తయారీని ప్రారంభించారు. అనంతరం బియ్యం, పసుపు, నెయ్యి కలిపి తలంబ్రాలు తయారు చేశారు. తలంబ్రాలతో పాటు ముత్యం, కంకణం ఉంచిన ప్యాకెట్లను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు టిటిడి ఘనంగా ఏర్పాట్లు చేసిందన్నారు. ఒంటిమిట్ట ఆలయాన్ని భద్రాచలం తరహాలో అభివృద్ధి పరుస్తామని తెలిపారు.

శంకుస్థాపనకే పరిమితమైన అంబేద్కర్ స్మృతివనం

- అడుగు ముందుకు పడని వైనం
- అభిప్రాయాల సేకరణ పేరుతో కాలయాపన
- ప్రచారం కోసం నిధులు వృధా
- ఇదీ సర్కారు తీరు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో



అంబేద్కర్ స్మృతివనం నిర్మాణంపై జరుగుతున్న జాప్యం పట్ల విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఏడాది గడుస్తున్నా ఒక్క అగుడు కూడా ముందుకు పడకపోవడమే ఇందుకు కారణం. కేవలం శంకుస్థాపన చేసి సర్కారు చేతులు దులుపుకుంది. అంబేద్కర్ జయంతో, వర్ధంతో వస్తే తప్ప ఈ అంశం తిరిగి తెరపైకి వచ్చే అవకాశాలు కనిపించడం లేదని దళిత సంఘాల నేతలు అంటున్నారు. మూడేళ్ల క్రితం అమరావతిలో స్మృతివనంను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. స్మృతివనాన్ని నిర్మిస్తున్నట్టు ప్రచారం చేసుకుంటూ కాలయాపన చేసిన ప్రభుత్వం గతేడాది శంకుస్థాపనకు పూనుకుంది. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం శాఖమూరులో దీనికి ముఖ్యమంత్రి భూమి పూజ చేసి ఏడాది కావస్తున్నా ఇంత వరకు ఒక ఇటుక కూడా పడలేదు. రాష్ట్రంలో ఎస్సీల గురించిన ప్రస్తావన వచ్చిన ప్రతిసారీ స్మృతివనం నిర్మిస్తున్నట్టు చెబుతూ, సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరలించడానికి ప్రయత్నిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి.

ఇందులో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పడంతో పాటు సుమారు 10వేల గ్రంథాలతో స్మారక లైబ్రరీ, 100 మందికి సరిపడా రీడింగ్ రూమ్‌లు, 20 డిజిటల్ కియోస్కులు, ప్రొజెక్షన్ థియేటర్‌తో కూడిన మెమోరియల్ పార్క్, దాదాపు 2వేల మంది కూర్చొనే ఓపెన్ థియేటర్, 500 మంది ధ్యానం చేసుకునేందుకు వీలుగా ధ్యానమందిరం, మ్యూజికల్ ఫౌంటేన్లు, లేజర్ షోలు, మల్టీపర్పస్ కన్వెన్షన్ హాల్, 3500 మంది సామర్థ్యం కలిగిన సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీని కోసం శాఖమూరులో 20 ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం నిర్మాణానికి రూ. 97.68 కోట్లు కేటాయించింది.

గతేడాది ఏప్రిల్ 14న స్మృతివనానికి భూమిపూజ చేశారు. డిజైన్ల పై నేరుగా అభిప్రాయాల్ని తెలుసుకునేందుకు దళిత, ప్రజాసంఘాల నేతలు, కార్యకర్తలతో పలు సమావేశాల్ని నిర్వహించారు. ఖరీదైన హోటళ్లలో సమావేశాల్ని నిర్వహించారు. అభిప్రాయాల్ని తెలుసుకునేందుకు ఒక వెబ్‌సైట్‌ను కూడా ఏర్పాటు చేశారు. ప్రచారాల కోసం సుమారు రూ. 2 కోట్ల వరకు ఖర్చు చేసినట్టు అధికారులు చెపుతున్నారు. ఇంత వరకు ఆకృతులే ఖరారు కానప్పుడు ఇక నిర్మాణాలు ఎప్పుడు ప్రారంభమవుతాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గొల్లప్రోలులో రాష్ట్రస్థాయి ఎడ్లబళ్ల ప్రదర్శన



పరుగుపెడుతున్న ఎడ్లు

ప్రజాశక్తి – గొల్లప్రోలు (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలులో ఎడ్లబళ్ల పరుగు ప్రదర్శన ఆదివారం ఉత్సాహభరితంగా సాగింది. ఈ ప్రదర్శనను తిలకరించేందుకు పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. జిల్లా నలుమూల నుంచి జూనియర్, సీనియర్ విభాగంలో ఎడ్ల జతలు పరుగు ప్రదర్శనలో పాల్గొన్నాయి. సీనియర్ విభాగంలో ఆరు జతలు, జూనియర్ విభాగంలో 21 జతలు పరుగు పాల్గొన్నాయి. సీనియర్ విభాగంలో గొల్లప్రోలు మండలం వన్నెపూడికి చెందిన బగురుశక్తిమణి ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలవగా, జూనియర్ విభాగంలో రాజమహేంద్రవరం రూరల్ హుకుంపేటకు చెందిన కిమిడి ప్రణీతలక్ష్మి ఎడ్ల జత ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ పోటీలు ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నాం రెండు గంటల వరకు జరిగాయి. విజేతలకు పిఠాపురం ఎంఎల్ఏ వర్మ, ఎఎంసి ఛైర్మన్ వినీల్ వర్మ, కమిటీ సభ్యులు నగదు, మెమోంటోలను అందించారు. ప్రదర్శన తిలకించేందుకు వచ్చిన వారికి రైస్‌మిల్లర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోజన సౌకర్యం కల్పించారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68